# పత్రీజీ జ్ఞాన సందేశాలు-1

రచన : బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు



# పత్రీజీ జ్ఞాన సందేశాలు-1



**రచన & ప్రచురణ : బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు**

మొదటి ముద్రణ : అక్టోబరు, 2026

ప్రతులు : 1,000

**వెల : రూ.80/-**

**పుస్తకముల కొరకు :-**

**తటవర్తి వీరరాఘవరావు,**

**తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.**

**సెల్ : 94901 71853, 9440309812**

# తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) సాధనలో స్థితులు | - | రూ.70/- |
| 3) జ్ఞానమాల | - | రూ.70/- |
| 4) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 5) బుద్ధుని సూక్తులు | - | రూ.70/- |
| 6) జీవిత పరమార్థం | - | రూ.70/- |
| 7) అవిద్య అంటే? | - | రూ.70/- |
| 8) బుద్ధుని పంచశీలాలు | - | రూ.70/- |
| 9) ఆత్మ జ్ఞానం పొందలేకపోవడానికి కారణం? | - | రూ.70/- |
| 10) ఆత్మ పరిణామక్రమం | - | రూ.70/- |
| 11) "అహం దేహాస్మి" నుంచి "అహం బ్రహ్మాస్మి" అనే స్థితికి ఎదగాలి | - | రూ.70/- |
| 12) మనసుకు వున్న మూడు దోషాలు | - | రూ.60/- |
| 13) గురుపౌర్ణమి విశిష్ఠత | - | రూ.60/- |
| 14) మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 15) ఏది సరైన సాధన? | - | రూ.60/- |
| 16) పంచకోశాలు | - | రూ.60/- |
| 17) ధార్మిక జీవితం అంటే? | - | రూ.60/- |
| 18) జీవితం ధన్యం చేసుకోవాలంటే? | - | రూ.60/- |
| 19) జన్మరాహిత్య స్థితికి మార్గం | - | రూ.60/- |
| 20) ఆత్మగా జీవించ లేకపోవడానికి కారణాలు | - | రూ.60/- |
| 21) మాయకు వశమైనవాడి లక్షణాలు | - | రూ.60/- |
| 22) ఆత్మవిశ్వాసం వల్ల కలిగే ఆధ్యాత్మిక లాభాలు ఏమిటి? | - | రూ.60/- |
| 23) దుఃఖానికి కారణం | - | రూ.60/- |
| 24) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 25) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 26) చిత్తం శాంతిగా వుండాలంటే? | - | రూ.50/- |
| 27) విషయ కర్మలు-శ్రేయోకర్మలు | - | రూ.50/- |
| 28) బాహ్య మౌనం - అంతర్ మౌనం | - | రూ.50/- |
| 29) అహంకారం ఎలా పోతుంది | - | రూ.50/- |
| 30) మానవుల్లో అసంతృప్తికి కారణం | - | రూ.50/- |
| 31) ఆధ్యాత్మిక పురోగతికి ప్రధాన శత్రువు-సోమరితనం | - | రూ.50/- |
| 32) భగవంతుని కృప | - | రూ.50/- |
| 33) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |
| 34) జీవితంలో విజయం సాధించాలంటే? | - | రూ.40/- |
| 35) మనస్సు యొక్క స్థితులు | - | రూ.40/- |

# పత్రీజీ జ్ఞాన సందేశాలు-01

మీ జ్ఞానం ఎంత పెరుగుతుందో, మీలో అంత నైపుణ్యం, అవగాహన పెరుగుతాయి. ఏ విషయాన్నైనా మీరు త్వరగా గ్రహించగలుగుతారు, అర్థం చేసుకోగలుగుతారు, అలాగే ఇతరులకు కూడా స్పష్టంగా వివరించగలుగుతారు. అటువంటి వారు అందరినీ ఆకర్షిస్తారు. జ్ఞానం ఉన్నవారు సహజంగానే ఆకట్టుకుంటారు. కారణం వారిలోని ప్రతిభ ఇతరులను అలా ఆకర్షిస్తూ ఉంటుంది.

అందుచేత ప్రతి మానవుడు జీవితంలో ముందుగా తన బుద్ధిని వికసింపజేసుకోవాలి. ఆ తర్వాత నిరంతరం జ్ఞానాన్ని పెంపొందించుకుంటూ ఉండాలి. బుద్ధి, జ్ఞానం ఉన్నప్పుడు ఆ వ్యక్తి మరింత ఉన్నతమైన జ్ఞానాన్ని పెంచుకోగలుగుతాడు, ఫలితంగా సరైన నిర్ణయాలు తీసుకుంటాడు, ధర్మ బద్ధంగా జీవిస్తాడు, చేయవలసిన పనులను చేస్తాడు, చేయకూడని వాటిని విడిచిపెడతాడు.

జ్ఞానాన్ని పెంపొందించుకున్న వ్యక్తి ప్రవర్తన ఎలా ఉంటుందో పత్రి గారు ఎంతో స్పష్టంగా వివరించారు. ఆయన అపార జ్ఞాన సంపన్నుడు, బ్రహ్మ జ్ఞాని కాబట్టి జ్ఞానం పొందిన మానవుల ప్రవర్తన ఎలా ఉంటుందో అనేక విధాలుగా వివరించారు.

ఈరోజు ఒక విషయం గురించి తెలుసుకుందాం.

**"ఆత్మ జ్ఞాని అందరికీ జ్ఞానాన్ని బోధిస్తూ సుజ్ఞాని అవుతాడు, మహా జ్ఞాని కూడా అవుతాడు."**

సుజ్ఞాని అంటే మంచి జ్ఞానం కలిగినవాడు. అలాంటి వ్యక్తి క్రమంగా ఎదుగుతాడు, అందరికీ మంచి చేస్తూ ఉంటాడు, మంచి ప్రవర్తన కలిగి ఉంటాడు, ఆయన మాట్లాడే మాటలు అందరికీ లాభిస్తాయి. అలా ఆయన

సుజ్ఞాని అవుతాడు.

ఆ తర్వాత మహా జ్ఞాని కూడా అవుతాడు. మహా అంటే గొప్ప. మహా జ్ఞాని అంటే గొప్ప జ్ఞానం కలిగినవాడు. అలాంటి వారినే బ్రహ్మర్షులు అంటారు. వారు ఆ స్థాయికి ఎదుగుతారు.

వారు కేవలం సుజ్ఞానిగా మాత్రమే కాకుండా మహా జ్ఞానిగా కూడా ఎలా ఎదుగుతారు? అందరికీ జ్ఞానాన్ని బోధిస్తూ ఉంటే, మెల్లిమెల్లిగా సుజ్ఞానిగా ఎదిగి, ఆ తర్వాత మహా జ్ఞానిగా కూడా అవుతారు. అందుకే నేను మీ అందరికీ ఎప్పుడూ ఒకటే చెబుతుంటాను, మీరు తెలుసుకున్న జ్ఞానాన్ని అందరికీ పంచండి అని.

మన అదృష్టం కొద్దీ పత్రి గారు ఎంతో మంది సుజ్ఞానులను తయారు చేశారు. చూడండి, మీరు ఏదైనా ప్రదర్శించాలంటే దానికి అనుగుణమైన ఒక వేదిక ఉండాలి.

అలా పత్రి గారు మన అందరికీ మన జ్ఞానాన్ని పెంచుకోవడానికి కావలసిన అవకాశాలను కల్పించారు. అందుకోసం ఎన్నో వేదికలను కూడా ఏర్పాటు చేశారు. ఇప్పుడు మనం కొత్తగా ఏమీ తయారు చేసుకోవాల్సిన అవసరం లేదు. వాటిని ఉపయోగించుకోవడమే చేయాలి. అన్నిచోట్లకి వెళ్ళడం, అక్కడ చెప్పడం, ఇలా చేస్తూ జ్ఞానాన్ని పెంచుకుంటూ ఉండాలి.

ఒక్కసారిగా ఎవరూ నిపుణులు కాలేరు. కానీ ఈ విధంగా నిరంతరం సాధన చేస్తూ ఉంటే కచ్చితంగా ఎదుగుతారు. మీరు గొప్పవారిగా తయారవుతారు. మీకు కొద్దిపాటి జ్ఞానం వచ్చినా ఇంట్లో ఉండలేరు. అదే మీ జ్ఞానం పెరుగుతోందనడానికి నిదర్శనం. మీకు జ్ఞానం కొద్దిగా వచ్చిందా? లేదా అన్న దానికి నిదర్శనం ఇంట్లో ఉండాలనిపించదు. తాను తెలుసుకున్న దానిని ఎంత తెలుసుకుంటే, అంత ఇతరులకు చెప్పాలి, పంచాలి అనే తపన కలుగుతుంది.

మీలో ఆ తపన కనిపిస్తూ ఉంటే, కచ్చితంగా మీలో జ్ఞానం ఉదయిస్తోందని అర్థం. అందుకే పత్రిగారు చెప్పారు. జ్ఞానాన్ని బోధిస్తూ, అంటే పంచుతూ ఉంటే అది పెరుగుతూ ఉంటుంది. జ్ఞానం పొందడంలో ఎంతో గొప్పతనం ఉందని చాలామంది అనుకుంటారు. కానీ దాని కంటే ఉన్నతమైన మరో స్థాయి కూడా ఉంది. అది మీరు పొందిన జ్ఞానాన్ని ఇతరులకు బోధిస్తూ ఉండడం, మీలాంటి మరికొంత మందిని తయారు చేయడం. అదే అన్నింటికంటే ఉన్నతమైన స్థితి. అందుచేత ఆత్మ జ్ఞాని తాను పొందిన జ్ఞానాన్ని ఇతరులకు బోధించకుండా ఉండలేడు.

మీరు పత్రి గారి 18 ఆదర్శ సూత్రాలను పరిశీలిస్తే, ఈ విషయం కూడా అందులో ఉంది. తాను పొందిన జ్ఞానాన్ని పుస్తక రూపంలో ప్రచురించి అందరికీ అందేలా ప్రయత్నం చేయాలని ఆయన చెప్పారు. అలాగే ధ్యానాన్ని, జ్ఞానాన్ని తాను పొందుతూ, ఇతరులకు కూడా బోధిస్తూ ఉండాలని చెప్పారు. మీరు ఈ 18 సూత్రాలను పరిశీలిస్తే, చివరికి మీరు గ్రహించేది మీ వల్ల ఎవరికీ చెడు జరగకూడదు, వీలైనంత ఎక్కువ మంచి చేయగలగాలి.

ఈ మంచి చేయడంలో అన్నింటికంటే గొప్పది జ్ఞానాన్ని పంచడం. ఇప్పుడు మీరంతా జ్ఞానాన్ని నేర్చుకుంటున్నారు, పంచే ప్రయత్నం కూడా చేస్తున్నారు. అందుకే భీమవరం రావడం, మార్నింగ్ జూమ్‌లో పాల్గొనడం చేస్తున్నారు.

ఈ పని ఎందుకు చేస్తున్నారు? జ్ఞానాన్ని సంపాదించుకోవడానికి, ఇతరులకు పంచడానికి చేస్తున్నారు. ఎందుకు జ్ఞానాన్ని సంపాదించుకోవాలి? అన్ని జ్ఞానాల కంటే ఆత్మజ్ఞానం గొప్పది కాబట్టి. మీరు ఆత్మజ్ఞానాన్ని ఎవరికైనా బోధిస్తే వారి అజ్ఞానం తొలగిపోతుంది. ఎప్పుడైతే అజ్ఞానం పోతుందో, వారిలో ఉన్న దుఃఖం కూడా పోతుంది.

ఇది గుర్తుపెట్టుకోండి, మానవుడు అన్నింటికంటే దేనికి ప్రాధాన్యం

ఇస్తాడంటే, దుఃఖం కలిగినప్పుడు దాని నుంచి బయటపడడానికే. ఎందుకు అలా ప్రయత్నిస్తాడు? ఎందుకంటే దుఃఖం అశాంతికి గురి చేస్తుంది, బాధకు గురి చేస్తుంది, జీవితాన్ని నరకప్రాయంగా తయారు చేస్తుంది. దానిని తట్టుకోలేడు, భరించలేడు. అందుచేత దాని నుంచి బయటపడడానికి ప్రయత్నిస్తాడు.

దుఃఖం నుంచి బయటపడాలంటే ఒక్కటే మార్గం ఉంది. అదే అజ్ఞానాన్ని తొలగించుకోవడం. అజ్ఞానాన్ని తొలగాలంటే ఆత్మజ్ఞానాన్ని పెంచుకోవాలి. మీరు ఎక్కడి నుంచి వచ్చినా, ఏ కోణంలో ఆలోచించినా, చివరికి చేరుకునేది జ్ఞానం దగ్గరకే. ఎవరైనా సరే, మీరు ఎన్ని జన్మలు ఎత్తినా, చివరికి జ్ఞానం పొందితేనే జన్మ లేని స్థితిని పొందగలుగుతారు. అంత గొప్పది జ్ఞానం. ఎందుకు జ్ఞానం గొప్పదైంది? జ్ఞానం ఆత్మకు సంబంధించినది. ఆత్మ అంటే పర బ్రహ్మ. సృష్టిలోనే పర బ్రహ్మ గొప్పవాడు. అందుచేత జ్ఞానానికి మించినది ఏదీ లేదు. అందుకే ఇప్పుడు మీరంతా ఆ జ్ఞానం మీదే దృష్టి పెడుతున్నారు, జ్ఞానాన్ని పెంచుకోవాలనే ప్రయత్నం చేస్తున్నారు.

సాధారణంగా చాలామంది, “దేహ పరమైన సమస్యలు ఉన్నప్పుడు జ్ఞానం ఏమి చేస్తుంది?” అని అంటారు. కానీ మీరు జ్ఞానాన్ని పెంచుకుంటూ ఉంటే, దేహ పరమైన సమస్యలు, ఇబ్బందులు వాటంతట అవే తొలగిపోతాయి. చాలామంది సమస్యలు పోతేనే జ్ఞానం గురించి ఆలోచిద్దాం అనుకుంటారు. కానీ మీరు ముందుగా జ్ఞానం పొందితే సమస్యలు వాటంతటకవే తగ్గిపోతాయి.

సమస్యలు ఎందుకు వస్తున్నాయి? చేయకూడని పనులు చేయడం వల్లే. ఎందుకు చేస్తున్నారు? జ్ఞానం లేకపోవడం వల్ల. ఎప్పుడైతే మీకు జ్ఞానం ఉంటుందో, చేయకూడని పనులు చేయరు. అప్పుడు కష్టాలు కూడా రావు, దుఃఖం కూడా మీ దగ్గరకు రాదు.

అందుచేత ఏ రకంగా చూసినా ప్రతి ఒక్కరికీ జ్ఞానం అనేది చాలా

అవసరం. ఇది గుర్తుపెట్టుకోండి. చాలామంది ఎన్నో కావాలని అనుకుంటారు. కానీ జ్ఞానం గురించి మాత్రం ఆలోచించరు. అందుకే కొన్ని వందల జన్మలు అజ్ఞానంలోనే గడిచిపోతుంటాయి. సుమారు 300--350 జన్మలు దాటిన తర్వాత సద్గురువు లభించి, జ్ఞానం యొక్క ప్రాముఖ్యతను బోధించడం వల్ల ఒక్కొక్కరు ఈ జ్ఞాన మార్గంలోకి వస్తారు.

ప్రతి ఒక్కరూ జ్ఞానిగా అవ్వాలి, తర్వాత సుజ్ఞానిగా అవ్వాలి, ఆ తర్వాత మహా జ్ఞానిగా కూడా ఎదగాలి, అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ ఉండాలి. మన అదృష్టం ఏమిటంటే? పత్రి గారు గురువుగా లభించటం, జ్ఞానాన్ని పొందే ఈ "శ్వాస మీద ధ్యాస" అనే ధ్యానాన్ని మనకు అందించటం.

మానవుడు అంటే శరీరం, మనసు, ఆత్మ. కళ్లుమూసుకున్నప్పుడు ఆలోచనలు వస్తే, "శ్వాస మీద ధ్యాస" పెడితే ఆ ఆలోచనలు ఆగిపోతాయి. అప్పుడు మిగిలేది ఆత్మ మాత్రమే, అదే పర బ్రహ్మ.

పర బ్రహ్మ అపార జ్ఞాన సంపన్నుడు. పరమశివుడు వంటి మహానుభావులు కూడా ఇంకా జ్ఞానాన్ని పెంచుకోవడానికి తీవ్ర సాధన చేస్తూనే ఉంటారు. అలాగే పత్రి గారి వంటి మహానుభావులు కూడా ఇంకా జ్ఞానాన్ని పెంచుకోవాలనే ఉద్దేశంతో అందరి అనుభవాలను వింటారు, పుస్తకాలు చదువుతారు. ఎందుకు అంత ఆసక్తి చూపిస్తున్నారు? జ్ఞానం గొప్పది కాబట్టి.

పత్రి గారు చెబుతూ ఉంటారు జ్ఞానాన్ని విత్తన దశ నుంచి వృక్ష దశ వరకు పెంచుకోవాలని. ముందు విత్తనం విత్తనంగానే ఉంటుంది. దానిని భూమిలో నాటి నీరు పోస్తే కొన్నాళ్ళకు మొక్క వస్తుంది. మీరు గమనించండి, ఇంతవరకు అక్కడ విత్తనం ఉండేది. ఇప్పుడు చూస్తే విత్తనం కనిపించదు, మొక్క కనిపిస్తుంది. అంటే విత్తన దశ ముగిసింది అని అర్థం.

ఆ తర్వాత మొక్క ఉంటుంది, కానీ మొక్క కూడా అలాగే ఉండదు. కొంతకాలానికి అది చెట్టుగా మారుతుంది. చెట్టు కూడా అలాగే ఉండదు.

మరింత పెరిగి మహావృక్షంగా మారుతుంది.

వృక్ష స్థితికి వచ్చిన తర్వాత అది అనంతంగా విస్తరిస్తూ ఉంటుంది. మర్రి వృక్షం ఎలా విస్తరిస్తుందో మీ అందరికీ తెలుసు. దాని పని పెరుగుతూనే ఉండటం. ఎంత పెరుగుతుందో, ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో వ్యాపిస్తుందో చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. అదే వృక్ష దశ.

అలాగే జ్ఞాని, ప్రజ్ఞాని, విజ్ఞాని అనే స్థాయిలను దాటి, విశేషమైన జ్ఞానంతో నిరంతరం ఎదుగుతూ, ఆ జ్ఞానాన్ని అందరికీ పంచుతూ ఉంటే సుజ్ఞాని అవుతాడు, మహా జ్ఞాని కూడా అవుతాడు. ప్రతి ఒక్కరూ ఆ స్థితికి ఎదగాలి, ఇప్పుడు మీరంతా కూడా అదే పని చేస్తున్నారు.

ఏది ఏమైనా నేను ఒకటే చెబుతున్నాను. మీరందరూ చాలా గొప్ప స్థితిలో ఉన్నారు, ఇందులో ఎలాంటి సందేహం లేదు. మీకు కొన్నిసార్లు, "నేను ఇంకా ఏమి ఎదిగాను? ఏమి సాధించాను?" అని అనిపించవచ్చు. కానీ పొయ్యి మీద అన్నం పెట్టిన వెంటనే ఉడికిపోదు కదా? అలాగే ఈ మార్గంలో కూడా ఫలితం ఒక్కసారిగా రాదు.

మీరు ఈ మార్గంలో ప్రవేశించారు, ప్రయత్నం చేస్తున్నారు. అలాగే కొనసాగిస్తే మెల్లిమెల్లిగా మీకు తెలియకుండానే జ్ఞానం పెరుగుతుంది, అందువల్ల ఇక్కడ నిరుత్సాహపడాల్సిన అవసరం లేదు.

అందుకే పత్రి గారు **"ఆత్మ జ్ఞాని అందరికీ జ్ఞానాన్ని బోధిస్తూ ఉంటే సుజ్ఞాని అవుతాడు, మహా జ్ఞాని కూడా అవుతాడు"** అన్నారు.

అందుకే ఈ ప్రయత్నం. మనసులో మార్పు రావాలంటే కచ్చితంగా "శ్వాస మీద ధ్యాస" అనే ధ్యానం చేయాలి. దానికి సహకరించేది సాత్వికమైన శాఖాహారం. ఈ రెండింటినీ పాటించండి, మీరు కూడా కొన్నాళ్ళకు తెలియకుండానే మహా జ్ఞాన సంపన్నులు అవుతారు.

పత్రి గారు ఎప్పుడూ కూడా మనల్ని జ్ఞానులుగా చేయాలనే

అనుకునేవారు. మనమందరం జ్ఞానులు కావాలనేదే ఆయన కోరిక. ఎందుకంటే జ్ఞానం పొందితే అజ్ఞానం తొలగిపోతుంది. వెలుగు వస్తే చీకటి ఎలా తొలగి పోతుందో, అలాగే జ్ఞానం కలిగితే అజ్ఞానం కూడా తొలగిపోతుంది. చీకటిలో ఉంటే జీవితం ఎంత దుఃఖకరంగా ఉంటుందో ఆలోచించండి. ఉదాహరణకు, మీ ఇంట్లో కరెంట్ మొత్తం పోయింది అనుకోండి. ఏదో ఫాల్ట్ వచ్చి, మీటర్ దగ్గర సమస్య ఏర్పడి, వైర్లు కూడా కాలిపోయాయి. అప్పుడు రాత్రంతా చీకట్లోనే ఉండాల్సి వస్తుంది. ఎంత ఇబ్బంది పడతారో చూడండి. ఏదీ సరిగా కనిపించదు. ఈ మధ్య కాలంలో చాలామంది అగ్గిపెట్టె కూడా ఇంట్లో ఉంచుకోవడం లేదు. అలాంటి సమయంలో ఏం చేస్తారు? చీకట్లోనే తడుముకుంటూ పనులు చేసుకోవాల్సి వస్తుంది.

అది ఎంత కష్టంగా ఉంటుందో చూడండి. అదే వెలుగు ఉంటే మీ పనులన్నీ ఎంత చక్కగా, సరైన విధంగా, సులభంగా చేసుకుంటారు. కానీ చీకట్లో మాత్రం తడుముకుంటూ, కాలికి ఏదో తగులుతూ, ఏముందో తెలియక ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అంటే చీకటి దుఃఖకరం, వెలుగు ఆనందకరం. అలాగే అజ్ఞానం ఎవరికైనా దుఃఖాన్ని కలిగిస్తుంది, జ్ఞానం ఆనందాన్ని కలిగిస్తుంది. ఇదే ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన విషయం.

అందుకే పత్రి గారు జ్ఞానం పొందితే ఎన్ని లాభాలు కలుగుతాయో వివరించడమే కాకుండా, జ్ఞానుల ప్రవర్తన ఎలా ఉంటుందో కూడా ఎన్నో ఉదాహరణలతో బోధించారు. ఆయన తపన అంతా అందరినీ జ్ఞానులుగా చేయడమే, వేరే ఉద్దేశం గానీ, ఆశయం గానీ ఏమీ లేదు. అలాగే ఆయన ప్రతిరోజూ ఇదే విషయాన్ని వివిధ ఉదాహరణలతో చెప్పేవారు.

ఒక రోజు ముండకోపనిషత్తులో చెప్పబడిన ఒక విషయాన్ని వివరించారు.

**"ద్వా సుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే ।**
**తయోరణ్యం పిప్పలం స్వాద్వత్త్యనశ్నన్నన్యో అభిచాకశీతి ॥"**

తాత్పర్యం: ఒక చెట్టు కొమ్మపై ఒక పక్షి ఉంది. అదే చెట్టు క్రింది కొమ్మపై ఇంకొక పక్షి ఉంది. ఆ రెండు పక్షులు ఒకే రకంగా ఉంటాయి. కానీ పై కొమ్మపై ఉన్న పక్షి ప్రశాంతంగా ఉంటుంది. క్రింద కొమ్మపై ఉన్న పక్షి మాత్రం అశాంతిగా ఉంటుంది.

ఆ చెట్టుపై కొన్ని చేదు ఫలాలు, కొన్ని మధురమైన తీయటి ఫలాలు వున్నాయి. మీరు గమనించండి, కొన్ని రకాల పండ్లు పచ్చిగా ఉన్నప్పుడు చేదుగా లేదా రుచిగా ఉండవు. బాగా పండిన తర్వాత మాత్రం ఎంతో తీయగా మారిపోతాయి.

పై కొమ్మపై ఉన్న పక్షి మాత్రం హాయిగా, ప్రశాంతంగా ఉంటుంది. దానికి ఎలాంటి గొడవ ఉండదు. కానీ క్రింద కొమ్మపై ఉన్న పక్షి అశాంతిగా ఇటు అటు గంతులు వేస్తూ తిరుగుతుంది. అది చేదు ఫలాలు తిన్నప్పుడు దుఃఖపడుతుంది, బాధపడుతుంది. ఆ చేదు ఫలం దానికి నచ్చదు. అలా దుఃఖపడుతూ పైకి చూస్తూ, పై కొమ్మవైపు వెళ్ళడం ప్రారంభిస్తుంది. మధురమైన ఫలాలు తిన్నప్పుడు సంతోషిస్తుంది. ఈ విధంగా చేదు ఫలాలను అనుభవిస్తూ, క్రమంగా పైకి పైకి వెళ్తూ చివరకు పై కొమ్మపై ఉన్న పక్షిని చేరుకుంటుంది. ఆ పై పక్షిని చేరుకున్న తర్వాత దానికి చాలా ఆశ్చర్యం కలుగుతుంది. ఎందుకంటే, "అది వేరు కాదు, నేను వేరు కాదు. ఇద్దరం ఒకటే" అని దానికి అర్థమవుతుంది.

అంటే ఒకే చెట్టుపై రెండు పక్షుల్లా కనిపిస్తున్నప్పటికీ, క్రింద పక్షి చేదు ఫలాలను అనుభవిస్తూ క్రమంగా పైకి చేరిన తర్వాత, రెండూ వేర్వేరు కావని, రెండూ ఒకటేనని గ్రహిస్తుంది. బయటకు రెండుగా కనిపించినా, వాస్తవానికి అవి ఒకటేనని అర్థమవుతుంది.

అలాగే, పై పక్షి పూర్ణాత్మకు, క్రింద పక్షి జీవాత్మకు ప్రతీక. పై పక్షి ఏమిటంటే సత్యలోకంలో ఉన్న పూర్ణాత్మ. క్రింద పక్షి ఏమిటంటే భూలోకంలో ఉన్న జీవాత్మ.

సత్యలోకంలో ఉన్న పూర్ణాత్మ ఎప్పుడూ ఆనంద స్థితిలో ఉంటుంది. కానీ భూమిపై ఉన్న జీవాత్మ మాత్రం అశాంతి, దుఃఖం, కష్టాలు, బాధలు, ఇబ్బందుల వల్ల అశాంతిగా ఉంటుంది. ఏం చేయాలో తెలియక, “ఇదేం జీవితం?” అని బాధపడుతూ ఉంటుంది.

ఇప్పుడు మీరందరూ కూడా ఇదే అనుభవిస్తున్నారు. మీకు వచ్చే కష్టాలే కాకుండా, మీ భార్య/భర్తకు వచ్చినా, పిల్లలకు వచ్చినా వాటిని కూడా మీదిగానే భావించి ఎంతో బాధపడుతుంటారు, అలా అశాంతికి లోనవుతారు.

సమస్యలు, కష్టాలు, నష్టాలు, అవమానాలు ఇవన్నీ జీవితంలో వస్తూనే ఉంటాయి. ఈ కష్టాలు, నష్టాలు, అవమానాలన్నీ ఆ చేదు ఫలాల వంటివే. ఆ పక్షి చేదు ఫలాలు తిన్నప్పుడు పైకి చూస్తూ ఒక్కో కొమ్మ పైకి ఎక్కినట్లే, మానవుడు కూడా ఈ కష్టాలు, నష్టాలు, సమస్యలు, అవమానాలను అనుభవిస్తూ వాటి ద్వారా పాఠాలు నేర్చుకొని, జ్ఞానాన్ని పెంచుకుంటూ పై పక్షి వైపు, అంటే పూర్ణాత్మకు దగ్గరవుతాడు.

అలా ఒక్కో లోకాన్ని దాటుతూ, పూర్ణాత్మకు మరింత చేరువవుతాడు. ఒక్కో జన్మలో కష్టాలను అనుభవిస్తూ, జ్ఞానాన్ని పెంచుకుంటూ, క్రమంగా ఉన్నత లోకాలకు చేరుకుంటాడు. చివరికి సత్యలోకాన్ని చేరుకున్నప్పుడు, “పూర్ణాత్మ వేరు కాదు, నేను వేరు కాదు, ఇద్దరం ఒకటే” అనే సత్యం అర్థమవుతుంది. అంతవరకు పూర్ణాత్మ వేరు, నేను వేరు అని భావించి జీవిస్తాడు. కానీ జ్ఞానం వచ్చిన తర్వాత ఇద్దరూ ఒకటేనని గ్రహిస్తాడు.

కానీ జీవితంలో ఎలాంటి కష్టాలు లేకుండా, అన్నీ బాగానే ఉన్నాయి, వైభవంగా ఉన్నాయి, సమస్యలు లేవు, బాధలు లేవు, అవమానాలు లేవు,

ఇబ్బందులు లేవు అనుకుంటూ ఉంటే, అలాంటి స్థితిలో మనిషి పెద్దగా ఏమీ నేర్చుకోడు. అనుభవాలు లేకపోవడంతో జ్ఞానం కూడా పెరగదు. ఎన్ని జన్మలైనా అదే స్థితిలో ఉండిపోతాడు.

అందుకే కష్టాల ద్వారానే పాఠాలు నేర్చుకొని, జ్ఞానాన్ని సంపాదించి, ఉన్నత లోకాలకు చేరుకొని, చివరికి పూర్ణాత్మ స్థితిని పొందుతాడు. అక్కడికి చేరుకున్న తర్వాత ఈ సత్యం పూర్తిగా అర్థమవుతుంది. దీనినే జీవబ్రహ్మైక్యం అంటారు.

భూమిపై ఉన్న జీవుడు, సత్యలోకంలో ఉన్న దేవుడు వేర్వేరు అని భావిస్తూ సాధన చేస్తాడు. కానీ జ్ఞానం పెరిగి, క్రమంగా ఉన్నత స్థితికి చేరుకున్న తర్వాత, జీవుడు వెళ్ళి బ్రహ్మంలో కలిసిపోవడం కాదు, బ్రహ్మతో ఐక్యం కావడం కాదు, ఈ జీవుడే ఆ బ్రహ్మమని, ఈ జీవుడే ఆ దేవుడని తెలుసుకుంటాడు. అప్పుడు అతను ఆశ్చర్యపోతాడు. “నేను వేరు కాదా? నేనే ఆ బ్రహ్మనా? ఇప్పటివరకు నేను వేరని అనుకున్నానా!” అని ఆశ్చర్యపడతాడు.

ఇప్పుడు చూడండి, భూమిపై ఉన్న చాలామంది “దేవుడు వేరు, నేను వేరు” అని అనుకుంటారు. కానీ “ఆ దేవుడే నేను” అని తెలుసుకున్నవాడే మహా జ్ఞాని. వాస్తవానికి జీవాత్మ, పరమాత్మ అని రెండు లేవు. ఉన్నది ఒక్కటే. రెండుగా కనిపిస్తున్నాయంతే. ఇదే తెలుసుకోవాల్సిన అద్భుతమైన జ్ఞానం.

పాపం, ఆ క్రింది పక్షి కూడా మొదట అలాగే అనుకుంది. “నా పరిస్థితి ఇలా ఉంది. పై పక్షి ఎంత బాగుంది! అది పైన ఉంది, నేను కింద ఉన్నాను” అని భావించింది. కానీ పై పక్షికి ఒక సత్యం తెలుసు “నేనే క్రింద పక్షిగా కూడా ఉన్నాను” అనే జ్ఞానం దానికి ఉంది. అయితే క్రింద పక్షికి ఆ విషయం తెలియదు. “నేనే పై పక్షిని” అనే జ్ఞానం దానికి ఇంకా కలగలేదు. ఎందుకంటే దానికి పూర్ణజ్ఞానం లేదు. పై పక్షి మాత్రం పూర్ణజ్ఞానంతో

ఉంటుంది.

మరి ఆ జ్ఞానం క్రింద పక్షికి ఎప్పుడు కలుగుతుంది? కష్టాలను అనుభవిస్తూ, బాధలను ఎదుర్కొంటూ, ఎన్నో అనుభవాల ద్వారా జ్ఞానాన్ని పెంచుకుంటూ, క్రమంగా పూర్ణజ్ఞానాన్ని పొందినప్పుడు ఆ సత్యం దానికి అర్థమవుతుంది.

అందుకే, “నాయనా! నువ్వు వేరు, దేవుడు వేరు కాదు. ఇద్దరూ ఒకటే. ఈ సృష్టిలో రెండనే భావన లేదు, ఉన్నది ఒక్కటే” అనే పరమ సత్యాన్ని తెలియజేయడానికే ముండకోపనిషత్తు ఈ ఉపమానాన్ని బోధించింది. ఉపనిషత్తులన్నీ కూడా పరమ జ్ఞానాన్నే బోధిస్తాయి. ఉపనిషత్తులను అధ్యయనం చేయకపోతే ఈ జ్ఞానం పూర్తిగా అర్థం కాదు. అప్పటివరకు ద్వైత భావంతోనే జీవిస్తారు.

ఎప్పుడైతే మీరు పూర్ణజ్ఞానాన్ని పొందుతారో! అప్పుడే అద్వైత భావంలోకి వస్తారు. అందుకే శంకరాచార్యుల వారు, “రెండు లేవు, ఉన్నది ఒక్కటే” అని బోధించారు. ఈ సత్యాన్ని మీరు తప్పకుండా తెలుసుకోవాలి.

ఈ సత్యం అర్థం కాకపోవడం వల్ల మనుషులు ఒకరిని ఒకరు వేరుగా భావిస్తూ, ద్వేషిస్తూ, అసూయపడుతూ, అవమానిస్తూ, బాధిస్తూ, దోచుకుంటూ, తమ ఆధిపత్యాన్ని చూపించాలని ప్రయత్నిస్తుంటారు. ఎదుటివాడు వేరే వ్యక్తి అని భావించి అతనిని తిడుతూ, అవమానిస్తూ, బాధిస్తూ ఎన్నో కర్మలు చేస్తారు.

ఆ కర్మల ఫలితంగా మరిన్ని కష్టాలను తెచ్చుకొని, వాటినే అనుభవిస్తూ, “నా జీవితం ఇలా ఎందుకు అయిపోయింది?” అని బాధపడుతుంటారు. చివరికి “ఎందుకు ఈ జీవితం?” అని ఏడుస్తూ కూర్చుంటారు.

కానీ ఇక్కడ రెండు లేవు, ఇద్దరూ లేరు. ఉన్నది ఒక్కటే. “అంతా

నేనే” అనే స్థితికి చేరుకున్నప్పుడు, ఇక ద్వేషం ఎక్కడ ఉంటుంది? అసూయ ఎక్కడ ఉంటుంది? ఇతరులపై ఆధిపత్యం చెలాయించాలని కోరిక ఎక్కడ ఉంటుంది? ఎదుటివారిని ఏ విధంగానైనా అణగదొక్కాలని భావన ఎలా కలుగుతుంది? ఈ విషయాలన్నీ తెలుసుకోవడమే నిజమైన జ్ఞానం.

సుమారు 350 జన్మలు దాటితే తప్ప ఈ విషయాలు పూర్తిగా అర్థం కావు. ఒకవేళ ఎవరికైనా ఈ విషయాలు చెప్పినా, ఆ స్థాయికి ఇంకా చేరుకోకపోతే వారికి అర్థం కాదు.

అందుకే నేను మళ్ళీ మళ్ళీ చెబుతున్నాను  మీరందరూ ప్రతిరోజూ అద్భుతమైన జ్ఞానాన్ని తెలుసుకుంటున్నరు. నిజంగా మీరు ఎంతో అదృష్టవంతులు. ఏ జన్మలో చేసుకున్న పుణ్యఫలమో, ఈ జ్ఞానాన్ని పొందే అవకాశం మీకు లభించింది. ఇప్పుడు మీరు ఈ జ్ఞానాన్ని గ్రహించే స్థితిలో ఉన్నారు.

మీరు కొంత కృషి చేస్తే, చాలా తక్కువ జన్మల్లోనే జీవిత లక్ష్యమైన మోక్షాన్ని, ఆ పూర్ణాత్మ స్థితిని పొందగలుగుతారు. ఈ విషయాన్ని మీకు అర్థమయ్యేలా చేయడానికే నేను ఇన్ని విషయాలు చెబుతున్నాను.

ఈ విషయాలన్నీ మీరు సరిగా అర్థం చేసుకుంటే, మీ ప్రవర్తనలో గొప్ప మార్పు వస్తుంది. అజ్ఞానంలో ఉన్నవారి ప్రవర్తన ఒక విధంగా ఉంటుంది. కానీ మీరు జ్ఞానాన్ని పెంపొందించుకుంటున్న వారిగా ఎదుటి వారి ప్రవర్తన ఎలా ఉన్నా, అతడు రాక్షసుడైనా, దుష్టుడైనా, దుర్మార్గుడైనా, మీరు మాత్రం క్షమించి వదిలేయాలి. ఎందుకంటే అతడు చేసిన కర్మకు తగిన ఫలితాన్ని ప్రకృతే వాడికి ఇస్తుంది.

# "ఆత్మ జ్ఞాని ఎవరి అనుభవం వారిది, ఎవరి జీవితం వారిది అని తెలుసుకుంటాడు"

ప్రతి ఒక్కరికీ ఈ విషయంపై స్పష్టమైన అవగాహన ఉండాలి. ఈ ధ్యాన మార్గంలోకి రాక ముందు అజ్ఞానంలో ఉన్న వ్యక్తి ఎన్నో విధాలుగా ఆలోచిస్తాడు. కానీ ఆత్మ జ్ఞాని అన్ని విషయాలను వాటి యథార్థ స్వరూపంలో తెలుసుకుంటాడు. అన్ని విషయాలను సమగ్రంగా అవగాహన చేసుకోగలిగిన వాడే ఆత్మ జ్ఞాని.

ఇక్కడ రెండు ముఖ్యమైన విషయాలు ఉన్నాయి. మొదటిది "ఎవరి అనుభవం వారిది", రెండోది "ఎవరి జీవితం వారిది". ఆత్మ జ్ఞాని ఈ రెండు సత్యాలను స్పష్టంగా తెలుసుకుంటాడు. ఇక్కడ అనుభవాల గురించి చెప్పబడింది, జీవితానికి సంబంధించిన సత్యం కూడా చెప్పబడింది.

ముందుగా "ఎవరి జీవితం వారిది" అనే విషయాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేద్దాం. పత్రి గారు "ఎవరి జీవితం వారిది" అని ఎందుకు చెప్పారు? ఈ విషయాన్ని ఎందుకు అంత ప్రాముఖ్యంగా వివరించారు? ఒక విధంగా చెప్పాలంటే, మీరందరూ ఆత్మలే. ఆత్మలైన మీరు ఒక పూర్ణాత్మ నుంచి లేదా మూలాత్మ నుంచి విడివడినవారు అంటే ఉద్భవించినవారు. ఎన్నో యుగాలుగా ఆ పూర్ణాత్మ లేదా మూలాత్మ ఈ ఆత్మలను సృష్టిస్తూనే ఉంది. అందువల్ల ఈ ఆత్మలన్నీ కూడా ఒకే స్థితిలో ఉండవు. అవి ఒక్కొక్కటి ఒక్కొక్క స్థాయిలో ఉంటాయి. అందుకే అందరి ఆలోచనలు, అవగాహన, ప్రవర్తన ఒకే విధంగా ఉండదు, ఒకరి ప్రవర్తనకు మరొకరి ప్రవర్తనకు ఎలాంటి పోలిక ఉండదు.

అందుకే పత్రి గారు ఈ ఆత్మలను వివిధ స్థాయిలుగా వివరించారు. శైశవాత్మ అంటే ఆధ్యాత్మిక ప్రయాణంలో ప్రారంభ జన్మల్లో ఉన్న ఆత్మ తరువాత

బాలాత్మ అంటే మరికొన్ని జన్మల అనుభవాన్ని సంపాదించి తదుపరి స్థితికి చేరుకున్న ఆత్మ, యువాత్మ అంటే ఇంకా అనేక జన్మల అనుభవం పొందిన తర్వాత స్థితిలో ఉన్న ఆత్మ. అలాగే వృద్ధాత్మ, విముక్తాత్మ, పూర్ణాత్మ అని కూడా పేర్కొంటారు. అంటే అన్ని ఆత్మలు ఒకే స్థితిలో ఉండవు. ఒక్కొక్క ఆత్మ ఒక్కొక్క స్థాయిలో ఉంటుంది. ఆ స్థాయిని బట్టే వారి ప్రవర్తన, పనులు, మాటలు మరియు వారు జీవించే విధానం ఉంటాయి.

ఉదాహరణకు, పత్రి గారి వంటి మహనీయులు పూర్ణాత్మ స్థితిలో ఉన్నారు. అంటే వారు పరిపూర్ణంగా ఆధ్యాత్మికంగా ఎదిగినవారు. అయితే శైశవాత్మ స్థితిలో ఉన్నవారికి ఇంకా ఏ విషయమూ పూర్తిగా తెలియదు. వారు ఇప్పుడిప్పుడే సృష్టింపబడ్డారు. ఇంకా నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. ఇంకా ఎలాంటి అనుభవాలను పొందలేదు, అందువల్ల వారికి ఏమీ తెలియదు. జంతువులను మీరు గమనించినట్లయితే, వాటి దృష్టి తినడం, తాగడం, నిద్రపోవడం వంటి అవసరాలపైనే ఉంటుంది. అంతకుమించి వాటికి మరేమీ తెలియదు. అలాగే ప్రారంభ జన్మల్లో ఉన్న శైశవాత్మలు కూడా ప్రధానంగా ఈ విషయాలపైనే దృష్టి పెడతారు. మిగతా విషయాలన్నీ వారికి అనవసరంగా అనిపిస్తాయి. వారి జీవితాన్ని చూసేవారు, “వీడు ఎందుకు ఇలా జీవిస్తున్నాడు? వీడి జీవితం ఇలా ఎందుకు ఉంది?” అని అనుకుంటారు. కానీ కొన్ని జన్మలు గడిచిన తర్వాత, ఇతరులను చూస్తూ వారిలో కూడా క్రమంగా మార్పు వస్తుంది. కొంచెం కొంచెంగా ఆలోచించడం ప్రారంభిస్తారు. ఇతరుల మాదిరిగా తాము కూడా ఉండాలని కోరుకుంటారు. అలా వారు కొద్ది కొద్దిగా అభివృద్ధి చెందుతారు.

**శైశవాత్మ:** ఇప్పుడిప్పుడే సృష్టింపబడిన ప్రారంభ ఆత్మలు. జంతువుల వలె కేవలం తినడం, తాగడం, నిద్రించడం వంటి ప్రాథమిక అవసరాలకే ప్రాధాన్యత

ఇస్తారు. “దేవుడే లేడు” అనే నాస్తిక భావంతో ఉంటారు.

**బాలాత్మ:** మరికొన్ని జన్మల అనుభవం తర్వాత వచ్చే స్థితి. ఇతరులను చూసి మారడం, దేవుడు ఉన్నాడనే నమ్మకంతో పూజలు చేయడం, కోరికలు కోరడం ప్రారంభిస్తారు.

**యువాత్మ:** మరింత పరిణతి చెందిన స్థితి. స్తోత్రాలు చదవడం, జపాలు చేయడం, సమాజంలో తమకంటూ ఒక గుర్తింపు కోసం ప్రయత్నించడం చేస్తుంటారు.

**వృద్ధాత్మ / విముక్తాత్మ:** అనేక జన్మల తరువాత జపం నుండి ధ్యాన మార్గంలోకి ప్రవేశిస్తారు.

**పూర్ణాత్మ:** ఆధ్యాత్మికంగా పరిపూర్ణ స్థితికి చేరుకున్న వారు మన పత్రి గారి లాగా. వీరు కేవలం లోక కళ్యాణం కోసమే భూమి పైకి వస్తారు.

మన సమాజంలో ఈ భేదాలను స్పష్టంగా గమనించవచ్చు. అందరి ప్రవర్తన ఒకే విధంగా ఉండదు. ఒక్కొక్కరి ప్రవర్తన ఒక్కో విధంగా ఉంటుంది. దానికి ప్రధాన కారణం వారి ఆత్మ స్థితి. ఆ ఆత్మ స్థితిని బట్టే వారి జీవితం కొనసాగుతుంది.

ఈ విషయం తెలియక కొంతమంది, “వాళ్ళు ఇలా ఎందుకు జీవిస్తున్నారు?” అని ఆశ్చర్యపడతారు. ధ్యాన మార్గంలోకి వచ్చినవారు కూడా ఆత్మలే. అయితే వారు కొంత ఎక్కువగా ఎదిగిన ఆత్మలు. అలాంటి వారు ధ్యానం చేయని వారిని చూసి, “ధ్యానం ఎంత మంచిదో చెబుతున్నా వినరు, ధ్యానం చేయరు” అని అనుకుంటారు.

ఎందుకంటే, ధ్యాన మార్గంలోకి వచ్చిన వ్యక్తికి తాను పొందుతున్న లాభాలు అందరూ పొందాలని అనిపిస్తుంది. కానీ ఈ స్థితి వెనుక ఉన్న సత్యం అర్థం కాకపోతే ధ్యానంలోకి వచ్చినా అజ్ఞానం పూర్తిగా తొలగిపోదు.

అందువల్ల కొంతమంది ఇతరులను కూడా బలవంతంగా ధ్యానంలోకి తీసుకురావాలని ప్రయత్నిస్తారు. “ఎందుకు ధ్యానం చేయరు?”, “ధ్యానం చేయండి” అని ఒత్తిడి చేస్తుంటారు.

కానీ వారి ఆత్మ స్థితి ఇంకా ఆ స్థాయికి రాకపోతే, వారి జీవితం కూడా అలాగే ఉంటుంది. అందుకే ప్రతి ఒక్కరిజీవితాలు రకరకాలుగా ఉంటాయి. కొంత జ్ఞానం వచ్చినప్పుడు, “ఇంకా వారి ఆత్మ స్థితి ఎదగలేదు” అని అర్థం చేసుకుంటారు. అప్పుడు బలవంతం చేయకుండా, ప్రేమతో ఒక్కసారి చెప్పి వారి నిర్ణయాన్ని గౌరవిస్తారు. ఎందుకంటే ప్రతి ఆత్మ తన సమయం వచ్చినప్పుడు, తన పరిణామ క్రమంలో సహజంగానే ఆధ్యాత్మిక మార్గం వైపు అడుగులు వేస్తుంది.

ఈ విషయం అర్థం కాకపోతే అనవసరమైన గొడవలు కూడా జరుగుతాయి, విభేదాల వల్ల కుటుంబ జీవితాన్ని కూడా పాడుచేసుకుంటారు. అలాగే పిల్లలు కూడా ఆత్మలే, వారిలో కూడా బాగా ఎదిగిన ఆత్మలు ఉంటాయి. అలాంటి పిల్లలు జ్ఞానం పట్ల ఆసక్తి చూపిస్తారు, తల్లిదండ్రులకు కూడా చెప్పడానికి ప్రయత్నిస్తారు. కానీ చాలా సార్లు తల్లిదండ్రులకు ఆ విషయాలు అర్థం కావు. ఇలాంటి పరిస్థితులు కూడా ఎన్నో ఉంటాయి. మీ జ్ఞాన స్థితి పెరిగే కొద్దీ, జ్ఞాన పరిధి కూడా విస్తరిస్తుంది, అప్పుడు “ఎవరి జీవితం వారిది” అనే సత్యం మీకు పూర్తిగా అర్థమవుతుంది. అప్పుడు ఎవరినీ బలవంతం చేయరు, ఎవరిపైనా ఒత్తిడి చేయరు, వారి ఇష్టానుసారం వారిని వదిలేస్తారు, బలవంతం పెట్టరు, బాధపడరు, అశాంతికి గురికారు. ఈ విషయం అర్థం కాకపోతే, మీరు ఇంకా అజ్ఞానంలోనే ఉన్నట్లే.

అందుకే పత్రి గారు, “ఆత్మ జ్ఞాని ఎవరి అనుభవం వారిది, ఎవరి జీవితం వారిది అని తెలుసుకుంటాడు.” అని చెప్పారు.

మానవుల జీవితాలను కూడా పత్రి గారు గుణాలను బట్టి విభజించారు. ప్రారంభ జన్మలు, మధ్యస్థ జన్మలు, చివరి జన్మలు, ఆఖరి జన్మ అని వివరించారు. ప్రారంభ జన్మల్లో ఉన్నవారు తమోగుణ ప్రభావంలో ఉంటారు. కొంత ఎదిగి మధ్యస్థ స్థితికి వచ్చినవారు రజోగుణ ప్రభావంలో ఉంటారు. ఇంకా ఎదిగినవారు సాత్విక గుణంలో ఉంటారు. చివరి జన్మలకు చేరుకున్నవారు శుద్ధ సాత్విక స్థితిలో ఉంటారు, చిట్ట చివరి జన్మలో ఉన్నవారు నిర్గుణ స్థితిని చేరుకుంటారు. వారి ప్రవర్తన కూడా ఆ స్థితికి అనుగుణంగానే ఉంటుంది.

ఈ గుణాలు కూడా ఒక్క రోజులో మారవు. సుమారు వంద నుంచి నూట యాభై జన్మల అనుభవాల ద్వారా అవి క్రమంగా మారతాయి. ఇతరులను చూస్తూ, అనుభవాల ద్వారా నేర్చుకుంటూ, మెల్లగా మార్పు చెందుతాయి.

సుమారు వంద నుంచి నూట యాభై జన్మల తర్వాత తమోగుణం నుంచి బయటపడి రజోగుణంలోకి వస్తారు. మరో వంద నుంచి నూట యాభై జన్మల తర్వాత రజోగుణాన్ని కూడా అధిగమించి సాత్విక గుణంలోకి ప్రవేశిస్తారు. ఆ తరువాత మరో యాభై నుంచి వంద జన్మల అనుభవంతో శుద్ధ సాత్విక స్థితిని చేరుకుంటారు. చివరికి మరి కొద్ది జన్మల తర్వాత నిర్గుణ స్థితిని కూడా పొందుతారు. అంటే దైవ స్థితికి చేరుకుంటారు.

మానవుడిగా ప్రారంభమైన ఈ ప్రయాణం, నాలుగు నుంచి ఐదు వందల జన్మల అనుభవం తర్వాత దైవ స్థితికి ఎదుగుతుంది. ఇదే సృష్టిలో ఉన్న సహజమైన ఏర్పాటు.

అందుకే పత్రి గారు ఎవరినీ బలవంతం చేయరు, ఎవరిపైనా ఒత్తిడి తీసుకురారు. ఎందుకంటే ఆయనకు ఈ సత్యం పూర్తిగా తెలుసు. ఆయన ఒకరికి ఇచ్చే సలహాను మరొకరికి ఇవ్వరు. ఒకరికి చెప్పిన పనిని ఇంకొకరికి

చెప్పరు. ఎవరి ఆధ్యాత్మిక స్థాయి ఎలా ఉందో దానికి అనుగుణంగా వారికి సూచనలు చేస్తారు, వారు చేయగలిగిన పనులనే చెబుతారు, చేయలేని పనులను ఎప్పుడూ చెప్పరు.

కొన్నిసార్లు చెప్పిన పని చేయకపోయినా ఆయన ఏమీ మాట్లాడరు. **"వారి ఇష్టం వారిది, వారి జీవితం వారిది, చెప్పాల్సింది చెప్పాం, వారు చేయలేదు, ఇక మనం ఏమి చేయగలం?"** అని వదిలేస్తారు.

అందువల్ల ఇక్కడ మీరు ఒక విషయాన్ని తప్పకుండా గుర్తుంచు కోవాలి. ప్రతి ఒక్కరిలో చేసే పనులు, మాట్లాడే మాటలు, ప్రవర్తించే విధానం,అన్నీ కూడా ఎంతో వైవిధ్యంగా ఉంటాయి. అందరూ ఒకే విధంగా ఉండరు. కొంతమంది దేనినీ పట్టించుకోకుండా జీవిస్తారు, కొంతమంది రాజకీయాల్లో ఉంటారు, మరికొంతమంది రాజకీయాల స్థాయిని దాటి సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇంకొంతమందిని గమనిస్తే, వారు సేవా స్థితిని దాటి సాధనలోకి ప్రవేశిస్తారు. ఈ సాధన స్థితిని దాటిన తర్వాత, మరికొన్ని జన్మల అనుభవంతో సాధకులు బోధకులుగా, అంటే మాస్టర్లుగా మారుతారు. ఈ బోధకులే చివరికి పరిపూర్ణులవుతారు.

ఇన్ని రకాల మార్పులు జరగడానికి కొన్ని వేల సంవత్సరాలు సరిపోవు. లక్షల కోట్ల సంవత్సరాల అవసరం అవుతుంది. అందువల్ల ఈ విషయాన్ని పూర్తిగా అర్థం చేసుకోండి, ప్రతి ఒక్కరి జీవితం వారిదే. అందుకే ఎవరినీ విమర్శించకూడదు. ఎవరి గురించి తీర్పులు ఇవ్వకూడదు.

"వాడు ఇలా ఉన్నాడు, వాడు తప్పులు చేస్తున్నాడు, వాడికి ఏమీ అర్థం కావడం లేదు" అని విమర్శించకూడదు. ఎందుకంటే ఆ ఆత్మ ఏ స్థితిలో ఉందో, ఆ స్థితికి అనుగుణంగానే ఆ వ్యక్తి జీవిస్తాడు. అతని జీవితం కూడా అలాగే ఉంటుంది. ఈ విషయాన్ని మీరు అర్థం చేసుకోవాలి. మీరు

జ్ఞానం పొందుతున్నారు, ఆధ్యాత్మికంగా ఎదుగుతున్నారు, కాబట్టి మూర్ఖత్వంగా ప్రవర్తించకూడదు.

అందుకే గుర్తుంచుకోండి. మీరు ఎవరినీ విమర్శించని స్థితికి చేరుకున్నప్పుడు, మీరు ఎంతో ఉన్నతమైన ఆధ్యాత్మిక స్థితికి ఎదిగినట్లే. కానీ ఇంకా "వాడిలో ఈ లోపం ఉంది, వాడు ఈ తప్పు చేస్తున్నాడు, వాడు అలా చేయకూడదు" అని విమర్శిస్తూ ఉంటే, మీరు ఇంకా సంపూర్ణ జ్ఞాన స్థితిని చేరుకోలేదని అర్థం. జ్ఞానం సంపాదిస్తున్న కొద్దీ మీ ప్రవర్తన కూడా మారాలి. మీరు ఏ స్థితిలో ఉన్నారో తెలియజేయడానికే పత్రి గారు ఈ విషయాలన్నింటినీ బోధించారు.

మమకారం లేని వ్యక్తి తామరాకు మీద నీటి బొట్టులా జీవిస్తాడు. మమకారం ఉన్న వ్యక్తి తామరాకు మీద అతుక్కుపోయిన నీటి బొట్టులా జీవిస్తాడు. అంటే జ్ఞాన పరంగా మీరు నిజంగా ఎదిగితే, కచ్చితంగా తామరాకు మీద నీటి బొట్టులా జీవిస్తారు. అలా జీవించ లేకపోతే, మీ జ్ఞానం ఇంకా పూర్తిగా పెరగలేదని అర్థం.

అలాగే ఇతరులను మీరు ఇంకా విమర్శిస్తుంటే, మీ జ్ఞాన స్థాయి ఇంకా పెరగలేదని, మీరు ఇంకా అజ్ఞాన ప్రభావంలోనే ఉన్నారని అర్థం. చాలామంది, "నేను ఇన్నేళ్ళుగా ధ్యానం చేస్తున్నాను. పుస్తకాలు చదువుతున్నాను. ఎన్నో వీడియోలు వింటున్నాను. ఎన్నో చోట్లకు వెళ్ళి సందేశాలు కూడా చెబుతున్నాను కాబట్టి నా జ్ఞానం చాలా పెరిగిపోయింది" అని అనుకుంటారు.

కానీ ఈ పనులు చేసినంత మాత్రాన జ్ఞానం పెరగదు. పత్రి గారు చెప్పినట్లుగా, ఈ రకమైన లక్షణాలు, ఈ ప్రవర్తన మీలో కనిపించినప్పుడే మీరు నిజంగా జ్ఞానం పొందుతున్నారని చెప్పవచ్చు. అందువల్ల ఒక విషయాన్ని గుర్తుంచుకోండి. ముగ్గురు కలిసి కూర్చున్నప్పుడు అక్కడ లేని వ్యక్తి గురించి

మీరు ప్రస్తావన తీసుకొస్తే, మీరు ఇంకా ఆధ్యాత్మికంగా ఎదగలేదని అర్థం. అలాగే విమర్శలు చేస్తూ ఉంటే కూడా మీరు ఇంకా ఎదగలేదని స్పష్టమవుతుంది.

ఎందుకంటే, ప్రతి వ్యక్తి తన ఆత్మ స్థితికి అనుగుణంగానే ప్రవర్తిస్తాడు. అలాంటప్పుడు అతనిని విమర్శించడం ఎందుకు? పత్రి గారు **"నో కామెంట్స్ – నో జడ్జిమెంట్స్"** అని ఎందుకు చెప్పారు? ఎందుకు ఎవరినీ విమర్శించ కూడదని బోధించారు? "వాడు తప్పు చేస్తున్నాడు, తప్పు మాట్లాడుతున్నాడు, మరి ఎందుకు విమర్శించకూడదు?" అని మీకు అనిపించవచ్చు.

దానికి కారణం ఒక్కటే. అతని ఆత్మ స్థితి ఇంకా అంతగా ఎదగలేదు. ఆత్మ ఎదిగితే అతను అలా ప్రవర్తించడు. సహజంగానే అతని ప్రవర్తన మారుతుంది. మీరు ఇతరులలో తప్పులు చూస్తారు. కానీ విచిత్రం ఏమిటంటే మీకంటే ఎక్కువగా ఎదిగినవారు మీలో ఉన్న లోపాలను కూడా చూస్తారు. అప్పుడు ప్రశ్న ఏమిటంటే, మీకంటే ఉన్నతమైన స్థితిలో ఉన్నవారిలా మీరు జీవించగలరా? వారు చెప్పినట్లుగా మీరు చెప్పగలరా? వారు ప్రవర్తించినట్లుగా మీరు ప్రవర్తించగలరా? కాబట్టి ప్రతి ఒక్కరూ తమ తమ ఆధ్యాత్మిక స్థాయిలోనే ఉంటారు. మీకంటే కింద స్థాయిలో ఉన్నవాడు తన స్థాయిలో ఉంటాడు. మీకంటే పై స్థాయిలో ఉన్నవాడు తన స్థాయిలో ఉంటాడు.

ఒకసారి నేను పత్రి గారి ఇంటికి ఒక పని మీద వెళ్లాను. అప్పుడు పత్రి గారు ఇలా అన్నారు "ఈ మానవుల్లో A నుంచి Z వరకు అనేక స్థాయిలు ఉంటాయి. B స్థితిలో ఉన్నవాడికి A స్థితిలో ఉన్నవాడి లోపాలు కనిపిస్తాయి, C స్థితిలో ఉన్నవాడికి D స్థితిలో ఉన్నవాడి లోపాలు కనిపిస్తాయి, D స్థితిలో ఉన్నవాడికి C స్థితిలో ఉన్నవాడి లోపాలు కనిపిస్తాయి. ఇలా ఎవరు ఎంత ఎదిగినా, వారి కంటే ఉన్నత స్థితిలో ఉన్నవారికి వారిలోని లోపాలు కనిపిస్తూనే ఉంటాయి" అంటే ఎంత గొప్ప ఆధ్యాత్మిక స్థితికి ఎదిగినా, ఆ స్థాయికి మించిన

స్థితి నుంచి చూస్తే ఇంకా అధిగమించాల్సిన అంశాలు కనిపిస్తూనే ఉంటాయి. అప్పుడు నాకు ఒక విషయం అర్థమైంది "స్వామి వివేకానంద వంటి మహనీయులలో కూడా కొన్ని లోపాలు ఉన్నాయని పత్రి గారు ఎందుకు చెప్పారు?" అనే సందేహానికి సమాధానం దొరికింది.

అలాగే సత్యసాయి బాబా గురించి కూడా పత్రి గారు వివరించారు. సత్యసాయి బాబా విభూతి సృష్టించడం, గొలుసులు ప్రత్యక్షం చేయడం, నోటిలో నుంచి లింగాలు తీయడం వంటి మహత్యాలను ప్రదర్శించేవారు. అలాంటి మహత్యాల ద్వారా ప్రజలను ఆకర్షించేవారు. ఆ మహత్యాలు చూపించకపోతే ఆయన దగ్గరకు అంతమంది వెళ్ళేవారు కాదు. ఆ అద్భుతాలను చూసిన తర్వాత, "ఈ పనులు సాధారణ మనుషులు చేయలేరు, ఇవి దేవుడికే సాధ్యం" అని భావించి ఆయన వద్దకు వెళ్ళి భజనలు చేసేవారు, ఇంట్లో ఆయన ఫోటోలు పెట్టుకొని పూజలు చేసేవారు, ఆయనను దైవంగా భావించి ఆరాధించేవారు. దానికి ప్రధాన కారణం ఆయన చూపించిన మహత్యాలే.

కానీ ఆ స్థితిని కూడా దాటి మరింత ఆధ్యాత్మికంగా ఎదిగిన వ్యక్తి అలా మహత్యాలను ప్రదర్శించడు అని పత్రి గారు తరచూ చెప్పేవారు **"మహత్యాలు చూపించి ప్రజలను ఆకర్షించడం కాదు, మీ జ్ఞానాన్ని ప్రదర్శించి, ఆ జ్ఞానం ద్వారా ప్రజలను ఆకట్టుకోండి. మహత్యాలతో కాదు, జ్ఞానంతోనే మనుషులను ప్రభావితం చేయాలి."**

అందుకే పత్రి గారు ఎలాంటి మహత్యాలను ప్రదర్శించలేదు. ఆయనకు చూపించే శక్తి లేదని కాదు, అవసరమైతే ఎన్నో మహత్యాలు చూపించగలిగే సామర్థ్యం ఆయనకు ఉందనే అవగాహన నాకు ఉంది. అయినప్పటికీ ఆయన వాటిని ప్రదర్శించలేదు. ఎందుకంటే, మహత్యాలు చూపించడం వల్ల ఎవరూ గొప్ప ఆధ్యాత్మిక స్థితికి ఎదగరు. జ్ఞానం మాత్రమే

నిజమైన పరివర్తనను తీసుకువస్తుంది.

అందుకే తన జ్ఞానం ద్వారానే ఆయన లక్షలాది మందిని ఆకర్షించారు. ఆయన బోధించిన జ్ఞానం ఎంతో మందిలో పరివర్తనను తీసుకొచ్చింది. వారు ఆధ్యాత్మికంగా ఎదగడానికి అవకాశం కలిగించింది. అంటే ఒక వ్యక్తి ఎంతో ఉన్నతమైన స్థితికి చేరుకున్నా, ఇంకా అంతకంటే ఉన్నతమైన స్థితి మిగిలి ఉండవచ్చు. దైవ సమానమైన శక్తులు, సిద్ధులు, మహత్యాలు ఉన్నా, వాటిని ప్రదర్శిస్తూ ఉండటం గుర్తు కాదు.

అలాంటి స్థితిలోనే శరీరాన్ని విడిచినా, ఇంకా పూర్తిస్థాయి పరిణతి సాధించకపోతే, ఆత్మ మరింత అభివృద్ధి కోసం మళ్ళీ జన్మను స్వీకరిస్తుంది. మిగిలిన పాఠాలను నేర్చుకొని, తన పరిణామాన్ని పూర్తి చేసుకుంటుంది. సృష్టిలో జరిగే సహజమైన ప్రక్రియ ఇదే. ఆ రోజు పత్రి గారి వద్ద ఈ విషయం నాకు స్పష్టంగా అర్థమైంది. ఒక వ్యక్తి ఎంత ఎదిగినా, అతనికంటే ఉన్నతమైన స్థితిలో ఉన్నవారికి అతనిలోని లోపాలు కనిపిస్తూనే ఉంటాయి.

అందువల్ల లోపాలు లేని వ్యక్తి ఎవరూ ఉండరు, ఎవరి స్థాయికి అనుగుణంగా వారు తప్పులు చేస్తుంటారు. కానీ ఆ తప్పుల వల్ల కలిగే అనుభవాల ద్వారానే వారు నేర్చుకుంటారు, వాటిని సరిచేసుకుంటారు, చివరకు పరిపూర్ణులవుతారు. అందుకే పత్రి గారు ఇచ్చిన "నో కామెంట్స్–నో జడ్జిమెంట్" అనే సందేశం ఎంత అద్భుతమైనదో అర్థమవుతుంది. ఎవరినీ విమర్శించకండి, ఎవరి గురించి తీర్పులు ఇవ్వకండి. చాలామంది ఎప్పుడూ పోలికలు పెడుతూ ఉంటారు. "సత్యసాయి బాబా గొప్పవారా? శిరిడీ సాయిబాబా గొప్పవారా? మెహర్‌బాబా గొప్పవారా?" అని చర్చిస్తుంటారు.

ఎవరికి ఎవరంటే ఇష్టమో, వారే వారికి గొప్పవారిగా అనిపిస్తారు. మిగిలినవారిని తక్కువగా భావిస్తారు. జ్ఞానం ఇంకా పూర్తిగా పెరగని వారు

ఇలాంటి పోలికలతోనే మాట్లాడుతుంటారు. కానీ జ్ఞానం పెరిగే కొద్దీ ఎవరినీ విమర్శించరు. ప్రతి ఒక్కరూ తమ తమ స్థాయిలో ఉన్నారని అర్థం చేసుకుంటారు. తర్వాత వారు అనుభవాల ద్వారా పాఠాలు నేర్చుకొని, ఆధ్యాత్మికంగా ఎదిగి, చివరకు పరిపూర్ణులవుతారని తెలుసుకుంటారు.

పత్రి గారు ఒకసారి ఇలా చెప్పేవారు యుగాల క్రితం శ్రీరాముడు, రావణుడు ఉన్నారు. ఆ కాలంలో రావణుడు రాక్షసుడే. కానీ తరువాత తన తప్పులను సరిచేసుకొని, ఆధ్యాత్మికంగా ఎదిగి, రాముని స్థితికి చేరుకున్నాడు. ఈ విషయం చాలా మందికి తెలియదు. రావణుడు తర్వాత ఎంత ఉన్నత స్థితికి ఎదిగాడో చాలామందికి తెలియదు. ప్రతి ఒక్కరూ తమ తమ స్థితిలో కొంతకాలం ఉంటారు. ఆ స్థితికి అనుగుణంగానే వారి ప్రవర్తన ఉంటుంది. అలాగే ప్రతి ఆత్మ కూడా చివరకు పూర్ణాత్మ స్థితికి ఎదగాల్సిందే. పత్రి గారు చెప్పినట్లుగా, సృష్టిలో కోట్లాది ఆత్మలు ఈ ప్రయాణంలో ఉన్నాయి.

పత్రి గారి మాటలను బట్టి నాకు ఒక విషయం అర్థమైంది. ఆయన ఇలా చెప్పేవారు “నాకు ఇక కర్మలు లేవు, నాకు మరో జన్మ అవసరం లేదు, అయినప్పటికీ నేను భూమి పైకి వచ్చాను, ఎందుకంటే అజ్ఞానంలో ఉన్నవారిని జ్ఞాన వంతులను చేయాలి” అని. అందుకే ఆయన భూమి పైకి వచ్చి ఎంతోమందిని సంస్కరించారు. ఎంతోమందిని ఆధ్యాత్మికంగా ఉన్నతులుగా తీర్చిదిద్దారు.

ఆయనకు ఇన్ని కష్టాలు ఎందుకు? ఆయన ఆ ఉన్నత స్థితిలోనే ఉండవచ్చు కదా? మళ్ళీ భూమి పైకి వచ్చి ఇన్ని బాధ్యతలు ఎందుకు స్వీకరించారు? ఎందుకంటే, భూమి పైకి వచ్చి ఈ సేవ చేయడం ద్వారా అనేక ఆత్మలు తమ ప్రస్తుత స్థితి నుంచి ఇంకా ఉన్నత స్థితికి ఎదుగుతాయి. అందుకే మహాత్ములు మానవాళి కోసం తిరిగి తిరిగి సేవ చేస్తుంటారు. ప్రతి

ఆత్మ తన స్థితిని మరింత ఉన్నతంగా చేసుకోవాలనే ప్రయత్నం చేస్తుంది, అక్కడితో ఆగిపోదు.

ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం గుర్తుంచుకోవాలి. అజ్ఞానంలో ఉన్నవారు ధన సంపాదనలో పడిపోతారు. ఎంత సంపాదించినా వారికి తృప్తి ఉండదు. అలాగే జ్ఞానులు జ్ఞాన సంపాదనలో ఉంటారు. కానీ జ్ఞాన సంపాదన విషయంలో కూడా వారు ఎప్పుడూ తృప్తి పడరు. జ్ఞానం ఎంత పెరిగినా, ఇంకా తెలుసుకోవాలనే తపన వారిలో ఉంటుంది. ఇప్పుడు మిమ్మల్ని అందరినీ గమనిస్తే, ప్రస్తుతం నేను మీకంటే కొంత ఉన్నతమైన స్థితిలో ఉన్నానని భావిస్తున్నాను. కానీ కొంతకాలం తర్వాత మీరు కూడా నా స్థితికి తప్పకుండా చేరుకుంటారు.

అయితే నేను “ఇంత జ్ఞానం చాలు” అని భావించి ఇంట్లో కూర్చుంటే, నా ఎదుగుదల అక్కడే ఆగిపోతుంది. కానీ ఇప్పటివరకు సంపాదించిన జ్ఞానంతో నేను తృప్తి చెందలేదు. ఇంకా నేర్చుకోవాలనే తపన ఉన్నందువల్లనే నేను ఇప్పటికీ తిరుగుతూ, జ్ఞానాన్ని సంపాదిస్తూ, అందరికీ పంచుతూ ముందుకు సాగుతున్నాను. నాకు ఓపిక ఉన్నా, లేకపోయినా, ఆ ఓపిక ఉన్నంత వరకు జ్ఞానాన్ని సంపాదించుకుంటూనే ఉంటాను. ఎందుకు తృప్తి పడాలి?

అజ్ఞానంలో ఉన్నవారిలో అజ్ఞాన లక్షణాలు ఉంటాయి. అందుకే వారు “చాలు ఇక ఏమి చేయగలం!” అని తృప్తిపడిపోతారు.

కొన్నిసార్లు కొంత మందిని చూస్తే నవ్వు కూడా వస్తుంది. ముఖ్యంగా కొంతమంది మహిళలు ఇంట్లో వంట చేయడానికే ఎక్కువ ఆసక్తి చూపిస్తారు. కానీ భీమవరం వచ్చి జ్ఞానం పెంచుకోవాలనే ఆసక్తి మాత్రం కనిపించదు. కారణం వారికి జ్ఞానం యొక్క విలువ ఇంకా పూర్తిగా తెలియకపోవడమే. జ్ఞానం యొక్క విలువ తెలుసుకోవడానికి వారికి ఇంకా కొన్ని జన్మల అనుభవం

అవసరం కావచ్చు. అలాగే కొంతమంది వ్యాపారం చేయడంలో లేదా ఉద్యోగంలో ఎంతో ఆసక్తి చూపిస్తారు. కానీ జ్ఞానం పెంచుకోవడంలో అంత ఆసక్తి చూపించరు.

ఈ జన్మలో ఎంత గొప్ప ఉద్యోగం చేసినా, ఎంత మంచి వ్యాపారం చేసినా, ఇంటి పనులను ఎంత చక్కగా నిర్వహించినా, మళ్ళీ జ్ఞానం సంపాదించుకోవడానికి జన్మ తీసుకోవాల్సిందే. ఆ జ్ఞానాన్ని సంపూర్ణంగా పెంచుకునే వరకు మళ్ళీ మళ్ళీ జన్మలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రతి జన్మలో కూడా శరీరాన్ని పోషించు కోవడానికి వంట చేయడం, ఉద్యోగం చేయడం, వ్యాపారం చేయడం వంటి పనులు చేయాల్సి ఉంటుంది. కానీ వాటితో పాటు జ్ఞాన సంపాదన కూడా కొనసాగాలి.

పూర్ణాత్మ స్థితికి చేరుకునే వరకు భూమి పైకి రావాల్సిందే. పూర్ణాత్మ స్థితిని చేరుకున్న తర్వాత కూడా చేయవలసిన పనులు ఎన్నో ఉంటాయి. ఇంకా చేయాల్సిన సేవలు ఎన్నో ఉంటాయి. అందువల్ల ఒక విషయాన్ని గుర్తుంచుకోండి మీరు ఎంత ఎదిగినా, ఇంకా ఎదగవలసిందే ఉంటుంది. ఎంత జ్ఞానం సంపాదించుకున్నా, ఇంకా సంపాదించుకోవాల్సిన జ్ఞానం మిగిలే ఉంటుంది. పత్రి గారు చెప్పేవారు కదా “పరమశివుడు కూడా ఇంకా ఎందుకు ధ్యానం చేస్తున్నాడు?” అని.

దానికి సమాధానం ఏమిటంటే ? ఉన్న జ్ఞానంతో కూడా ఆయన తృప్తి పడలేదు. ఇంకా ఎదగాలి, ఇంకా జ్ఞానం సంపాదించుకోవాలి అనే తపన ఆయనలో ఉంది. ఎందుకంటే ఈ సృష్టిలో జ్ఞానం అనంతమైనది. అజ్ఞానులు ఎంత ధనం సంపాదించినా తృప్తి పడరు. కోట్లు, వేల కోట్లు, లక్షల కోట్లు సంపాదించినా ఇంకా సంపాదిస్తూనే ఉంటారు. అలాగే జ్ఞాని కూడా ఎంత జ్ఞానం సంపాదించుకున్నా తృప్తి పడదు. ఇంకా ఇంకా జ్ఞానాన్ని

పెంచుకుంటూనే ఉంటాడు.

అందువల్ల మీరు ఒక విషయాన్ని గుర్తుంచుకోండి. ఎవరి జీవితం వారిదే, ఎవరినీ విమర్శించకండి, ఎవరినీ బలవంతం చేయకండి, ఎవరిపైనా ఒత్తిడి చేయకండి, అనవసరమైన గొడవలకు దిగకండి. అది మీ భార్య అయినా, మీ భర్త అయినా ఇదే సూత్రం వర్తిస్తుంది. మీకు తెలిసిన విషయాన్ని ప్రేమతో చెప్పండి. వారు అర్థం చేసుకుంటే వారే వస్తారు. అందుకే నేను చాలామందికి చెబుతూ ఉంటాను. కొంతమంది, “ఆయన కూడా వస్తే బాగుంటుంది, మేమిద్దరం కలిసి సాధన చేస్తే ఎంత బాగుంటుంది!” అని అంటారు. అది నిజమే, మీ అనుభవాలకు అనుగుణంగా మీరు అలా కోరుకోవచ్చు. కానీ ఆయన మీ మాట వినకపోతే, మీరు బాధపడితే ఆయన మారిపోతాడా? ఆయన కూడా తన దృష్టిలో ఇలా అనుకోవచ్చు “ఈవిడ అనవసరంగా భీమవరం వెళ్ళి సమయం వృథా చేస్తోంది, ఎంత చెప్పినా వినడం లేదు” అని. మరి ఆయన అనుకున్నట్లుగా మీరు జీవిస్తున్నారా? అలాగే మీరు అనుకున్నట్లుగా ఆయన ఎందుకు జీవించాలి?

ప్రతి ఒక్కరూ తమ ఆత్మ స్థితికి అనుగుణంగానే జీవిస్తారు. మీ ప్రవర్తన ఆయనకు నచ్చక పోవచ్చు, ఆయన ప్రవర్తన మీకు నచ్చక పోవచ్చు. కానీ ఎవరి జీవితం వారిదే అనే సత్యాన్ని గుర్తుంచుకోవాలి. ఈ విషయం ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. ఈ సత్యాన్ని మీరు పూర్తిగా అర్థం చేసుకున్నప్పుడు, మీరు నిజంగా జ్ఞానం సంపాదిస్తున్నారని చెప్పవచ్చు, అప్పుడు మిమ్మల్ని జ్ఞానులుగా పరిగణించవచ్చు.

‘

# ‘ఎవరి అనుభవం వారిది”

అలాగే “ఎవరి అనుభవం వారిది” అనే సత్యాన్ని కూడా అర్థం చేసుకోవాలి. ధ్యానంలోకి వచ్చిన వారైనా, రాని వారైనా, ప్రతి ఒక్కరి అనుభవాలు వేర్వేరుగా ఉంటాయి. ఉదాహరణకు, ఒక వ్యక్తికి “వంద కోట్లు ఇస్తాను, ఒకరిని హత్య చేయి” అని చెప్పినా, “నేను ఎవరినీ హత్య చేయను, ఎవరినీ మోసం చేయను, ఎలాంటి తప్పూ చేయను” అని ఖచ్చితంగా చెబుతాడు.

ఎందుకంటే, అతను గత జన్మల్లో అలాంటి అనుభవాలను పొందాడు. ఆ అనుభవాల ద్వారా నేర్చుకొని, అలాంటి పనులు ఇక చేయకూడదని నిర్ణయించుకున్నాడు. మరికొందరు ఇంకా అలాంటి తప్పులు చేస్తుంటారు. ఎందుకంటే వారికి ఆ అనుభవాలు ఇంకా రాలేదు. అందువల్ల వారు ఇంకా ఆ పాఠాలు నేర్చుకోవాల్సి ఉంది, కాబట్టి ఎవరి అనుభవం వారిదే.

ఇది ధ్యానంలోకి రాని వారి పరిస్థితి. ధ్యానంలోకి వచ్చిన తర్వాత కలిగే అనుభవాలు మరో విధంగా ఉంటాయి. ఉదాహరణకు, ధ్యానం చేసిన తర్వాత కొంత మందికి మూడో కన్ను తెరచుకున్నట్లు అనుభవాలు రావచ్చు, వారు దాని గురించి గొప్పగా చెప్పుకోవచ్చు. మరి కొందరికి అలాంటి అనుభవాలు రాకపోవచ్చు, అప్పుడు వారు నిరుత్సాహానికి గురవుతారు. కానీ అలాంటి బాధ అవసరం లేదు. ఎందుకంటే అది వారి అనుభవం. మీకు ఆ అనుభవం రాకపోవడానికి కారణం, ఆ అనుభవాన్ని మీరు గత జన్మల్లోనే పొందివుండవచ్చు. ఒకసారి ఆ అనుభవం పూర్తయిన తర్వాత మళ్ళీ అదే అనుభవం రావాల్సిన అవసరం ఉండదు.

అందువల్ల ఇతరులకు అలాంటి అనుభవాలు వచ్చాయని మీరు బాధపడకండి, మీకు రాలేదని నిరాశ చెందకండి. అలాగే మీకు వచ్చాయని

గర్వపడకండి, ఎందుకంటే ఎవరి అనుభవం వారిదే. అయితే అనుభవాల్లో తేడా రావడానికి వ్యక్తిగత కృషి కూడా ఒక ముఖ్యమైన కారణం. ఒకరు ఎక్కువ శ్రద్ధతో సాధన చేసి త్వరగా ఎదుగుతారు. మరొకరు బద్ధకించి, శ్రద్ధ పెట్టక వెనుకబడిపోవచ్చు, ఇది వారి కృషిని బట్టే ఉంటుంది.

ఉదాహరణకు, మీరు ప్రతి నెలా భీమవరం వచ్చి, ప్రతిరోజూ జూమ్ తరగతుల్లో పాల్గొని, శ్రద్ధగా సాధన చేస్తే కచ్చితంగా ఎంతో ఎదుగుతారు. అలా చేయకుండా నిర్లక్ష్యం చేస్తే, మీరు ముందే ఎదిగిన ఆత్మ అయినప్పటికీ, పురోగతిలో వెనుకబడే అవకాశం ఉంటుంది.

ఉదాహరణకు, మీరు మూడు వందల జన్మలు పొందిన స్థితిలో ఉన్నారని అనుకుందాం. మరొకరు రెండు వందల యాభై జన్మల స్థితిలో ఉండవచ్చు. కానీ ఆ వ్యక్తి ఎక్కువ శ్రద్ధతో కృషి చేస్తే, మిమ్మల్ని కూడా అధిగమించే అవకాశం ఉంది. ఇది పూర్తిగా వ్యక్తిగత కృషి పైనే ఆధారపడి ఉంటుంది. అందువల్ల గురువులు చెప్పిన మార్గాన్ని తూచా తప్పకుండా పాటించి, శ్రద్ధతో కృషి చేస్తే, మీరు ఆధ్యాత్మికంగా ఎంతో వేగంగా ఎదగగలుగుతారు.

ప్రతి వ్యక్తి చేసే కర్మలను బట్టి, వారికి వచ్చే కష్టాలు వేర్వేరుగా ఉంటాయి. ఆ కష్టాలను బట్టి వారికి కలిగే అనుభవాలు కూడా ఉంటాయి, ఆ అనుభవాల ద్వారానే వారు జ్ఞానం పొందుతారు, వారి ఆధ్యాత్మిక ఎదుగుదల కూడా జరుగుతుంది. అందుకే ఆత్మ జ్ఞాని “ఎవరి అనుభవం వారిది” అని తెలుసుకుంటాడు. అలాగే “ఎవరి జీవితం వారిది” అనే సత్యాన్ని కూడా స్పష్టంగా తెలుసుకుంటాడు

# “అంతా ఒక్కటే”

ఆత్మజ్ఞాని అంతా ఒక్కటే అని తెలుసుకుంటాడు. ఇది చాలా ముఖ్యమైన విషయం. దీనిని కేవలం వినడం మాత్రమే కాదు, ప్రతి ఒక్కరూ తప్పకుండా ఆచరణలోకి తీసుకురావాలి. ఎందుకంటే, పత్రి గారు చెప్పే ప్రతి విషయం సత్యమే, ఆయన చెప్పేది తిరుగులేని సత్యం. సత్యం కంటే గొప్పది ఈ సృష్టిలో మరొకటి లేదు. అసలు సృష్టిలో శాశ్వతంగా ఉన్నది సత్యమే. అలాంటి సత్యాలను ఆయన మనకు బోధిస్తున్నారు.

ఇప్పుడు మీరు తెలుసుకోవాల్సిన అంశం “అంతా ఒక్కటే”. ఈ మాట వినగానే ఒక సందేహం కలుగుతుంది. **“అంతా ఒక్కటే ఎలా అవుతారు?”**

ఎందుకంటే, ఈ సృష్టిలో 84 లక్షల జీవరాశులు ఉన్నాయి. వాటిని అనేక జాతులుగా విభజించారు. వృక్ష జాతి, క్రిమికీటకాల జాతి, మత్స్య జాతి, పక్షి జాతి, జంతు జాతి, మానవజాతి ఇలా ఎన్నో రకాలుగా ఉన్నాయి. వాటిని పైకి కనిపించే ఆకారాలను బట్టి చూస్తే, ఒకదానికి మరొక దానికి చాలా తేడా కనిపిస్తుంది.

ఉదాహరణకు, మానవజాతిని మరియు జంతు జాతిని తీసుకోండి. ఆకారంలో తేడా ఉంది, ప్రవర్తనలో తేడా ఉంది, చేసే పనుల్లో కూడా తేడా ఉంది. ఒకటి చేసే పనికి మరొకటి చేసే పనికి ఎలాంటి సంబంధం ఉండదు. పక్షులు చేసే పనులను మానవులు చేయలేరు. అలాగే మానవులు చేసే పనులను పక్షులు చేయలేవు. పక్షులు గాలిలో ఎగురుతాయి, మానవుడు అలా ఎగరగలడా? ఇలా చూస్తే, ఇన్ని భిన్నమైన ఆకారాలు, విభిన్నమైన ప్రవర్తనలు కనిపిస్తున్నప్పుడు, “అంతా ఒక్కటే” అని ఎలా అనుకోవాలి? అని అడగవచ్చు.

ఈ సందేహం రావడం సహజమే. ఎందుకంటే, "అంతా వేర్వేరు" అని భావిస్తే, మీ ప్రవర్తన, మీ పనులు, మీ ఆలోచనలు వేరేగా ఉంటాయి. కానీ "అంతా ఒక్కటే" అనే స్థితికి వచ్చినప్పుడు, ఇవన్నీ పూర్తిగా మారిపోతాయి.

మీరు ఒక విషయం మాత్రమే గుర్తుంచుకోండి. మీరు "అంతా వేర్వేరు" అనే భావనలో ఉన్నంతకాలం, మీరు చేసే పనులు సృష్టికి విరుద్ధంగా ఉంటాయి. సృష్టికి విరుద్ధంగా చేసే పనుల వలనే మానవుడికి కష్టాలు, సమస్యలు, బాధలు వస్తున్నాయి.

అయితే, మానవుడు సృష్టికి అనుగుణంగా ఎప్పుడు జీవించగలడు? సృష్టికి అనుగుణమైన పనులు ఎప్పుడు చేయగలడు? "అంతా ఒక్కటే" అని తెలుసుకున్నప్పుడే అది సాధ్యమవుతుంది. కానీ అది అంత సులభం కాదు. అసలు "అంతా ఒక్కటే" అని ఎలా భావించగలడు?

సరే, జంతువులు, పక్షులు, జలచరాలను ప్రక్కన పెట్టండి. కనీసం మానవులను మాత్రమే తీసుకున్నా, అందరూ ఒక్కటే అని ఎలా భావించగలడు? ఎక్కడో ఉన్నవారి గురించి ఎందుకు మాట్లాడాలి? మీ స్వంత కుటుంబంలో ఉన్నవారినే చూడండి. కుటుంబంలో ఉన్న కొద్దిమంది కూడా "అందరం ఒక్కటే" అనే భావంతో జీవిస్తున్నారా? భర్త ఒక వ్యక్తి, భార్య మరో వ్యక్తి, పిల్లలు వేరే వ్యక్తులు అన్న భావంతోనే జీవిస్తున్నారు. భర్త పురుషుడు, భార్య స్త్రీ, పిల్లలు వేరు అనే భేద భావంతోనే సంసారం కొనసాగుతోంది. అలాగే ప్రవర్తిస్తున్నారు. ఏదో అవసరాల వల్ల, తప్పనిసరి పరిస్థితుల కారణంగా మాత్రమే కలిసి ఉంటున్నారు. కానీ అంతరంగంలో మాత్రం "మేము వేర్వేరు" అనే భావంతోనే జీవిస్తున్నారు.

ఎక్కడ చూసినా ఇదే కనిపిస్తుంది. "వేరు" అనే భావం ఉండడం వలనే తమ వారు కాని వారి పట్ల ద్వేషం కలుగుతుంది, అసూయ కలుగుతుంది.

వారికంటే గొప్పవారిగా ఉండాలనే తపన కలుగుతుంది. "నేను బాగుంటే చాలు, ఎవరు ఎలా ఉన్నా నాకు సంబంధం లేదు" అనే భావంతో జీవిస్తున్నారు. ఇలా జీవించడం వలనే మోసాలు, గొడవలు, హత్యలు, ఆధిపత్య పోరాటాలు వంటి ఎన్నో సంఘటనలు ప్రపంచంలో జరుగుతున్నాయి.

ఇలాంటి వాటి వలనే భూమిపై ఏ మానవుడూ పూర్తిగా శాంతిగా జీవించ లేకపోతున్నాడు, శాంతిగా జీవించ గలిగే మానవుడు కూడా అశాంతితోనే జీవిస్తున్నాడు. నిజంగా గుండె మీద చేయి వేసుకుని, "నేను పూర్తి శాంతిగా జీవిస్తున్నాను" అని చెప్పగలిగే వ్యక్తి ఎవరూ లేరు. ఏదో ఒక కారణం, ఏదో ఒక సమస్య, ఏదో ఒక గొడవ, ఏదో ఒక పరిస్థితి ప్రతి ఒక్కరి జీవితంలో ఉంటుంది. అందుకే ప్రతి ఒక్కరూ ఏదో ఒక రూపంలో అశాంతికి లోనవుతున్నారు.

అందరికీ డబ్బు ఉంది, ఇల్లు ఉంది, సౌకర్యాలు ఉన్నాయి, ఎన్నో ఉన్నాయి. కానీ శాంతి మాత్రం లేదు. ఎందుకు లేదు? అందరూ "వేర్వేరు" అని భావించడం వల్లే. కానీ "అందరూ ఒక్కటే" అని తెలుసుకున్నప్పుడు ఈ పరిస్థితి ఉండదు.

ఇప్పుడు మీకు ఒక సందేహం రావచ్చు. "అందరం ఒక్కటే ఎలా అవుతాం?" అని. దానికి సమాధానం తెలుసుకోవాలంటే ఇంకా కొన్ని విషయాలు తెలుసుకోవాలి.

ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని తెలుసుకోవాలి. ఇప్పటివరకు తెలిసింది చాలా స్వల్పం మాత్రమే, తెలుసుకోవాల్సింది ఇంకా ఎంతో ఉంది. సాధారణంగా ఈ మార్గంలోకి రాక ముందు, ఆత్మజ్ఞానం పొందక ముందు, చాలా మంది "నేను మానవుడిని" అని అనుకుంటారు. మానవుడు అంటే కనిపిస్తున్న ఈ దేహమే అని భావిస్తారు.

కానీ మానవుడు అంటే దేహం మాత్రమే కాదు, దేహంతో పాటు కనిపించని మనసు ఉంది, అలాగే కనిపించని ఆత్మ కూడా ఉంది. ఈ విషయం చాలామందికి తెలియదు. కొంతమంది ఆశ్చర్యంగా అడుగుతారు "కనిపించని వాటి గురించి కూడా మాట్లాడతారా?" అని.

ఈ అవగాహన లేని వారు దేహమే అన్ని పనులు చేస్తుందని అనుకుంటారు. కానీ దేహం ఒక పనిముట్టు మాత్రమే, ఈ దేహం ద్వారా పనులు చేయించేది కనిపించని మనసు. మీరు అడగవచ్చు "మనసు ఉందని ఎలా చెబుతారు?" అని. దానికి వేరే ఎవరూ చెప్పాల్సిన అవసరం లేదు. ప్రతి ఒక్కరికీ వారి అనుభవంలోనే అది తెలుస్తుంది. మీరే అప్పుడప్పుడు ఇలా అంటుంటారు "నా మనసు ఏమీ బాగోలేదు" అని.  దేహాన్ని చూస్తే బాగానే ఉంటుంది, ఎక్కడా గాయం లేదు, ఎలాంటి అనారోగ్యం లేదు, అన్నీ బాగానే ఉంటాయి. అయితే బాధ పడేది మనసు. మనసు కలిగించే బాధను భరించ లేకపోతారు, కొన్నిసార్లు నిద్ర కూడా పట్టదు. అయితే మనసు లేకపోతే "నా మనసు బాగోలేదు" అని ఎందుకు అంటారు? నిద్ర పట్టక ఎందుకు బాధపడతారు? ఆలోచించండి.

కొంచెం ఆలోచిస్తే, మనసు అనే ఒక తత్త్వం ఉందని స్పష్టంగా అర్థమవుతుంది. కొంత అధ్యయనం చేస్తే కనిపించని మనసు గురించి ఎన్నో విషయాలు తెలుస్తాయి. ఈ శరీరంలో ఎన్నో భాగాలు ఉన్నాయి. జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు ఉన్నాయి. జ్ఞానేంద్రియాలలో ప్రతి ఒక్కటి ఒక్కో పని చేస్తుంది, అలాగే కర్మేంద్రియాలలో ప్రతి ఒక్కటి ఒక్కో పని చేస్తుంది.

అలాగే మనసులో కూడా నాలుగు భాగాలు ఉన్నాయి. దేహంలో ఎన్నో భాగాలు ఉన్నట్లే, మనసులో కూడా నాలుగు భాగాలు ఉన్నాయి, దేహంలోని ప్రతి భాగం ఒక్కో పని చేసినట్లే, మనసులోని ఈ నాలుగు భాగాలు కూడా ఒక్కొక్కటి ఒక్కో పని చేస్తాయి. అవి ఏమిటంటే "మనసు, బుద్ధి,

చిత్తము, అహంకారం". వీటినే పెద్దలు "అంతఃకరణ చతుష్టయం" అని అన్నారు.

ఇప్పుడు మూడవ అంశం ఆత్మ. శరీరం ఉంది, మనసు ఉంది, వాటితో పాటు ఆత్మ కూడా ఉంది. మనసు గురించి కొంతమంది మాట్లాడతారు. కానీ ఆత్మ గురించి చాలామందికి తెలియదు. ఆత్మ అనే ప్రస్తావనే చాలా అరుదుగా ఉంటుంది. ఆత్మ గురించి చెప్పగానే కొందరు ఆశ్చర్యపోతారు. "ఆత్మ ఎక్కడ ఉంది? చూపించండి" అని అడుగుతారు. ఇలా ఎన్నో ప్రశ్నలు వేస్తారు.

కానీ ఈ శరీరంలో నుంచి ఆత్మ ప్రక్కకు తప్పుకుంటే, ఈ శరీరం వెంటనే శవంగా మారిపోతుంది. అప్పటి వరకు అన్ని పనులు చేసిన శరీరం ఒక్క పని కూడా చేయలేదు. కళ్ళు చూడలేవు, నోరు మాట్లాడలేదు, చెవులు వినలేవు. చేతులు, కాళ్ళు పనిచేయవు. అంతవరకు అవి పనిచేశాయి అంటే దానికి కారణం ఆత్మ వారి శరీరంలో ఉండటమే. ఆత్మ బయటకు వెళ్ళిన క్షణం నుంచి ఏదీ పనిచేయదు. అప్పుడు ఆ శరీరాన్ని శవం అంటారు. అప్పుడు ఆ శరీరాన్ని ఇంటి బయట ఉంచుతారు.

కొంచెం ఆలోచిస్తే మీకే అర్థమవుతుంది. ఇప్పటివరకు అన్ని పనులు చేసిన శరీరం ఇప్పుడు ఒక్క పని కూడా ఎందుకు చేయడం లేదు? ఎందుకంటే ఇప్పటివరకు అన్ని పనులు చేయడానికి కారణం ఆ శరీరంలో ఆత్మ ఉండడం, ఇప్పుడు ఏ పని చేయలేకపోవడానికి కారణం ఆ శరీరంలో ఆత్మ లేకపోవడం.

ఇక్కడ మీరు ఇంకా ఆలోచిస్తే అసలు ఈ ఆత్మ ఎవరు? ఆత్మ ఉండగా ఈ శరీరం ద్వారా ఇన్ని పనులు ఎలా జరిగాయి? ఆత్మ లేకపోతే ఈ శరీరం ఎందుకు ఏమీ చేయలేకపోతోంది? ఆ తర్వాత ఆ శరీరం పనికిరాదని భావించి దహనం చేస్తారు లేదా ఖననం చేస్తారు. ఆత్మ ఉన్నంత వరకే ఆ

శరీరానికి విలువ ఉంటుంది, ఆత్మ లేకపోతే ఆ శరీరానికి ఎలాంటి విలువ ఉండదు.

ఆత్మ ఉన్నప్పుడు ఆ ఇంటి యజమాని, భర్త ఏసీ గదిలో ఉంటాడు, అందరికీ ఆదేశాలు ఇస్తాడు, ఇంట్లో అన్నీ నిర్వహిస్తాడు. కానీ ఒక రాత్రి ఆ శరీరంలో నుంచి ఆత్మ వెళ్లిపోయిందనుకోండి ఏమవుతుంది? అతను శవంగా మారిపోతాడు. అప్పుడు అందరూ వచ్చి ఆ శరీరాన్ని ఇంటి బయట ఉంచుతారు. ఎక్కువసేపు ఇంట్లో కూడా ఉంచరు. విచిత్రం ఏమిటంటే, ఆత్మ ఉన్నప్పుడు అదే శరీరం ఏసీ గదిలో, రాజభవనం లాంటి ఇంట్లో ఉంటుంది. కానీ ఆత్మ వెళ్లిపోయిన తర్వాత, అదే శరీరాన్ని పనికిరాని వస్తువులా ఇంటి బయట ఉంచుతారు.

ఇక్కడ మీరు కొంచెం ఆలోచించాలి. ఆ వ్యక్తి బట్టలు, చెప్పులు మాత్రం ఇంట్లోనే ఉంటాయి. కానీ ఆ శరీరాన్ని మాత్రం బయట వేస్తారు. అంటే, ఆలోచించండి ఆ సమయంలో ఆ చెప్పులకు, బూట్లకు ఉన్న విలువ కూడా ఆ శరీరానికి ఉండదు. ఆత్మ ఉన్నప్పుడు ఆ శరీరానికి ఎంతో గౌరవం ఉండేది. ఆత్మ వెళ్లిపోయిన తర్వాత, ఆ శరీరం చెప్పుల కంటే కూడా విలువలేనిదిగా మారిపోతుంది. దీనిని బట్టి ఆత్మ యొక్క గొప్పతనం అర్థం చేసుకోవచ్చు. ఆత్మ వెళ్లిపోయిన తర్వాత ఆ శరీరాన్ని స్మశానానికి తీసుకెళ్ళి దహనం చేస్తారు లేదా ఖననం చేస్తారు.

ఇక్కడ మరో విషయం గురించి కూడా మీరు ఆలోచించాలి. మనకు ఇంకా జన్మలు ఉన్నాయా? లేవా? మరణం తర్వాత కూడా జీవితం ఉందా? లేదా? అన్న ప్రశ్న వేసుకోవాలి.

ఈ ప్రశ్నను మీకు మీరే వేసుకుంటే, దాదాపు అందరూ ఒకే సమాధానం చెబుతారు. “అవును, మరణం తర్వాత కూడా జీవితం ఉంది,

ఇంకా జన్మలు ఉన్నాయి" అని. అదే విషయాన్ని మాటల్లో కూడా మనందరం వ్యక్తం చేస్తుంటాం "గత జన్మలో చేసిన కర్మలను ఈ జన్మలో అనుభవిస్తున్నాం" అని.

భగవద్గీతలో కూడా శ్రీకృష్ణుడు ఇదే విషయాన్ని చెప్పారు. "పుట్టిన వాడు మరణించక మానడు, మరణించినవాడు మళ్ళీ పుట్టక మానడు" అంటే, మీరు తల్లి గర్భం నుంచి ఈ లోకానికి వచ్చారు, కొంతకాలం ఈ శరీరంలో జీవిస్తారు, తర్వాత ఈ శరీరాన్ని విడిచిపెడతారు. శరీరాన్ని దహనం చేసినా, ఖననం చేసినా, మీరు మాత్రం ఉంటారు. శరీరం లేకపోయినా ఉండేది మీరే. ఆ "మీరు" అనే చైతన్యానికే 'ఆత్మ' అని పేరు. శరీరం లేకపోయినా 'ఆత్మ' అయిన మీరు ఉంటారు, ఆ తర్వాత మీరు పై లోకాలకు వెళ్తారు.

మరణానంతరం జరిగే విషయాల గురించి ఇప్పటివరకు ఎన్నో ఎపిసోడ్లలో చెప్పుకున్నాం. ఆ విషయాలపై ఎన్నో పుస్తకాలు కూడా ఉన్నాయి. ఆత్మ అయిన మీరు కొంతకాలం ఒక శరీరంలో ఉండి, కొన్ని కర్మలను అనుభవించి, మళ్ళీ మరో శరీరంలో ప్రవేశిస్తారు. ఆత్మ అయిన మీరు ఒక శరీరంలో ప్రవేశిస్తే దానిని పుట్టుక అంటారు, ఆత్మ అయిన మీరు ఆ శరీరాన్ని విడిచిపెడితే దానిని మరణం అంటారు. ఇదే విషయాన్ని శ్రీకృష్ణుడు కూడా చెప్పారు. "పుట్టినవాడు మరణించక మానడు, మరణించినవాడు మళ్ళీ పుట్టక మానడు."

ఇవన్నీ ఎందుకు తెలుసుకుంటున్నామంటే, "ఈ శరీరం నేను కాదు. ఈ శరీరంలో ఉన్న ఆత్మే నేను." అనే సత్యాన్ని తెలుసుకోవడానికే. ఇక్కడ ఒక విషయం గమనించండి. భూమిపై కోట్లాది శరీరాలు ఉన్నాయి, ఆ శరీరాలన్నీ ఒకరోజు బూడిద అవుతాయి. అంటే వాటిని దహనం చేస్తారు లేదా ఖననం చేస్తారు. కానీ శరీరం బూడిద అయినా, ఆత్మ మాత్రం ఉంటుంది, ఉండేది ఆ

ఆత్మే. అదే మీరు. ఇక్కడ మీరు గమనిస్తే, ఏ శరీరమైనా నశించాల్సిందే, కానీ ఆ శరీరంలో ఉన్న ఆత్మ మాత్రం శాశ్వతమైనది.

ఇంకా లోతుగా ఆలోచిస్తే, అన్ని శరీరాల్లో ఉన్న ఆత్మ కూడా ఒక్కటే అని అర్థమవుతుంది. అంతేకాదు, "ఈ శరీరం నేను కాదు, ఆత్మే నేను." అనే విషయం కూడా మీకు స్పష్టమవుతుంది. మొదటగా మీరు తెలుసుకునేది ఏమిటంటే "నేను శరీరం కాదు, నేను ఆత్మను" అన్న సత్యాన్ని మీరు గ్రహిస్తారు ఇలా చూస్తే, ఎవరూ శరీరం కాదు, అందరూ ఆత్మలే. అందుచేత ఆత్మలన్నీ ఒక్కటే అయినప్పుడు, అందరూ ఒక్కటే కదా? శరీరాలను చూస్తేనే అందరూ వేరు వేరుగా కనిపిస్తారు. ఒకరు పురుషుడు, మరొకరు స్త్రీ, ఒకరు భర్త, మరొకరు భార్య. కానీ శరీరాన్ని ప్రక్కన పెడితే, పురుషుడిలో ఉన్నది 'ఆత్మే'. స్త్రీలో ఉన్నది కూడా 'ఆత్మే'. ఆత్మలన్నీ ఒక్కటే. అయితే ఈ విషయం ఎవరికీ తెలుస్తుంది? జ్ఞానం ఉన్నవారికి మాత్రమే తెలుస్తుంది, ఆత్మజ్ఞానం పొందిన వారికి మాత్రమే తెలుస్తుంది. ఈ విషయం తెలియకపోతే వారిని అజ్ఞాని అంటారు. ఇప్పుడు మీరు "నేను ఈ శరీరమే" అని అనుకుంటే, మీరు ఇంకా అజ్ఞానంలో ఉన్నట్లే.

కానీ "నేను శరీరం కాదు, నేను ఆత్మను" అనే స్థితికి ఎదిగినప్పుడు మీరు జ్ఞానులవుతారు. అందుకే "అంతా ఒక్కటే" అనే సత్యం జ్ఞానం ఉన్నవారికే తెలుస్తుంది. జ్ఞానం ఉన్నవాడు, అజ్ఞానంలో ఉన్నవారికి "మనమంతా ఒక్కటే." అని చెప్పితే, వారు నవ్వుతారు. "చాలు చాలు అందరం ఒక్కటే ఎలా అవుతాం?" అని అంటారు. "అక్కడ ఒక బిచ్చగాడు ఉన్నాడు, అతడూ నేనూ ఒక్కటేనా?" అని అడుగుతారు. "అక్కడ ఒక కుష్ఠు రోగి ఉన్నాడు, అతడూ నేనూ ఒక్కటేనా?" అని ప్రశ్నిస్తారు.

ఇప్పుడు కుష్ఠు రోగిగా ఉన్న ఆ వ్యక్తి, ఆ శరీరాన్ని విడిచిపెట్టి మరు

జన్మలో ఒక కోటీశ్వరుడి కుటుంబంలో జన్మించవచ్చు, అంటే, కోటీశ్వరుడి శరీరంలోకి ఆత్మగా ప్రవేశించవచ్చు. అప్పుడు చెప్పండి ఇప్పుడు కుష్ఠ రోగిగా కనిపిస్తున్న వ్యక్తి, తర్వాత కోటీశ్వరుడిగా జన్మిస్తే, అతడే కదా? కానీ కోటీశ్వరుడు ఈ విషయం వింటే ఆశ్చర్యపోతాడు. "కుష్ఠ రోగి నేనా?" అని అడుగుతాడు, ఇదే సృష్టి యొక్క విచిత్రం. ఈ సృష్టి రహస్యాలను తెలుసుకోవడమే జ్ఞానం, ఈ జ్ఞానం ఎంత ఎక్కువగా తెలుసుకుంటే, మీరు అంతగా ఎదుగుతారు ఈ మార్గంలో.

అందుకే పత్రి గారు చెబుతారు ఆత్మజ్ఞానం లేకపోవడం వల్లనే అజ్ఞానంతో మనుషులు గొడవలు, హింసలు, ద్వేషాలు, విభేదాలు సృష్టించుకుంటున్నారు. "నా కుటుంబం వేరు వాళ్ళ కుటుంబం వేరు", "నా కులం వేరు వాళ్ళ కులం వేరు", "నా మతం వేరు వాళ్ళ మతం వేరు", "నా ప్రాంతం వేరు వాళ్ళ ప్రాంతం వేరు", "నా రాష్ట్రం వేరు ప్రక్క రాష్ట్రం వేరు", "నా దేశం వేరు ప్రక్క దేశం వేరు" ఇలా ఎన్నో భేదాలను సృష్టించుకుంటున్నారు. ఇలాంటి భేదాలన్నీ ఈ శరీరం ఉన్నంత వరకే ఉంటాయి. శరీరం పోయిన వెంటనే, అందులో నుంచి ఆత్మ బయటకు వస్తుంది, ఆ ఆత్మ పై లోకాలకు వెళ్తుంది. పై లోకాల్లో చూస్తే అంతా ఒక్కటే, భూమి పైకి వచ్చిన తర్వాతే అంతా వేరు వేరుగా కనిపిస్తారు. పై లోకాల సత్యం గురించి అవగాహన ఉన్నవారు, భూమి పైన కూడా అందరూ ఒక్కటే అనే భావంతో ప్రవర్తిస్తారు.

కానీ విచిత్రం ఏమిటంటే, పై లోకాల్లో ఉన్నప్పుడు అందరూ ఒక్కటే అని తెలుసు. కానీ భూమి పైకి వచ్చిన తర్వాత మాత్రం అంతా వేరువేరు అన్నట్లుగా జీవిస్తారు. అయితే ఎవరైతే మరణానంతరం జరిగే విషయాలను తెలుసు కుంటారో, వారినే జ్ఞానులు అంటారు. అందుకే ఆత్మ జ్ఞాని "అంతా ఒక్కటే" అనే సత్యాన్ని తెలుసుకుంటాడు. ఆ సత్యాన్ని తెలుసుకున్న తర్వాత,

ఆత్మ జ్ఞాని యొక్క ప్రవర్తన పూర్తిగా మారిపోతుంది. అందుకే ధ్యానం ఒక్కటే చేస్తే సరిపోదు, జ్ఞానం కూడా సంపాదించుకోవాలి. ఎందుకంటే ధ్యానం మాత్రమే చేస్తే ప్రవర్తన మారదు, కానీ జ్ఞానం సంపాదించుకున్నప్పుడు ప్రవర్తనలో స్పష్టమైన మార్పు వస్తుంది.

చాలామంది ఒక సందేహం అడుగుతారు. “అందరూ ఒక్కటే అంటున్నారు కదా? అయితే నేను నా భర్తతో ఎలా సంసారం చేయాలి?” “అందరూ ఒక్కటే అయితే, నా దగ్గర పని చేసే వ్యక్తితో ఎలా పని చేయించుకోవాలి?” ఇలాంటి సందేహాలు రావడం సహజమే.

కానీ వశిష్ట మహర్షి ఒక గొప్ప సూత్రాన్ని చెప్పారు **“బాహ్యంగా ద్వైతంలో ఉండాలి, అంతరంగంలో అద్వైతంలో ఉండాలి”** ద్వైతం అంటే వేర్వేరుగా కనిపించడం, అద్వైతం అంటే రెండవది లేకపోవడం, అంతా ఒక్కటే అని తెలుసుకోవడం. “ద్వై” అంటే రెండు. “అద్వై” అంటే రెండు లేవు, ఒక్కటే. అందుకే “అంతా ఒక్కటే” అనే సత్యాన్ని మీరు ఎంత ఎక్కువగా తెలుసుకుంటే, మీ జీవితం అంత గొప్పగా మారిపోతుంది. మీరు అంతగా ఆధ్యాత్మికంగా ఎదుగుతారు, మీలో ఎంతో గొప్ప మార్పు వస్తుంది. ఇతరులు వేరని భావించడం వల్లే ద్వేషం వస్తుంది, ఆ ద్వేషంతో చేయకూడని పనులు చేస్తారు.

కానీ అందరూ ఒక్కటే అని అర్థమైనప్పుడు ద్వేషం ఉండదు. ద్వేషం లేకపోతే చెడు పనులు చేయరు. చెడు పనులు చేయకపోతే కష్టాలు కూడా ఉండవు. కష్టాలు లేని చోట ఆనందమే ఉంటుంది. **“అందుకే జ్ఞాని ఎప్పుడూ ఆనందంలో ఉంటాడు, అజ్ఞాని ఎప్పుడూ దుఃఖంలో ఉంటాడు”.** ఇదే పత్రి గారు చెప్పిన సత్యం.

అందుకే మీరు ఆనందంలో జీవించాలంటే, కచ్చితంగా ఆత్మజ్ఞానం సంపాదించుకోవాలి.

చివటం అమ్మవారు ఎన్నో విలువైన విషయాలు చెప్పారు. అవి ప్రతి ఒక్కరూ ఆలోచించవలసినవే. ఎందుకంటే, అమ్మవారి వంటి ఉన్నత స్థితిలో ఉన్నవారి నోటి నుంచి వచ్చే ప్రతి మాట ఎంతో లోతైన అర్థాన్ని కలిగి ఉంటుంది, వాటిని తేలికగా తీసుకోకూడదు, ఆలోచించాలి, ఆచరించాలి.

చివటం అమ్మవారు ఒక విషయం చెప్పారు. "ఇప్పటికే ఎన్నో చిక్కు ముళ్ళు వేసుకున్నావు. ఇంకా కొత్త ముళ్ళు ఎందుకు వేసుకుంటావు?" అని. ఈ ఒక్క మాటలో ఎంతో లోతైన అర్థం ఉంది.

అవతార్ మెహర్ బాబా కూడా ఇదే విషయాన్ని చెప్పారు. ప్రారంభ జన్మల్లో, మధ్యస్థ జన్మల్లో ప్రతి ఒక్కరూ కర్మలు చేస్తూ కొత్త కొత్త ముళ్ళు వేసుకుంటూ ఉంటారు. ఎన్ని ముళ్ళు వేసుకుంటే, అన్ని జన్మలు పెరుగుతూ ఉంటాయి. కానీ మధ్యస్థ జన్మలు దాటిన తర్వాత ఒక గొప్ప అవగాహన వస్తుంది. "ఇక కొత్త ముళ్ళు వేసుకోవడం వుండదు, ఉన్న ముళ్ళను విప్పుకుంటారు". ఎందుకంటే ఒక్క ముడి కూడా లేకపోతే, జన్మే ఉండదు, ఆ స్థితికి చేరుకోవాలి. అందుకే జ్ఞాని కొత్త బంధాలను సృష్టించుకోడు.

ఇప్పటికే ఉన్న కర్మబంధాలను విప్పుకునే ప్రయత్నం చేస్తాడు. అదే అతని సాధన, అదే అతని జీవన విధానం. ఎవరైనా ఇకపై కొత్త కర్మలను పెంచుకునే పని చేయకూడదు. కర్మలను పెంచుకోవడం అంటే పాప కర్మలు, పుణ్య కర్మలు చేయడం. మరి ఏ కర్మలు చేస్తే జన్మలు పెరగకుండా ఉంటాయి?

ఆత్మ కర్మలే కొత్త కర్మబంధాలు ఏర్పడకుండా చేస్తాయి. ఆత్మ కర్మలను చేస్తూ, సద్గురువును ఆశ్రయించి, జ్ఞానాన్ని పెంచుకుంటూ, ఒక్కో కర్మబంధాన్ని ఒక్కొక్కటిగా విప్పుకుంటూ వెళ్ళాలి. అలా కర్మలను తొలగించుకుంటూ ఉండాలి. తెలివైనవాడు చేయవలసిన పని ఇదే. కొత్త కర్మలను పెంచుకోవడం కాదు, ఉన్న కర్మలను తొలగించుకోవాలి. కర్మలను పెంచుకోవడం అంటే బురదలోకి ఇంకా దిగడం లాంటిది. కర్మలను తొలగించు కోవడం అంటే ఆ

బురదలో నుంచి బయటకు రావడం లాంటిది, అది చాలా గొప్ప పని.

ఉపయోగం లేని మాటను మహనీయులు ఎప్పుడూ మాట్లాడరు. అలాగే అమ్మవారు కుక్కలు తిన్న తర్వాత మిగిలిన ఆహారాన్ని ఆమె స్వీకరించే వారని చెప్పారు. దాని వెనుక ఉన్న సందేశం "అంతా ఒక్కటే" అనే దృష్టి. ఆమె ఆ స్థాయికి ఎదిగారు కాబట్టే, అందరిలోనూ ఒకే ఆత్మను చూసే స్థితిలో ఉన్నారు కాబట్టే, అలా ప్రవర్తించగలిగారు.

అలాగే, కొందరు ఖాళీగా కూర్చొని కబుర్లు చెప్పుకుంటూ ఉంటే, వారిని పొలంలోకి తీసుకెళ్ళి కలుపు తీయించేవారు. కలుపు తీయడం అంటే, పంటకు ఉపయోగం లేని మొక్కలను తొలగించడం. ఆ కలుపు మొక్కలు పంటకు కావలసిన పోషకాలను తీసుకుని, అసలు పంట ఎదుగుదలను తగ్గిస్తాయి. అందుకే వాటిని తొలగిస్తే, పంట బాగా పెరిగి మంచి దిగుబడి ఇస్తుంది. అలాగే మానవుల్లో కూడా కలుపు మొక్కలలాంటి చెడు లక్షణాలు ఎన్నో ఉంటాయి, అవి మానవుడి ఆధ్యాత్మిక ఎదుగుదలకు ఎంతో నష్టం కలిగిస్తాయి.

ఎవరైతే చెడు లక్షణాలను తొలగించుకుంటారో, వారు త్వరగా ఎదుగుతారు. చెడు లక్షణాలు ఎక్కువగా ఉంటే, వారి ఎదుగుదల చాలా నెమ్మదిగా ఉంటుంది, వారు త్వరగా ఉన్నత స్థితికి చేరుకోలేరు. అందువల్ల, ముందుగా ఇతరులకు మంచి చేయడం కంటే, తనలో ఉన్న చెడు లక్షణాలను తొలగించుకునే ప్రయత్నం చేయాలి. మీలో ఎంత చెడు తొలగిపోతే, మీరు అంత త్వరగా ఆధ్యాత్మిక మార్గంలో ఎదుగుతారు. అందుకే అమ్మవారు చెప్పిన ప్రతి మాటలోనూ ఎంతో లోతైన అర్థం ఉంటుంది.

చివటం అమ్మ మాట్లాడిన ప్రతి మాటను సేకరిస్తే, ఒక అద్భుతమైన జ్ఞాన సంపద అవుతుంది. ఆమె చెప్పిన ప్రతి మాటలో ఎంతో లోతైన అర్థం

దాగి ఉంటుంది. ఆ తల్లి ఏ మాట చెప్పినా, దానిలో ఆలోచించదగిన గొప్ప సందేశమే ఉంటుంది. “మరణించక ముందే మరణించాలి” ఇది కూడా ఆమె చెప్పిన సందేశాల్లో ఒకటి అని నేను తెలుసుకున్నాను. “జీవించి ఉండగానే మరణించాలి” ఇలాంటి మాటలు మహనీయులు చెప్పినప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయకూడదు, విని ప్రక్కన పెట్టకూడదు.

పత్రి గారి విషయంలో కూడా మొదట్లో నేను ఈ విషయాన్ని అంతగా గమనించలేదు. కానీ తర్వాత తర్వాత ఒక విషయం స్పష్టంగా అర్థమైంది, ఆయన నోటి నుంచి వచ్చే ఏ మాటా వ్యర్థం కాదు. ప్రతి మాటలో ఒక సందేశం ఉంటుంది. ఎదుటి వారిలో ఏదో ఒక లోపాన్ని సరిచేయడం కోసం, లేదా వారు ఎదగడానికి అవసరమైన సూచన ఇవ్వడం కోసం ఆయన మాట్లాడేవారు. చాలా సందర్భాల్లో ఆయన మాటలు ఒకరిని మాత్రమే ఉద్దేశించి చెప్పినట్లుగా కనిపించినా, వాస్తవానికి అక్కడ ఉన్న అందరికీ వర్తించే సందేశాలే. పైకి చూస్తే ఆయన సాధారణంగా మాట్లాడుతున్నట్లు అనిపిస్తుంది. కానీ తెలివైన వారు అలాంటి సమయంలో మాట్లాడటానికి తొందరపడకూడదు, నిశ్శబ్దంగా కూర్చొని ఆయన మాటలను శ్రద్ధగా గమనించాలి, అవసరమైతే వాటిని వ్రాసుకోవాలి.

నాకు ఈ విషయం బాగా అర్థమైన సంఘటన ఒకటి ఉంది. ఒకసారి నేను కూడా ఆయనతో చర్చలో పాల్గొనాలని అనుకుంటూ ఏదో మాట్లాడుతుండే వాడిని, అప్పుడు ఆయన ఒక మాట చెప్పారు. “నువ్వు నేను వచ్చినప్పుడు ఏమీ మాట్లాడొద్దు, వచ్చి నా ప్రక్కన కూర్చో అంతే “ అని. ఆ మాటలో ఎంత గొప్ప అర్థం ఉందో తర్వాత నాకు అర్థమైంది. ఆయన ప్రక్కన కూర్చోవడం వల్ల ఆయనలో ఉన్న శక్తివంతమైన వైబ్రేషన్లు మనపై ప్రభావం చూపుతాయి. ఆ ప్రభావం వల్ల మనలో కూడా క్రమంగా మార్పు, పరివర్తన కలుగుతుంది.

అంతేకాదు, నిశ్శబ్దంగా గమనిస్తే ఆయన మాట్లాడే ప్రతి మాటలోని సందేశం మనకు స్పష్టంగా అర్థమవుతుంది, ఆ మాటలన్నీ ఎంతో అర్థవంతంగా ఉంటాయి.

అలాగే ఆయన కొందరికి పనులు అప్పగించేవారు. "నువ్వు ఈ పని చేయి", "నువ్వు ఆ పని చేయి" అని చెప్పేవారు. అప్పుడు కొందరు అనుకునే వారు, "ఆయన దగ్గరకు వెళ్తే ఏదో పని అప్పగిస్తారు" అని. కానీ నాకు అర్థమైన విషయం వేరు. ఆయన దగ్గరకు వచ్చే ప్రతి ఒక్కరూ తమ గత కర్మల ఫలితాలను అనుభవిస్తూ, కష్టాలతో వస్తారు. వారు ఆ కష్టాల నుంచి ఎలా బయటపడాలో ఆయనకు తెలుసు. అందుకే, ఆ కర్మల తీవ్రత తగ్గడానికి అవసరమైన సేవలను వారికి అప్పగించేవారు. "నువ్వు చేయకూడని పనులు చేసి కష్టాలను తెచ్చుకున్నావు, ఇప్పుడు వాటి నుంచి బయటపడాలంటే చేయవలసిన పనులు చేయాలి", ఏ పని చేస్తే ఆ కర్మ త్వరగా తగ్గుతుందో మీకు తెలియదు, గురువుకు మాత్రం తెలుసు. అందుకే ఆయన ఆ పనులు చేయమని చెప్పేవారు. కానీ కొందరికి అది అర్థం కాదు. "ఆయన దగ్గరకు వెళ్తే ఖర్చు పెట్టే పనులే చెబుతారు" అని అనుకుంటారు.

ఎవరికైనా వచ్చిన కష్టాలు ఊరికే పోవు. కారణం చేసిన కర్మలు అనుభవించక తప్పదు. వాటి పరిష్కారం చేయవలసిన సత్కర్మలను చేయడం. ఏం చేయాలో ఆ స్థితిలో ఉన్న మహనీయులే చెప్పగలరు. చాలామందిని నేను గమనించాను వారు ఏమనుకుంటారంటే, "ఆయన తలపై చేయి పెడితే, లేదా తన శక్తితో మా కష్టాలను తీసేస్తారు" అని. కానీ అది జరగదు, ఎవరు చేసిన కర్మను వారే అనుభవించి తొలగించుకోవాలి. ఎంతటి మహానుభావుడైనా దీనికి మినహాయింపు కాదు.

త్రేతాయుగంలో శ్రీరాముడు చెట్టు చాటు నుంచి వాలిని బాణంతో

సంహరించాడు. ఆ కర్మ ఫలితంగా ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడిగా జన్మించి నప్పుడు, ఒక బోయవాడు వేసిన బాణం వల్లే ఆయన శరీరాన్ని విడిచిపెట్టవలసి వచ్చింది. దీనిని బట్టి కర్మ సిద్ధాంతం ఎంత ఖచ్చితంగా పని చేస్తుందో అర్థమవుతుంది. అందుకే మహనీయుల మాటలను ఎప్పుడూ నిర్లక్ష్యం చేయకూడదు.

ఈ కారణంగానే ఇప్పుడు నేను మహనీయుల సందేశాలను తీసుకుని, వాటి గురించి మీతో చర్చిస్తున్నాను. దీనివల్ల మీకు రెండు రకాల లాభాలు కలుగుతాయి. మొదటిది, మీ జ్ఞానం పెరుగుతుంది, మీ ఆలోచనల పరిధి విస్తరిస్తుంది, మీ ఆధ్యాత్మిక ఎదుగుదలకు ఇది ఎంతో సహాయపడుతుంది. రెండవది, మీరు కూడా ఏ విషయాన్నైనా ఇతరులకు స్పష్టంగా వివరించే నైపుణ్యాన్ని పొందుతారు. అంతేకాదు, మహనీయులు చెప్పిన సందేశాలను సరిగా అర్థం చేసుకుని ఆచరిస్తే, సరైన విధంగా జీవించడం నేర్చుకుంటారు. దాని వల్ల జీవితంలో నిజమైన లాభాన్ని పొందుతారు.

అప్పుడు మీరు ఎంతగా ఎదుగుతారో! ఎంత జ్ఞానం సంపాదిస్తారో! ఎన్నో జన్మల్లో నేర్చుకోవాల్సిన విషయాలను ఈ జన్మలోనే నేర్చుకుంటారో! ఎన్ని జన్మ తగ్గించుకుంటారో ఇప్పుడే మీకు పూర్తిగా అర్థం కాకపోవచ్చు. కానీ మీరు చేసే నిజమైన కృషి వల్ల ఈ మార్పులన్నీ తప్పకుండా మీ జీవితంలో చోటుచేసుకుంటాయి.

# దిగి వచ్చిన దేవుళ్ళమైన మనం లోక కళ్యాణం చేస్తే ఎదిగి వెళ్తామని తెలుసుకున్న వాడే ఆత్మజ్ఞాని

**"ఆత్మ జ్ఞాని దిగి వచ్చిన దేవుళ్ళమైన మనం లోక కళ్యాణం చేస్తే ఎదిగి వెళతాము అని తెలుసుకున్నవాడు, బోధించేవాడు"**

"దిగి వచ్చిన దేవుళ్ళం అయిన మీరు" అంటే నిజంగా మీరు దేవుళ్ళు అనే విషయంపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలి.

ఆత్మ జ్ఞాని అంటే అజ్ఞానం నుంచి బయటపడినవాడు, ఇంకా చెప్పాలంటే, దుఃఖం నుంచి విముక్తి పొందినవాడు. మరింత లోతుగా చెప్పాలంటే, కళ్ళకు కనిపించే వాటిని మాత్రమే కాదు, కళ్ళకు కనిపించని విషయాలను కూడా అర్థం చేసుకున్నవాడు. అలాంటి వ్యక్తికి అనేక విషయాలపై అవగాహన ఉంటుంది. అందువల్ల ఏ విషయాన్నైనా స్పష్టంగా వివరించగలుగుతాడు. పత్రి గారు ఇక్కడ ఏమి చెప్పారంటే, అన్నింటినీ తెలుసుకున్న ఆత్మ జ్ఞానికి ఈ సందేశంలోని ప్రతి అంశం అర్థమవుతుంది. అవి ఏమిటి? "దిగి వచ్చిన దేవుళ్ళ అయిన మీరు" " ముందుగా "దిగి రావడం" అంటే ఏమిటో తెలుసుకోవాలి. ఈ సృష్టిలో సూక్ష్మ లోకాలు ఉన్నాయి, భూమి ఉంది, అలాగే మన కళ్ళకు కనిపించని ఉన్నత లోకాలు కూడా ఉన్నాయి.

ఆ ఉన్నత లోకాలలో నివసించే మీరు, అక్కడి నుంచి భూమి పైకి దిగి వస్తారు. ప్రతి జన్మలోనూ మీరు భూమికి ఎందుకు వస్తున్నారు అంటే, అనుభవాలు పొందడానికి, పాఠాలు నేర్చుకోవడానికి, తద్వారా జ్ఞానాన్ని పెంచుకోవడానికి వస్తున్నారు. అయితే ఈ జ్ఞానం లేకపోతే, భూమి పైకి వచ్చిన వెంటనే ఇవన్నీ మర్చిపోతారు. ఎందుకంటే పై లోకాలలో ఉన్నప్పుడు అక్కడ స్థూల శరీరం ఉండదు. అక్కడ ఆత్మ మాత్రమే ఉంటుంది. అందువల్ల ఆత్మగా ఉన్నప్పుడు, భూమి పైకి వెళ్ళి ఏమి చేయాలి? ఏ లక్ష్యాన్ని సాధించాలి?

అనే విషయాలను అక్కడ ఉన్న మాస్టర్లతో సంప్రదిస్తారు. వారి మార్గదర్శకత్వంలో భూమిపై చేయవలసిన కార్యాలకు సంబంధించిన ఒక ప్రణాళికను రూపొందించుకుంటారు. "నేను భూమి పైకి వెళ్తాను. అక్కడ ఈ పనులు చేయాలి." అని ముందుగానే నిర్ణయించుకుంటారు. అసలు భూమి పైకి వచ్చేది ఎవరు? అంటే ఆత్మే. ఆత్మ అంటే సాక్షాత్తు దైవ స్వరూపమే. అయితే భూమి పైకి వచ్చేది ఎవరు? మీరే. అంటే మీరు ఎవరు? దేవుళ్ళే. దేవుళ్ళు అయిన మీరు దేని కోసం భూమి పైకి దిగివచ్చారు? ఉన్నత లోకాలను చేరుకోవ డానికి, అవసరమైన అనుభవాలను సంపాదించుకోవడానికి. పై లోకాలలో ఆధ్యాత్మిక మాస్టర్లు మీతో మాట్లాడతారు. మీ సందేహాలను నివృత్తి చేస్తారు. మీరు ఇంకా ఉన్నత లోకాలను చేరుకోవాలంటే ఏమి చేయాలో వివరిస్తారు.

అప్పుడు మీకు ఒక గొప్ప విషయం అర్థమవుతుంది. "నేను ఇప్పుడు ఉన్న లోకమే అంతా కాదు. దీని కంటే ఇంకా ఉన్నతమైన అనేక లోకాలు ఉన్నాయి. అవి మరింత గొప్పవి" ఆ లోకాలను చేరుకోవాలంటే భూమి పైకి వెళ్ళి లోక కళ్యాణం చేయాలని వారు మీకు ఉపదేశిస్తారు.

"మీరు భూమిపై లోక కళ్యాణం చేస్తే, ఇంకా ఉన్నతమైన లోకాలకు చేరుకుంటారు. అదే మీరు చేయవలసిన ముఖ్యమైన పని" అని వారు వివరిస్తారు. అప్పుడు పై లోకాలలోనే మీకు సత్యం తెలుస్తుంది", నేను కేవలం మానవుడిని కాదు, నేను దైవస్వరూపుడిని" అని. అలాగే వారు మీతో ఇలా చెప్తారు "నాయనా! నీవు ఇంకా ఎదగాలి. భూమిపై దైవ స్థితిని పొందాలి. అలా సాధన చేసి ఎదిగితే, ఇంకా ఉన్నతమైన లోకాలకు చేరుకోగలవు. చివరికి నీవు చేరుకోవలసిన గమ్యం సత్యలోకం, అదే నీ పరమ లక్ష్యం" అని చెబుతారు.

ఈ విషయాలన్నింటినీ అక్కడే మీకు వివరిస్తారు. అందుకే భూమి పైకి వెళ్ళి లోక కళ్యాణం చేసి, తిరిగి పై లోకాలకు వచ్చినప్పుడు, మీరు మరింత ఉన్నతమైన లోకాలకు ఎదగగలుగుతారని అక్కడి మాస్టర్లు మీకు

ఉపదేశిస్తారు. ఈ విషయానికి సంబంధించి పత్రి గారు ఏమన్నారంటే, "మీరు అందరూ దేవుళ్ళే, అయితే భూమి పైకి మానవ అనుభవాలు పొందడానికి దిగి వచ్చారు" అని చెప్పారు.

అంటే మీరు దేవుళ్ళే. పూర్ణాత్మ నుంచి వెలువడిన అంశలే. మానవ అనుభవాలను పొందడం కోసం భూమిపైకి దిగివచ్చారు. అయితే ఒకేసారి సత్యలోకానికి వెళ్ళిపోవడం జరగదు. అనేక జన్మలు తీసుకుంటూ, ప్రతి జన్మలో లోక కళ్యాణం చేస్తూ, క్రమంగా ఎదుగుతూ ఉంటారు. అలా భూమి పైకి రావడం, లోకకళ్యాణకరమైన పనులు చేయడం, తిరిగి పై లోకాలకు వెళ్ళి, అంతకుముందు ఉన్న లోకం కంటే ఇంకా ఉన్నతమైన లోకాన్ని చేరుకోవడం ఇలా ఆత్మ యొక్క ప్రయాణం కొనసాగుతూ ఉంటుంది. ఈ జ్ఞానం పొందిన వారికి ఈ విషయం స్పష్టంగా అర్థమవుతుంది.

ఇప్పుడు మీలో కూడా చాలామంది ఈ విషయాన్ని అర్థం చేసుకున్నారు. అందుకే ఆత్మగా ఎదగాలనే సంకల్పంతో శ్రద్ధగా ఈ జూమ్ ల్లో పాల్గొంటున్నారు. భీమవరం వెళ్ళి తీవ్ర సాధన చేస్తున్నారు. ఇంకా చేయగలిగిన ప్రతి ప్రయత్నం చేస్తున్నారు. ఎందుకంటే మీరు ఒక సత్యాన్ని తెలుసుకున్నారు. "నేను మానవుడిని కాదు, నేను దేవుణ్ణి. ఎదగడం కోసమే భూమి పైకి దిగివచ్చాను. ఇక్కడ ఎదగాలంటే లోక కళ్యాణ కరమైన పనులు చేయాలి" అనే అవగాహన మీకు వుంది.

అందుకే మీకు వీలైనంత వరకు పత్రి గారు చెప్పినవి ఆచరిస్తున్నారు. అవి:

**ధ్యాన సాధన :** శ్వాస మీద ధ్యాస వుంచి ధ్యానం చేయడం.

**స్వాధ్యాయం:** జ్ఞానాన్ని పెంచే పుస్తకాలను చదవడం.

**సాంగత్యం :** జ్ఞానాన్ని బోధించే మహనీయుల సందేశాలను వినడం.

**సేవ:** లోక కళ్యాణానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేయడం.

ఈ నాలుగు ఆచరిస్తే, ఆత్మ అయిన మీరు ఉన్నత లోకాలను చేరుకోగలరని తెలుసుకుని వాటిని చేస్తున్నారు. మా ఇద్దరి జీవితాల్లో కూడా ఇదే జరిగింది. మొదట్లో మేము అజ్ఞానంలో ఉన్నప్పుడు, దేహానికి ఉపయోగపడే సేవలనే చేసే వాళ్ళం. కానీ పత్రి గారు పరిచయం అయిన తర్వాత ఒక గొప్ప సత్యాన్ని తెలుసుకున్నాం. సేవలు రెండు రకాలుగా ఉంటాయి.

ఒకటి ఇతరుల దేహానికి లాభం కలిగించే సేవలు. రెండవది ఇతరుల ఆత్మకు లాభం కలిగించే సేవలు.

ఇతరుల దేహానికి లాభం కలిగించే సేవలు చేస్తే, దాని ఫలితం దేహానికే పరిమితమవుతుంది. కానీ ఇతరుల ఆత్మకు లాభం కలిగించే సేవలు చేస్తే, ఆత్మ అయిన మీరు కూడా లాభం పొందుతారు. మీ ఆధ్యాత్మిక ఎదుగుదలకు అవి కారణమవుతాయి. ఈ విషయం తెలుసుకున్న తర్వాత మేము కూడా ఆ దిశగా సేవ చేయడం ప్రారంభించాము. ఇప్పుడు మీలో ప్రతి ఒక్కరూ మీ ఆసక్తి, సామర్థ్యం, అవకాశం మేరకు ఈ సేవలను చేస్తున్నారు. ఇక్కడ మీరు ఒక విషయం గమనించాలి. ఇన్ని నెలలుగా మీరు జ్ఞానం తెలుసుకుంటూ, సాధన చేస్తూ, భీమవరం వెళ్ళి సాధనలో పాల్గొంటూ, ఈ జూమ్ తరగతులకు హాజరవుతూ ఉండడం వల్ల, మీకు తెలియకుండానే ఆత్మగా మీరు ఎదుగుతున్నారు, మీ జ్ఞానం క్రమంగా పెరుగుతోంది. ఎప్పుడైతే మీరు ఈ విధంగా జ్ఞానాన్ని పెంచుకుంటారో, శరీరాన్ని విడిచిన తర్వాత అంతకుముందు ఉన్న లోకాల కంటే ఇంకా ఉన్నతమైన లోకాలను చేరుకునే అవకాశం మీకు లభిస్తుంది.

కానీ భూమిపై చాలామందికి ఈ విషయం తెలియదు. ధ్యానంలోకి వచ్చిన వారిలో కూడా చాలామంది శరీర లాభాల కోసమే ధ్యానం చేస్తున్నారు. ఎందుకంటే వారు తమను శరీరమే అని భావిస్తున్నారు. కానీ “నేను ఆత్మను” అని తెలుసుకున్న వారు మాత్రం ఆత్మ ఉన్నతికి, ఆత్మ లాభానికి, ఆత్మ

ఎదుగుదలకు అవసరమైన పనులనే చేస్తారు. వారి ఆలోచన "నేను ఇంకా ఉన్నతమైన లోకాలను చేరుకోవాలి, నేను ఇంకా ఆధ్యాత్మికంగా ఎదగాలి, అదే నా అసలు లక్ష్యం" అని ఉంటుంది.

అందుకే వారు కేవలం శరీర ఎదుగుదలకే ప్రాముఖ్యత ఇవ్వరు. ఉదాహరణకు, ఇక్కడ మీరు చాలా డబ్బు సంపాదించారని అనుకోండి. ఒక చిన్న ఇంట్లో ఉన్నవారు ఎంతో కష్టపడి ఒక పెద్ద ఇల్లు లేదా బంగ్లాలోకి మారారు అనుకోండి. తనను శరీరమే అని భావించే వ్యక్తి, "నేను ఎంత గొప్పగా ఎదిగాను! ఎంత కష్టపడ్డాను! ఎంత సంపాదించాను! ఎంత పెద్ద ఇంట్లోకి వచ్చాను!" అని సంబరపడతాడు. కానీ జ్ఞానం ఉన్నవాడు అతనిని చూసి మనసులో నవ్వుకుంటాడు.

"పాపం! పెద్ద ఇంట్లోకి వెళ్ళానని సంతోషపడుతున్నాడు. కానీ ఆ ఇంటిని సంపాదించడానికి తన జీవితమంతా ఖర్చు చేశాడు. చివరికి ఎంత పెద్ద ఇంట్లో ఉన్నా, ఒక రోజు శరీరాన్ని విడిచి వెళ్ళాల్సిందే. శరీరాన్ని ఇక్కడే వదిలి వెళ్తాడు. దానిని చివరికి దహనం చేస్తారు". అప్పుడు శరీరాన్ని విడిచిన తర్వాత అతనికి ఒక సత్యం అర్థమవుతుంది. "నేను ఎంతో సాధించానని, ఎంతో సంపాదించానని, ఎంతో లాభపడ్డానని అనుకున్నాను. కానీ ఆ సంపదలో ఒక్కటి కూడా నాతో రాలేదు. దాని వల్ల నా ఆత్మకు ఎలాంటి ఉపయోగం కలగలేదు" అని గ్రహిస్తాడు.

అందుకే అజ్ఞానంలో ఉన్న వారు, తమను దేహమే అని భావించే వారు, దేహ సుఖాలకు, దేహ భోగాలకు, పేరు, ప్రఖ్యాతులకు ఎక్కువగా ఆకర్షితులవుతారు. వాటి వెనుకే జీవితమంతా పరిగెడతారు. చివరికి శరీరాన్ని విడిచిన తర్వాతే వారికి నిజం అర్థమవుతుంది. "నేను ఎంతో గొప్ప పనులు చేశానని అనుకున్నాను, ఎంతో గొప్పవాడినయ్యానని భావించాను. కానీ ఆత్మ పరంగా నేను ఏమి సంపాదించలేదు" అనే సత్యాన్ని అప్పుడే గ్రహిస్తారు.

నేను భూమిపై ఎంతో గొప్ప పదవిని సాధించాను. ఎంతో గొప్ప వ్యక్తిని” అని భావించినా, శరీరాన్ని విడిచిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోతుంది.

ఆధ్యాత్మిక జ్ఞానం లేకపోవడం వల్ల, అతడిని ఉన్నత లోకాలకు కాకుండా చాలా దిగువ లోకాలకు తీసుకెళ్తారు. అప్పుడు అతడు ఆశ్చర్యపోతూ ఇలా అడుగుతాడు. “నేను భూమిపై అంత గొప్పవాడిని, నన్ను ఈ లోకానికి ఎందుకు తీసుకొచ్చారు?” అప్పుడు అక్కడి మాస్టర్స్ అతనికి ఇలా చెబుతారు “భూమిపై నీవు ఎంత గొప్ప పదవిలో ఉన్నా, ఉన్నత లోకాలకు వెళ్ళడానికి అవసరమైన జ్ఞానాన్ని నీవు సంపాదించలేదు. భూమిపై సంపాదించిన సంపద, పదవులు, పేరు ప్రఖ్యాతుల ఇక్కడ పనికి రావు, ఇక్కడ ఉపయోగపడేది ఆత్మజ్ఞానం మాత్రమే. ఆ జ్ఞానాన్ని నీవు సంపాదించలేదు, అలాంటప్పుడు నిన్ను ఉన్నత లోకాలకు ఎలా తీసుకెళ్ళగలం?” అని చెబుతారు.

అందుకే భూమిపై ముఖ్యమంత్రి వంటి అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తినైనా, ఆధ్యాత్మిక జ్ఞానం లేకపోతే దిగువ లోకాలకే తీసుకెళ్ళబడతాడు. మీలో చాలామంది ఒకప్పుడు ఇలా బాధపడి ఉండవచ్చు “నా దగ్గర అంత డబ్బు లేదు, నేను గొప్ప కుటుంబంలో పుట్టలేదు, నేను ఒక సాధారణ స్త్రీని, లేదా సాధారణ వ్యక్తిని, భగవంతుడు నాకు ఇలాంటి జీవితాన్నే ఎందుకు ఇచ్చాడు?” అని. కానీ అదృష్టవశాత్తూ మీరు ఈ ఆధ్యాత్మిక మార్గంలోకి వచ్చారు. భీమవరం వచ్చారు, జూమ్ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు, జ్ఞానాన్ని సంపాదిస్తున్నారు. అందువల్ల మీరు శరీరాన్ని విడిచిన తర్వాత, ఉన్నత లోకాలకు తీసుకెళ్ళబడతారు. భూమిపై గొప్పవాడిని అని భావించిన ముఖ్యమంత్రి దిగువ లోకంలో ఉండవచ్చు. కానీ భూమిపై తాను సామాన్యుడినని బాధపడిన మీరు, జ్ఞానాన్ని సంపాదించిన కారణంగా ఉన్నత లోకాలను చేరుకోవచ్చు.

ఈ ఇద్దరి మధ్య తేడా ఏమిటి? అతను డబ్బు, పదవులు, పేరు ప్రఖ్యాతుల సంపాదించాడు. మీరు జ్ఞానాన్ని సంపాదించారు, బుద్ధిని వికసింప

చేసుకున్నారు, లోక కళ్యాణ కరమైన పనులు చేశారు. అందుకే మీ ఆత్మ ఉన్నత స్థితిని పొందుతుంది. ఈ విషయాన్ని ఆత్మ జ్ఞాని స్పష్టంగా తెలుసుకుంటాడు. “నేను దేవుణ్ణి, ఇంకా ఎదగడం కోసం, ఒక లోకం నుంచి మరింత ఉన్నతమైన లోకానికి చేరుకోవడం కోసం భూమి పైకి వచ్చాను. ఈ శరీరాన్ని ఉపయోగించి జ్ఞానాన్ని సంపాదిస్తూ, లోకకళ్యాణకరమైన పనులు చేస్తే, శరీరాన్ని విడిచిన తర్వాత ఉన్నత లోకాలను చేరుకోగలను.” అని అతనికి స్పష్టంగా తెలుసు. అందుకే అతడు తనకు చేతనైనంత వరకు, తనకు వీలైనంత వరకు, ఆత్మకు లాభం కలిగించే సేవలనే చేస్తాడు. లోకకళ్యాణకరమైన ఆత్మ సేవలో తన జీవితాన్ని వినియోగిస్తాడు. ఇప్పుడు మీరు కూడా అదే చేస్తున్నారు. మీ సమయాన్ని, మీ శక్తిని, మీ వాక్కును, మీ ధనాన్ని, మీ ఆయుష్షును మీ దగ్గర ఉన్న అన్ని వనరులని ఆధ్యాత్మికంగా ఎదగడం కోసం ఉపయోగిస్తున్నారు.

మీ కళ్ళను జ్ఞానాన్ని అందించే కార్యక్రమాలు చూడడానికి ఉప యోగిస్తున్నారు, జ్ఞానవంతమైన పుస్తకాలను చదవడానికి ఉపయోగిస్తున్నారు. మీ చెవులను ఆధ్యాత్మిక సందేశాలు వినడానికి ఉపయోగిస్తున్నారు. మీ నోటిని మీరు సంపాదించిన జ్ఞానాన్ని ఇతరులకు బోధించడానికి ఉపయోగిస్తున్నారు. మీ శరీరాన్ని కూడా ఆత్మ సేవకు, లోక కళ్యాణకరమైన సేవలకు వినియోగిస్తున్నారు.

ఒక్కసారి భీమవరంలో జరిగే కార్యక్రమాలను గమనించండి. అక్కడ ఒక్కొక్కరు ఎన్ని రకాల సేవలు చేస్తున్నారో చూడండిఎవరికి చేతనైన సేవను వారు చేస్తున్నారు. ఏదైనా గొప్ప ఆధ్యాత్మిక కార్యక్రమం జరిగినప్పుడు, అందులో కూడా తమ వంతు సేవను ఆనందంగా అందిస్తున్నారు. మీరు చేసే ఈ సేవల్లో ఏదీ వృథా కాదు. మీరు ఎంత చిన్న సేవ చేసినా, అది మీ ఆత్మ ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుంది.

అందుకే ఒక విషయం ఎప్పుడూ గుర్తుంచుకోండి. మీ శరీరాన్ని

వృథా చేయకండి. కేవలం సుఖాల కోసం, కాలక్షేపం కోసం, భోగాల కోసం ఈ శరీరాన్ని ఉపయోగించకండి. ఆత్మ అయిన మీరు, ఈ శరీరాన్ని ఉపయోగించుకొని ఎదగడానికి భూమి పైకి వచ్చారు. పత్రి గారు కూడా ఇదే విషయాన్ని చెబుతున్నారు. "మీరు కేవలం మానవులు కాదు. భూమి పైకి కేవలం ఎంజాయ్ చేసి వెళ్ళిపోవడానికి రాలేదు. కోళ్ళు, మేకలు వంటి జీవులను హింసిస్తూ, వాటిని భక్షిస్తూ, ఆ పాప ఫలితంతో పతనం చెందడానికి రాలేదు" ఆ జీవులు కూడా మీ లాగే ఆత్మలు, అవి కూడా ఎదగడం కోసమే భూమి పైకి వచ్చాయి.

అలాంటి జీవులను హింసించి, వాటిని ఆహారంగా తీసుకొని, మీ ఆధ్యాత్మిక పతనానికి మీరే కారణం ఎందుకు అవుతారు? అనే ప్రశ్నను పత్రి గారు మన ముందుంచారు. మీరు ఎవరో మీకు తెలియక, ఈ దేహాన్నే చూసుకుంటూ, "ఈ దేహమే నేను" అని భావిస్తూ జీవిస్తున్నారు. పక్షులను, జంతువులను తింటే అదే గొప్ప అని అనుకుంటున్నారు. వాటిని హింసించి, చంపి, వాటి మాంసాన్ని భక్షిస్తూ ఎంత నష్టపోతున్నారో మీకు తెలియడం లేదు. "ఇదే జీవితం" అని భావిస్తూ కాలం గడిపేస్తున్నారు. అసలు దాని కోసమేనా మీరు భూమి పైకి వచ్చింది? అంటే కాదు.

మీరు దేవుళ్ళు, దేవుళ్ళు అయిన మీరు భూమి పైకి దిగివచ్చింది కేవలం ఇంద్రియ సుఖాల కోసం కాదు, లోకకళ్యాణకరమైన పనులు చేయడం కోసమే వచ్చారు. అలాంటి పనులనే ఇప్పుడు మీరు చేస్తున్నారు, ఈ శరీరాన్ని విడిచిన తర్వాత మళ్ళీ పై లోకాలకు వెళ్తారు. అక్కడ ఇంకా ఉన్నతమైన లోకాలను చేరుకుంటారు. ఈ సత్యాన్ని మీరు తెలుసుకున్నారు. ఇప్పుడు ఇదే విషయాన్ని నేను, అమ్మ, అలాగే మీలో చాలామంది ఇతరులకు బోధిస్తున్నారు. మీలో ఎంతోమంది ఊరు ఊరు తిరుగుతూ, ఎంతో కష్టపడి, స్వంత ఖర్చుతో ఈ జ్ఞానాన్ని ప్రచారం చేస్తున్నారు. ప్రజలకు జ్ఞానాన్ని తెలియజేస్తున్నారు.

"మీరు ఆత్మలు. మీరు భూమి పైకి మాంసం తినడానికి, చేపలు, గుడ్లు తినడానికి రాలేదు." అనే జ్ఞానాన్ని వారికి బోధిస్తున్నారు. మీరు తెలుసుకున్న జ్ఞానాన్ని మన వాళ్ళు ఎన్నో ప్రాంతాలకు వెళ్ళి ఎంతో మందికి పంచుతున్నారు. చాలామంది ప్రచార కార్యక్రమాల ఫోటోలను కూడా పంచుకుంటున్నారు. ఇంకా ఆ పని ప్రారంభించని వారు కూడా ఇప్పటి నుంచైనా ప్రారంభించే ప్రయత్నం చేయండి. ఇంకా ప్రచారానికి వెళ్ళని వారు కూడా వెళ్లేందుకు ప్రయత్నించండి. కేవలం ఇంట్లోనే కూర్చోవద్దు.

ఉద్యోగం ఉన్నా, వారానికి ఒకరోజు సెలవు ఉంటుంది. పండుగల సమయంలో మరికొన్ని సెలవులు కూడా వస్తాయి. ఆ రోజులను వృథా చేయకుండా ఆధ్యాత్మిక ప్రచారానికి వినియోగించండి. సాయంత్రం సమయాన్ని కూడా సద్వినియోగం చేసుకోండి. మీకు దగ్గరలో ఉన్న గ్రామాలకు వెళ్ళండి, జ్ఞానాన్ని పంచండి. ఈ జూమ్ మానకండి. భీమవరం సాధనను కూడా మానకండి. ఎంత కృషి చేసి, ఎంత జ్ఞానాన్ని సంపాదిస్తే, అంత ఉన్నతమైన లోకాలను చేరుకునే అర్హతను మీరు పొందుతారు.

సృష్టిలో కోటానుకోట్ల లోకాలు ఉన్నాయి. మీరు కొద్దిగా కృషి చేస్తే కొద్దిగా ఎదుగుతారు. ఇంకా ఎక్కువ కృషి చేస్తే ఇంకా ఉన్నత స్థాయికి ఎదుగుతారు. ఈ విధంగా కొన్ని జన్మల పాటు నిరంతరం సాధన చేస్తూ, లోకకళ్యాణం చేస్తూ ముందుకు సాగితే, చివరికి మీ జీవిత లక్ష్యాన్ని చేరుకుంటారు. అందువల్ల ఈ విషయాలన్నింటినీ మీరు ముందుగా పూర్తిగా తెలుసుకోవాలి, తరువాత ఇతరులకు కూడా బోధించాలి.

అందుచేత తిరిగి వచ్చిన దేవుళ్ళైన మీరు అలా లోక కళ్యాణం చేసి పై లోకాలకు వెళతారు.

# "ఆత్మ జ్ఞాని శరీరం యొక్క గొప్పతనాన్ని మానవ జన్మ యొక్క గొప్పతనాన్ని తెలుసుకున్నవాడు"

పత్రి గారు భూమి పైకి ఎందుకు వచ్చారంటే, భూమిపై ఉన్న అశాంతి, అలజడులు, యుద్ధాలు, అలాగే మానవుడు ఎదుర్కొంటున్న కష్టాలు, సమస్యలు, బాధలు వంటి వాటి నుండి మానవాళిని పూర్తిగా విముక్తి చేయడానికి వచ్చారు. ఈ సమస్త దుఃఖాలకు మూల కారణం మానవుని అజ్ఞానమే. అజ్ఞానం వల్లనే అన్ని రకాల దుఃఖాలు, సమస్యలు, సంఘర్షణలు ఉత్పన్నమవుతున్నాయి. కాబట్టి, ఈ దుఃఖాల నుండి బయటపడాలంటే మానవుడు జ్ఞానాన్ని సంపాదించుకోవాలి. ఆ జ్ఞానాన్ని పొందడానికి ఏమి చేయాలో కూడా ఆయనే స్పష్టంగా బోధించారు. "సాధన చేయాలి, స్వాధ్యాయం చేయాలి, సత్ సాంగత్యం చేయాలి, ఆత్మ సేవ చేయాలి" అని.

అంతేకాకుండా, ఈ సాధనలను ఆచరిస్తున్న మీరు ఎంతవరకు జ్ఞానాన్ని సంపాదించగలిగారు, నిజంగా జ్ఞానం పొందారా? లేదా? అనే విషయాన్ని మీకు మీరే తెలుసుకునే విధంగా కూడా కొన్ని సూచనలు అందించారు. "ఇంత సాధన చేస్తున్నాం, ఇంత కష్టపడుతున్నాం. కానీ నిజంగా జ్ఞానం వచ్చిందా లేదా?" అనే ప్రశ్నకు సమాధానం ఎలా తెలుసుకోవాలి? అనే విషయాన్ని వివరించడానికి లాక్‌డౌన్ సమయంలో అనేక సందేశాలను ఇచ్చారు.

జ్ఞానం వచ్చిందా? లేదా? అనేది మీ ప్రవర్తనను బట్టి తెలుస్తుంది. అందుకే ఆత్మ జ్ఞాని యొక్క ప్రవర్తన ఎలా ఉండాలో సుమారు ఎనభై రోజులకు పైగా వివరించారు.

ఆ ఆత్మ జ్ఞాని లక్షణాలను మీరు కూడా ప్రతిరోజూ తెలుసుకుంటు

న్నారు. ఈరోజు ఆయన చెప్పిన మరొక ముఖ్యమైన సందేశం ఏమిటంటే, **"ఆత్మ జ్ఞాని శరీరం యొక్క గొప్పతనాన్ని, మానవ జన్మ యొక్క గొప్పతనాన్ని తెలుసుకున్నవాడు".**

ఈ వాక్యంలో రెండు ముఖ్యమైన విషయాలు ఉన్నాయి.

**శరీరం యొక్క గొప్పతనం.**

**మానవ జన్మ యొక్క గొప్పతనం.**

అజ్ఞానికి ఈ రెండింటి విలువ తెలియదు. కానీ ఆత్మ జ్ఞానికి శరీరం యొక్క గొప్పతనం తెలుసు, మానవ జన్మ యొక్క గొప్పతనం కూడా తెలుసు. అందువల్ల ఆత్మ జ్ఞాని తన శరీరాన్ని గానీ, మానవ జన్మను గానీ ఎన్నడూ వృథా చేయడు. వాటిని దుర్వినియోగం చేయడు. వాటిని సంపూర్ణంగా సద్వినియోగం చేసుకుంటాడు.

ఇక్కడ మీరు మూడు రకాల పదాల అర్థాన్ని స్పష్టంగా తెలుసుకోవాలి.

- నిర్వినియోగం
- దుర్వినియోగం
- సద్వినియోగం

దుర్వినియోగం చేసుకునే వ్యక్తి తనకు ఇవ్వబడినవి, తనకు ఉన్నవి లేదా తాను సంపాదించుకున్న వాటిని సరైన లక్ష్యానికి ఉపయోగించకుండా, తప్పు మార్గంలో లేదా హానికరమైన విధంగా ఉపయోగిస్తాడు.

కానీ ఏదైనా సరే, తనకు లభించిన వాటిని దుర్వినియోగం చేసుకున్నవాడు ఎంతో దురదృష్టవంతుడు. ఎందుకంటే, దానిని ఒక విధంగా ఉపయోగించాల్సి ఉండగా, మరో విధంగా ఉపయోగిస్తాడు, లాభం చేకూర్చాల్సిన దానిని, నష్టాన్ని కలిగించే విధంగా వినియోగిస్తాడు. అందుకే దుర్వినియోగం అంటే నష్టం కలిగించే విధంగా ఉపయోగించడం అని అర్థం.

అలాగే నిర్వినియోగం అంటే, తనకు లభించిన అవకాశాలను లేదా

వనరులను ఎలాంటి ప్రయోజనం లేకుండా వృథా చేయడం. వాటిని సద్వినియోగం చేయకుండా కాలాన్ని, శక్తిని, సామర్థ్యాన్ని వ్యర్థంగా గడిపేయడం. ఒక రకంగా చెప్పాలంటే, అది పూర్తిగా వేస్ట్ చేయడమే.

అయితే సద్వినియోగం అంటే, తనకు లభించిన వాటిని సంపూర్ణంగా సరైన లక్ష్యానికి ఉపయోగించుకోవడం. వాటి ద్వారా లాభం పొందడం, సాధించాల్సిన లక్ష్యాన్ని సాధించడం, తనకు ఇవ్వబడిన వనరులను సార్థకం చేసుకోవడం. అలా చేసే వ్యక్తినే సద్వినియోగం చేసుకున్నవాడు అంటారు.

సహజంగా ఈ మూడు వాటి గొప్పతనాన్ని తెలుసుకోవడం మీద ఆధారపడి ఉంటాయి. ఏ అవకాశం ఎంత గొప్పదో తెలిసినవాడే దానిని సద్వినియోగం చేసుకోగలడు. ఆ గొప్పతనం ఎవరికి తెలుస్తుంది? ఆత్మ జ్ఞానికి మాత్రమే తెలుస్తుంది. ఇప్పుడు మీరు గమనిస్తే, ఈ సృష్టిలో అనేక రకాల జీవులు, జీవరాశులు ఉన్నాయి.మొత్తం 84 లక్షల రకాల జీవులు ఉన్నాయి.

ఈ 84 లక్షల జీవరాశులలో అత్యంత గొప్ప జన్మ ఏది అంటే మానవ జన్మ. ఎందుకంటే, ఈ మానవ జన్మలోనే మిగతా 84 లక్షల జీవరాశులకు లభించని విశిష్టమైన శరీరం మానవుడికి లభించింది. అందువల్ల మానవుడు పొందిన ఈ శరీరం గొప్పది, మానవ జన్మ కూడా గొప్పది. ఈ సత్యాన్ని అర్థం చేసుకున్నవాడు, ఈ గొప్పతనాన్ని తెలుసుకున్నవాడు తన శరీరాన్ని గానీ, తన మానవ జన్మను గానీ ఎప్పుడూ దుర్వినియోగం చేయడు, నిర్వినియోగం చేయడు, వాటిని పూర్తిగా సద్వినియోగం చేసుకుంటాడు, అలాంటి వ్యక్తే నిజమైన అదృష్టవంతుడు.

ఆ విధంగా జీవించే వారే మీరు కూడా. ప్రపంచంలో సుమారు 780 కోట్ల మంది జనాభా ఉన్నారు. కానీ, ఈ మానవ శరీరాన్ని మరియు మానవ జన్మను పూర్తిగా సద్వినియోగం చేసుకునే వారు చాలా కొద్దిమంది మాత్రమే. మీరు మాత్రం దేనికి ఉపయోగించాలో దానికి ఉపయోగిస్తూ,

చేయవలసిన పనిని చేస్తూ, సాధించవలసిన లక్ష్యాన్ని సాధించేందుకు విశేషమైన కృషి చేస్తున్నారు.

ఒక విధంగా చెప్పాలంటే, ఇన్ని కోట్ల మంది మనుషులలో ఈ సత్యాన్ని గ్రహించడం ఎంతో గొప్ప అదృష్టం. ఈ విషయం మీకు నిజంగా అర్థమైతే, మీరు ఈ మానవ జన్మను ఒక్క క్షణం కూడా వృథా చేయరు, దుర్వినియోగం చేయరు. పూర్తిగా సద్వినియోగం చేసుకుంటారు. ఎందుకంటే, ఈ జన్మలో మీకు ఒక నిర్దిష్టమైన ఆయుష్షు ఇవ్వబడింది, అంటే ఒక నిర్దిష్టమైన సమయం ఇవ్వబడింది. ఆ సమయాన్ని ఒక్క నిమిషం కూడా వృథా చేయకుండా సంపూర్ణంగా సద్వినియోగం చేసుకోవాలి.

అలాగే మీకు లభించిన ఈ మానవ శరీరంలో జ్ఞానేంద్రియాలు ఉన్నాయి, కర్మేంద్రియాలు ఉన్నాయి, మనస్సు ఉంది, బుద్ధి ఉంది. ఇలాంటి శక్తులన్నీ ఉన్నాయి. వీటిని దేనికి ఉపయోగించాలో దానికే ఉపయోగించాలి.

ఈ ఇంద్రియాలను, మనస్సును, బుద్ధిని దుర్వినియోగం చేస్తే, ఈ జన్మ వృథా అవుతుంది, సమయం వృథా అవుతుంది. అంతేకాక, తప్పు పనుల వల్ల కొత్త కర్మలు పెరిగి, కష్టాలు పెరుగుతాయి. అలాగే వీటిని నిర్వినియోగం చేస్తూ, కాలక్షేపం చేస్తూ గడిపినా ఫలితం ఉండదు. ఎందుకంటే, ఇవన్నీ ఎంత గొప్పవో ఆత్మ జ్ఞానికే పూర్తిగా తెలుస్తుంది, సామాన్యుడికి ఈ గొప్పతనం తెలియదు.

ఆత్మ జ్ఞానికి మాత్రం ఒక విషయం స్పష్టంగా తెలుసు. కొంతకాలం తర్వాత ఈ శరీరాన్ని వదిలివేయాల్సి వస్తుంది. మళ్ళీ మరో శరీరం పొందడానికి వందల, వేల సంవత్సరాలు కూడా పట్టవచ్చు. అంతేకాదు, ఆ మధ్యలో అనుభవించాల్సిన బాధలు, కష్టాలు, నరక సమానమైన అనుభవాలు కూడా ఉండవచ్చు.

అందువల్ల ఈ సత్యాన్ని గ్రహించిన ఆత్మజ్ఞాని తన శరీరాన్ని గానీ,

సమయాన్ని గానీ, మానవ జన్మను గానీ ఎన్నడూ వృథా చేయడు. ఎందుకంటే, ఈ 84 లక్షల జీవరాశులలో ఏ జీవికీ లభించని శరీరం మానవుడికే లభించింది. ముఖ్యంగా ఈ మానవ శరీరంతోనే మానవుడు మాధవుడిగా ఎదగగలడు, తన జీవిత లక్ష్యాన్ని సాధించగలడు, పూర్ణాత్మగా ఎదగగలడు, ఈ సృష్టిని సృష్టించిన సృష్టికర్త స్థాయికి కూడా ఎదగగలడు.

అది ఎలా సాధ్యమవుతుంది? ఈ మానవ శరీరాన్ని సరైన విధంగా ఉపయోగించుకోవడం ద్వారా సాధ్యమవుతుంది. కోట్లాది లోకాలను, కోట్లాది జీవరాశులను సృష్టించిన ఆ సృష్టికర్త ఎంత గొప్ప స్థాయికి వున్నాడో, ఆ స్థాయికి ఎదగగల సామర్థ్యం కూడా ఈ మానవ శరీరానికే ఉంది. కాబట్టి గుర్తుంచుకోండి సృష్టికర్తలాగా ఎదగగల అవకాశం ఈ ఒక్క మానవ శరీరానికే ఉంది.

ఈ విషయాన్ని మీరు అర్థం చేసుకుంటే, ఈ శరీరం ఎంత గొప్పదో, దానిని ఎలా ఉపయోగించాలో తెలుసుకుంటారు. అప్పటి నుండి మీరు మరింత జాగ్రత్తగా జీవిస్తూ, మరింత కృషి చేస్తూ, ఈ శరీరాన్ని సరైన మార్గంలో సద్వినియోగం చేసుకుంటారు.

ఆ సృష్టికర్త లాగే మీరు కూడా ఎదగవచ్చు. మీరు సృష్టికర్తల వలె మారితే, మిమ్మల్ని సహ సృష్టికర్తలు (కో–క్రియేటర్స్) అని అంటారు. ఇలాంటి మహానుభావులనే, జ్ఞానం పొందని సాధారణ ప్రజలు దేవుళ్ళు అని పిలుస్తారు. “వారు ఎంత గొప్ప వారు! వారికి అన్నీ తెలుసు, వారు ఏదైనా చేయగలరు” అనే భావంతో వారికి గుడులు నిర్మిస్తారు. వారు ఎక్కడ ఉన్నారో తెలియకపోతే, వారి విగ్రహాలను, అంటే ప్రతి రూపాలను తయారు చేసి భక్తితో ఆరాధిస్తారు.

కానీ అదే సమయంలో, “నేను ఒక సాధారణ మానవుడిని, నేను అల్పుడను, నేను ఏమీ చేయలేను” అని తమను తాము తక్కువగా భావిస్తారు. అలాంటి భావనకు మూల కారణం ఒక్కటే అజ్ఞానం. జ్ఞానం లేకపోతే కష్టాలు

తప్పవు. అందుకే అజ్ఞానం ఉన్నంతకాలం దుఃఖం, సమస్యలు, బాధలు ఉంటాయి. ఆ కష్టాల నుండి ఎలా బయటపడాలో తెలియక, ఆ సహ సృష్టికర్తలైన దేవతా స్వరూపులను పూజిస్తారు, ప్రార్థిస్తారు, నమాజ్ చేస్తారు, మొక్కులు మొక్కుతారు, ఎన్నో విధాలుగా వారిని ఆరాధిస్తారు. ఎందుకు? అంటే వారు దేవుళ్ళు, తాను మాత్రం సాధారణ మానవుడిని అని భావిస్తారు. కానీ ఈ సృష్టిలో దాగి ఉన్న రహస్యం వారికి తెలియదు. ఎందుకు తెలియదు? అజ్ఞానంలో ఉండడం వల్ల.

ఆ రహస్యం ఏమిటంటే, మీరు కూడా వారిలాగే ధ్యానం చేసి, జ్ఞానం సంపాదించుకుంటే వారి స్థాయికి ఎదగగలరు, వారి లాగే మహోన్నతులుగా మారగలరు. ఈ సత్యం తెలియకపోవడమే అజ్ఞానం, ఈ అద్భుతమైన మానవ శరీరం ఎంత గొప్పదో, ఈ మానవ జన్మ ఎంత విలువైనదో తెలియకపోవడం వల్లే మనిషి తన జీవితాన్ని సార్థకం చేసుకోలేకపోతున్నాడు.

నిజంగా ఈ విషయం అర్థమైతే, 84 లక్షల జీవరాశులలో ఏ జీవికీ లభించని ఈ శరీరం ఒక్క మానవుడికే లభించిందని గ్రహిస్తారు. ఈ శరీరానికి మానవుడిని మాధవుడిగా మార్చగల శక్తి ఉంది. అయినా చాలామంది ఈ శరీరాన్ని పనికిరాని శరీరంగా భావిస్తారు. "దేవుడు నాకు ఇలాంటి జన్మ ఎందుకు ఇచ్చాడు? నా జీవితంలో అన్నీ కష్టాలే, సమస్యలే, గొడవలే" అని బాధపడుతుంటారు, దుఃఖిస్తుంటారు, దేవుణ్ణి కూడా నిందిస్తుంటారు.

"నన్ను పేదవాడిగా చేశావు, నాకు ఏమీ ఇవ్వలేదు, ఇన్ని కష్టాలు ఎందుకు ఇచ్చావు?" అని వాపోతుంటారు. కానీ, ఈ శరీరాన్నే సరైన విధంగా ఉపయోగించగలిగితే, ఇదే శరీరంతో ఎంతోమంది మహనీయులు భూమిపై గొప్ప స్థాయికి ఎదిగారు. వారు ఎదిగిన విధంగా జీవించకుండా, దానికి విరుద్ధంగా జీవిస్తూ, "నా జీవితం ఇలా అయిపోయింది" అని బాధ పడుతుంటారు.

ఒక్కసారి ఆలోచించండి, ఎంతటి దురదృష్టం! ఎంతటి అవివేకం!

ఒక మానవుడికి ఏవైతే వరాలుగా ఇవ్వబడ్డాయో, మీరు దేవుళ్ళుగా భావించే మహనీయులకు కూడా అవే ఇవ్వబడ్డాయి. వివేకానందుడు, రమణ మహర్షి, పత్రి గారు వీరిలో ఎవరినైనా తీసుకోండి, వారికి ఎలాంటి మానవ శరీరం ఇవ్వబడిందోలాంటి మానవ శరీరం మీకు కూడా ఇవ్వబడింది. వారికి జ్ఞానేంద్రియాలు ఉన్నాయి, మీకు కూడా ఉన్నాయి. వారికి కర్మేంద్రియాలు ఉన్నాయి, మీకు కూడా ఉన్నాయి. వారికి మనస్సు ఉంది, మీకు కూడా ఉంది. వారికి బుద్ధి ఉంది, మీకు కూడా ఉంది.

వారు చూసినట్లే మీరు కూడా చూడగలరు, వారు విన్నట్లే మీరు కూడా వినగలరు, వారు మాట్లాడినట్లే మీరు కూడా మాట్లాడగలరు. వారు పనిచేసినట్లే మీరు కూడా పనిచేయగలరు. వారు నడిచినట్లే మీరు కూడా నడవగలరు, వారు ఆలోచించినట్లే మీరు కూడా ఆలోచించగలరు. అయితే తేడా ఒక్కటే. వారికి ఇవ్వబడిన వాటిని వారు ఉపయోగించుకున్న విధానం ఒకటి, మీరు ఉపయోగించుకుంటున్న విధానం మరొకటి.

ఉదాహరణకు రమణ మహర్షి జీవితాన్ని చూడండి. ఆయన తన శరీరాన్ని భోగాలకు, సుఖాలకు, విలాసాలకు ఉపయోగించలేదు. తన జీవితమంతా సాధనకు, స్వాధ్యాయానికి, సత్సాంగత్యానికి, సేవకు ఉపయోగించాడు. ఆయన తన శరీరాన్ని కేవలం అవసరాలకు మాత్రమే పరిమితం చేసుకున్నారు. శరీరం నిలబడటానికి అవసరమైనంత ఆహారం, కప్పు కోవడానికి అవసరమైనంత వస్త్రం ఉంటే చాలు అనుకున్నారు. కానీ చాలామంది ఈ శరీరాన్ని ఉపయోగించి తప్పులు చేస్తారు. మోసాలు చేస్తారు, అన్యాయంగా, అధర్మంగా డబ్బు సంపాదించాలని ప్రయత్నిస్తారు, అబద్ధాలు చెబుతారు, ఇతరులను మోసం చేస్తారు, ఆ తరువాత కష్టాలను కొనితెచ్చుకొని, "నా జీవితం ఇలా అయిపోయింది" అని ఏడుస్తూ కూర్చుంటారు.

ఎందుకు ఇలా జరుగుతోంది? ఈ శరీరం యొక్క గొప్పతనం తెలియకపోవడం వల్ల. దీనిని ఎలా ఉపయోగించాలో అర్థం కాక, దానికి విరుద్ధంగా ఉపయోగించుకోవడం వల్ల. అయితే సృష్టికర్త మానవుని పట్ల అపారమైన కరుణ కలవాడు. అందుకే అజ్ఞానంలో అలమటిస్తున్న మానవులకు మార్గం చూపించడానికి ఒక సద్గురువును కూడా భూమి పైకి పంపుతాడు. ఆ సద్గురువు ఈ సత్యాన్ని తెలియజేస్తాడు. ఎలా జీవించాలో, ఏమి చేయాలో, ఏ మార్గంలో నడవాలో అన్నింటినీ బోధిస్తాడు. ఎందుకంటే ఈ మానవులందరూ సృష్టికర్త నుంచి ఉద్భవించిన అంశలే. వారూ తన లాగే పరిపూర్ణ స్థితికి ఎదగాలని సృష్టికర్త కోరుకుంటాడు. అందుకే వారు బాధపడుతున్నప్పుడు వారిని రక్షించడానికి సద్గురువును పంపుతాడు.

కానీ దురదృష్టవశాత్తూ, చాలామంది సద్గురువు చెప్పిన మాటలను కూడా పాటించరు. ఎందుకంటే వారికి ఐదు జ్ఞానేంద్రియాలు ఉన్నాయి. ఆ ఇంద్రియాల ద్వారా భోగాలను అనుభవించడం ఎంతో సుఖంగా అనిపిస్తుంది. ఆ తాత్కాలిక సుఖాల పట్ల ఉన్న మమకారం వల్ల, ఆ ఇంద్రియాలను సద్గురువు చెప్పిన విధంగా ఉపయోగించరు. రమణ మహర్షి వంటి మహనీయులు జీవించిన విధంగా జీవించరు. ఈ అమూల్యమైన మానవ శరీరాన్ని పనికిరాని విషయాలకు వినియోగించి, కష్టాలను తెచ్చుకొని, చివరికి "నా జీవితం ఇలా అయిపోయింది" అని బాధపడుతుంటారు. విలువ కట్టలేనంత గొప్ప మానవ జన్మ లభించినా, దానిని వృథా చేస్తున్నారు, దుర్వినియోగం కూడా చేస్తున్నారు. ఎన్నో జన్మలుగా ఇదే జరుగుతోంది. ఎందుకు? అంటే ఈ ఇంద్రియాల ద్వారా సుఖాలను అనుభవించాలనే కోరిక వల్ల. ఎన్నో రకాల ఆహారాలను తింటున్నారు. ఎన్ని జన్మలుగా తింటున్నా తృప్తి కలగడం లేదు. కళ్ళతో ఎన్నో విషయాలను చూస్తున్నారు, ఉదయం నుంచి సాయంత్రం వరకు సెల్‌ఫోన్ చూస్తూనే వుంటారు. వినోదాన్ని చూస్తూ వుంటారు. చెవులతో ఎన్నో రకాల

సంగీతాన్ని వింటున్నారు, ఎన్ని జన్మలుగా వింటున్నా తృప్తి కలగడం లేదు. మంచి సువాసనలు ఆస్వాదిస్తున్నారు, చర్మానికి సుఖాన్ని కలిగించే విలాస వంతమైన ఇళ్ళు కట్టుకుని, అలంకరణలు చేసుకుని, మెత్తని పరుపులు, ఏసీలు, కార్లు ఇలా ఎన్నో సౌకర్యాలను సమకూర్చుకుంటున్నారు.

అలాగే పురుషుడు స్త్రీతో, స్త్రీ పురుషుడితో స్పర్శ సుఖాన్ని అనుభవిస్తున్నారు. కానీ వందల జన్మలుగా ఈ ఇంద్రియ సుఖాలను అనుభవిస్తున్నా, మనస్సుకు పూర్తి తృప్తి మాత్రం కలగడం లేదు. ఎందుకంటే ఇంద్రియ సుఖాలకు అంతం లేదు. మనిషి చేయకూడని పనులు ఎందుకు చేస్తాడు? తప్పులు ఎందుకు చేస్తాడు? పాపాలు ఎందుకు చేస్తాడు? మోసాలు ఎందుకు చేస్తాడు? అన్యాయంగా ధనం ఎందుకు సంపాదిస్తాడు? అంటే, మానవ జన్మ యొక్క అసలు ఉద్దేశ్యం అతనికి తెలియదు కాబట్టి.

మనిషి ధనం సంపాదించుకోవడానికే భూమి పైకి వచ్చి ఉంటే, సృష్టికర్త ఆ విధంగానే ఏర్పాట్లు చేసేవాడు. కానీ సృష్టికర్త చేసిన ఏర్పాటు అలాంటిది కాదు. మనిషి భూమిపై ఉన్నంత వరకే అతను సంపాదించిన ధనం, ఆస్తి, సంపద అన్నీ అతనితో ఉంటాయి. శరీరాన్ని విడిచిపెట్టిన క్షణం నుండి అవన్నీ ఇక్కడే వుండిపోతాయి. ఎంత సంపాదించినా, ఎంత కూడ బెట్టినా, చివరికి ఒక్కటి కూడా తనతో తీసుకెళ్ళలేడు. అజ్ఞానంలో ఉన్నవారికి ఈ సత్యం తెలియదు, ఇవన్నీ శాశ్వతమని, ఇవే తమవని భావిస్తారు. ఆ భ్రమలోనే జీవితమంతా గడిపేస్తారు.

జన్మంతా సంపాదించడానికే శ్రమించి, చివరికి అన్నిటినీ ఇక్కడే వదిలేసి వెళ్తారు. కానీ వాటి కోసం చేసిన పాపాలు, అబద్ధాలు, మోసాలు, అన్యాయాలు మాత్రం వారిని విడిచిపెట్టవు. అవే కర్మల రూపంలో వారితో పాటు వస్తాయి. శరీరాన్ని విడిచిన తర్వాత వాటి ఫలితాన్ని అనుభవించాల్సి వస్తుంది. ఇలా ఎందుకు జరుగుతోంది? దీనికి ఒకే ఒక్క కారణం జ్ఞానం

లేకపోవడం. అందుకే పత్రి గారు ఎప్పుడూ, “ముందు జ్ఞానాన్ని సంపాదించు కోండి” అని చెప్పారు. మీరు ఇంకా విరుద్ధంగా జీవిస్తున్నట్లయితే, విరుద్ధంగా ప్రవర్తిస్తున్నట్లయితే, విరుద్ధమైన పనులు చేస్తున్నట్లయితే, దానికి కారణం జ్ఞానం లేకపోవడమే.

సద్గురువు వచ్చి బోధించినా కూడా చాలామంది ఆచరించరు, చేయవలసినది ఒకటి, చేస్తున్నది మరొకటి. మీకు లభించినది ఎంత అద్భుతమైన శరీరమో ఒకసారి ఆలోచించండి. ఈ 84 లక్షల జీవరాశులలో ఏ జీవి చేయలేని పనులను మానవుడు ఈ మానవ శరీరంతో చేయగలడు. జన్మ యొక్క గొప్పతనాన్ని మీరు తెలుసుకుంటే, ఇదే జన్మను చివరి జన్మగా మార్చుకునే అవకాశం కూడా ఉంది. కానీ ఇంకా వ్యామోహాలు, భోగాలు, వినోదాలు, విలాసాలు, ఇంద్రియ సుఖాల వెనుక పరిగెడుతూ ఉంటే, ఎన్ని జన్మలు వచ్చినా తృప్తి కలగదు. వాటిని అనుభవించాలనే కోరికే మరిన్ని జన్మలకు కారణమవుతుంది. కాని ఈ ఇంద్రియాలను జన్మ రాహిత్యాన్ని పొందడానికి ఉపయోగించుకుంటే మరొక జన్మ అవసరం ఉండదు.

జన్మ రాహిత్యం అంటే ఏమిటి? జన్మ రాహిత్యం అంటే సృష్టికర్త స్థాయికి ఎదగడం, సహ సృష్టికర్తగా మారడం. సృష్టికర్త సృష్టిస్తూ ఎలా ఆనందిస్తున్నాడో, అలాగే సహ సృష్టికర్తలుగా ఎదిగి ఆనందిస్తారు. అదే మానవుడు సాధించవలసిన లక్ష్యం. అందుకే గుర్తుంచుకోండి ఈ శరీరం యొక్క గొప్పతనం తెలిసిన క్షణం నుండి మీరు జీవించే విధానం పూర్తిగా మారిపోతుంది. అప్పుడు మీరు మీ సమయాన్ని వృథా చేయరు, మీ మాటను వృథా చేయరు, మీ శక్తిని వృథా చేయరు, మీ మానవ జన్మను వృథా చేయరు, మీ శరీరాన్ని కూడా వృథా చేయరు. ఈ రెండింటినీ పూర్తిగా సద్వినియోగం చేసుకొని, సాధించవలసిన లక్ష్యాన్ని సాధించి, గొప్పవారిగా ఎదుగుతారు. కాబట్టి ముందుగా శరీరం యొక్క గొప్పతనాన్ని, మానవ జన్మ యొక్క

గొప్పతనాన్ని తెలుసుకోండి. ఇంత గొప్ప వరాలు లభించిన తరువాత కూడా వాటిని దుర్వినియోగం చేయడం, నిర్వినియోగం చేయడం ద్వారా ఎందుకు నష్టపోవాలి? వాటిని పూర్తిగా సద్వినియోగం చేసుకోండి.

ఈ విషయాలను మీరు గత ఐదు, ఆరు సంవత్సరాలుగా జూమ్ తరగతుల ద్వారా వింటున్నారు. భీమవరం తరగతుల్లో కూడా వీటి గొప్పతనం గురించి చెప్పుకుంటున్నాం. ఈ జ్ఞానం వీడియోలలో మాత్రమే ఉండిపోకుండా, పుస్తకాల రూపంలో కూడా అందిస్తున్నాం. ఆ పుస్తకాలను మీరు మీ పడక గదిలో, మీ మంచం ప్రక్కనే ఉంచుకుంటే, వీలైనప్పుడల్లా చదివే అవకాశం ఉంటుంది.

ఒక సాధారణ మానవుడు గొప్ప యోగిగా, యోగీశ్వరుడిగా, ఇంకా స్పష్టంగా చెప్పాలంటే దైవస్వరూపుడిగా ఎదగాలంటే, ముందుగా శరీరం యొక్క గొప్పతనాన్ని తెలుసుకోవాలి, అలాగే మానవ జన్మ యొక్క గొప్పతనాన్ని కూడా తెలుసుకోవాలి. ఈ శరీరాన్ని వృథా చేయకూడదు, ఈ జన్మను కూడా వృథా చేయకూడదు.

చాలామంది అంటారు "మాకు ఎన్నో బాధ్యతలు ఉన్నాయి. కుటుంబాన్ని పోషించాలి, సంపాదించాలి, లేకపోతే ఎలా జీవిస్తాం?" దానికి సమాధానం కూడా ఎన్నో సార్లు చెప్పాను. మీ బాధ్యతలన్నీ నిర్వర్తించండి, కుటుంబాన్ని చూసుకోండి, అవసరమైన పనులన్నీ చేయండి. కానీ మీ ఖాళీ సమయంలో ఆధ్యాత్మిక సాధనకు కేటాయించండి. ఈ మార్గంలో నిజాయితీగా కృషి చేస్తే, మీరు ఈ జన్మను వృథా చేయకుండా జీవిస్తే, మరు జన్మలో మరింత అనుకూలమైన పరిస్థితులు లభిస్తాయి. ఆ జన్మను చివరి జన్మగా మార్చుకునే అవకాశం మీకు లభిస్తుంది. సహ సృష్టికర్తగా ఎదగడానికి అవసరమైన పనులను చేయడానికి అనుకూలమైన జన్మ, అనుకూలమైన వాతావరణం, అనుకూలమైన అవకాశాలు అన్నీ ఏర్పడతాయి.

కానీ ఈ జన్మను వృథా చేస్తే, చేయకూడని పనులు చేస్తే, ఆ అవకాశం లభించదు. అందువల్ల గుర్తుంచుకోండి, మీకు అత్యంత అద్భుతమైన మానవ శరీరం లభించింది. ఇతరులతో ఎందుకు పోల్చుకుంటారు? వారి ధనం, వారి ఆస్తులు, వారి హోదాలు అన్నీ నశించిపోయేవే. అవి శాశ్వతమైనవి కావు. వాటి కోసం ఎందుకు పోటీ పడాలి? వాటి కోసం ఎందుకు గొడవలు పెట్టుకోవాలి? మహనీయులకు లభించిన అదే మానవ శరీరం మీకు కూడా లభించింది, వారికి లభించిన అదే మానవ జన్మ మీకు కూడా లభించింది. వారు ఉపయోగించుకున్నట్లే మీరు కూడా ఈ శరీరాన్ని ఉపయోగించుకోండి, అప్పుడు మీరు కూడా వారిలాగే గొప్పవారిగా ఎదగగలరు.

అందుకోసం ముందుగా జ్ఞానాన్ని సంపాదించాలి. దానికంటే ముందుగా బుద్ధిని శుద్ధి చేసుకోవాలి. దానికి తీవ్ర ధ్యాన సాధన అవసరం; సాత్వికమైన శాకాహారం, సజ్జన సాంగత్యం అవసరం. అందుకే భీమవరం తప్పకుండా రావాలని పదే పదే చెబుతున్నాను. అక్కడ లభించే సాధన, జ్ఞానం ఎంతో విలువైనవి.

ఈ విధంగా నిరంతరం సాధన చేస్తూ, జ్ఞానాన్ని పెంపొందించు కుంటూ, మానవ శరీరాన్ని మరియు మానవ జన్మను పూర్తిగా సద్వినియోగం చేసుకున్న వారే నిజమైన అదృష్టవంతులు. ఖనిజాలలో వజ్రం ఎంత విలువైనదో! జ్ఞాన కాంక్ష కలిగిన మానవుడు అంతకంటే విలువైన వాడు. మీ అందరిలో ఆ జ్ఞాన కాంక్ష ఉంది, అందుకే మీరు నిజంగా అదృష్టవంతులు. కాబట్టి ఈ రెండు అమూల్యమైన వరాలను అంటే మానవ శరీరాన్ని, మరియు మానవ జన్మను పూర్తిగా సద్వినియోగం చేసుకోండి.

# “ఆత్మ జ్ఞానికి పుట్టుకైనా, మరణమైనా పండుగే, కానీ అజ్ఞాని పుట్టినప్పుడు సంబరపడతాడు, మరణించినప్పుడు దుఃఖిస్తాడు”

పత్రి గారు ఆత్మజ్ఞానానికే అత్యున్నత ప్రాధాన్యం ఇచ్చారు. ప్రతి ఒక్కరూ ఆత్మజ్ఞానం సంపాదించుకోవాలనే సందేశమే ఆయన బోధనల ద్వారా స్పష్టంగా తెలుస్తుంది. ఆ తర్వాత నేను ఆలోచించాను, ఎందుకు ఆయన ఆత్మజ్ఞానానికే అంతటి ప్రాధాన్యం ఇచ్చారు? అని.

సాధారణంగా చాలామంది, ఆయన ఆరోగ్యం గురించి చెప్పారు, పిరమిడ్ల గురించి చెప్పారు, మాంసాహారం గురించి చెప్పారు, శాకాహార ప్రాముఖ్యం మాత్రమే చెప్పారు అని అనుకుంటారు. ఆయన అవన్నీ చెప్పారు. కానీ వాటన్నింటికంటే ఎక్కువ ప్రాధాన్యం ఆత్మజ్ఞానానికే ఇచ్చారు. ఎందుకు ఆత్మజ్ఞానానికే అంతటి అత్యున్నత ప్రాధాన్యం ఇచ్చారు? ఎందుకంటే, ఎప్పుడైతే ఒక మానవుడు ఆత్మ జ్ఞానం సంపాదించుకుంటాడో, అప్పుడే అతనిలోని అజ్ఞానం తొలగిపోతుంది. అజ్ఞానం వల్ల సృష్టికి విరుద్ధంగా ప్రవర్తిస్తాడు. దాని ఫలితంగా కష్టాలను తెచ్చుకొని, దుఃఖంలో జీవిస్తూ ఉంటాడు.

అంతేకాదు, ప్రపంచంలోని మానవులు అజ్ఞానంలో ఉన్నంత వరకు యుద్ధాలు, కొట్లాటలు, మోసాలు, మానభంగాలు, హింసలు, జీవహింస వంటి దారుణమైన పనులు చేస్తూనే ఉంటారు. వాటి ఫలితంగా వారి జీవితం నరకప్రాయంగా మారుతుంది. ఎప్పుడైతే మానవులు ఇతరులకు నరకం చూపించడం ప్రారంభిస్తారో, అప్పుడే సమస్యలు మొదలవుతాయి. ఇతరుల భార్యలు కావచ్చు, స్త్రీలు కావచ్చు, అల్పులు కావచ్చు, తమ క్రింద పనిచేసేవారు కావచ్చు, లేదా అమాయకులు కావచ్చు. వారిపై ఆధిపత్యం చెలాయిస్తూ, వారిని ఎన్నో రకాల బాధలకు గురిచేస్తారు. వాస్తవానికి వారందరూ కూడా పరమాత్మ స్వరూపాలే, ఆయన నుంచే ఉద్భవించినవారే.

కానీ కొందరు తమ తెలివితేటలను, ఆధిపత్యం కోసం ఉప యోగిస్తారు. ఈ సమాజంలో కొందరు బలవంతులు, మరికొందరు బలహీనులు ఉంటారు. బలం అంటే కేవలం శారీరక బలం మాత్రమే కాదు, ఆర్థిక బలం కావచ్చు, అధికార బలం కావచ్చు, ఉద్యోగ పరమైన బలం కావచ్చు. ఆ బలాన్ని ఉపయోగించి బలహీనులను వేధిస్తూ ఉంటారు. ఇలా జరుగుతున్నదంతా ప్రకృతి చూస్తూ ఊరుకోదు. ఈ అత్యాచారాలు, అన్యాయాలు పరాకాష్టకు చేరుకున్నప్పుడు ప్రకృతి కోపగించడం వల్ల అనేక ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తాయి. అధిక వర్షాలు కురవడం, వర్షాలు లేకపోవడం, భూకంపాలు, సునామీలు, పర్వతాలు విరిగిపడటం, అడవులు దగ్ధం కావడం వంటి అనేక విపత్తులు సంభవిస్తాయి. దాంతో ప్రజలు అల్లకల్లోలానికి గురవుతారు, యుద్ధాలు జరుగుతాయి, అనేక విధాలుగా మానవులు నష్ట పోతారు. ఈ సమస్తానికి ప్రధాన కారణం అజ్ఞానమే, అజ్ఞానం వల్ల చేసే పనులే ఈ దుస్థితికి కారణమవుతున్నాయి.

అందుకే పత్రి గారు భూమి పైకి వచ్చి, ప్రతి ఒక్కరినీ జ్ఞాన వంతులను చేయాలనే సంకల్పంతో పనిచేశారు. ఆ దిశగా ఆయన అద్భుతమైన ప్రయత్నం చేశారు. అందుకే ఈ లాక్‌డౌన్ సమయంలో, "మీరు ఎంతవరకు జ్ఞానం సంపాదించుకున్నారు?" అనే విషయాన్ని మీరే పరిశీలించుకునేలా చేయడానికి, ఆత్మ జ్ఞాని యొక్క ప్రవర్తన ఎలా ఉంటుంది? అనే అంశంపై దాదాపు వంద రోజుల పాటు వరుసగా సందేశాలు ఇచ్చారు. ప్రతి రోజు ఒక కొత్త అంశాన్ని తీసుకొని, దానికి తగిన ఉదాహరణలతో ఎంతో స్పష్టంగా వివరించారు. ఇంచుమించు నేను ప్రతిరోజూ ఆయన చెప్పిన ప్రతి విషయాన్ని పుస్తకంలో వ్రాసుకుంటూ వచ్చాను. అన్నీ పూర్తయిన తర్వాత మరోసారి వాటిని పూర్తిగా చదివాను.

అప్పుడు నాకు ఒక విషయం స్పష్టంగా అర్థమైంది. పత్రి గారు

ఆత్మజ్ఞానానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారని, అప్పటి నుంచి నేను కూడా జ్ఞానానికే ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వడం ప్రారంభించాను. మానవుడికి తప్పనిసరిగా అవసరమైనది ఆత్మ జ్ఞానమే.

ప్రతి ఒక్కరూ జీవితంలో సంపాదించుకోవలసిన గొప్ప సంపద జ్ఞానమే అని నేను స్పష్టంగా గ్రహించాను. అందుకే నేను, మా మేడమ్ కలిసి ఆత్మజ్ఞానాన్నే బోధిస్తూ, జ్ఞానవంతులను తయారు చేయడానికి కృషి చేస్తున్నాం. సరే, ఈరోజు ఆత్మ జ్ఞాని యొక్క ప్రవర్తనలోని ఇంకొక ముఖ్యమైన విషయాన్ని తెలుసుకుందాం.

**“ఆత్మ జ్ఞానికి పుట్టుకైనా, మరణమైనా పండుగే, కానీ అజ్ఞాని పుట్టినప్పుడు సంబరపడతాడు, మరణించినప్పుడు దుఃఖిస్తాడు”**

ఇప్పుడు దీనిని కొంచెం వివరంగా తెలుసుకుందాం. ఈ ప్రపంచంలో, ఈ ప్రకృతిలో అనేక రకాల జీవరాశులు ఉన్నాయి. వాటిని గమనిస్తే అన్నీ పుడతాయి, కొంతకాలం జీవిస్తాయి, ఆ తర్వాత మరణిస్తాయి. మానవుల విషయంలో కూడా పుట్టడం ఎంత సహజమో, మరణించడం కూడా అంతే సహజం. ప్రతి మానవుడికి జననం ఎంత సహజమో, మరణం కూడా అంతే సహజం. ఇది సృష్టికర్త ఏర్పరచిన ధర్మం.

ఈ ప్రపంచంలో ఎవరి ఇంటిలోనైనా ఒక శిశువు పుడితే ఎంతో ఆనందంగా పండుగ చేసుకుంటారు, సంబరాలు జరుపుకుంటారు, స్వీట్లు పంచుతారు, కేకులు పంచుతారు. వారి స్థాయిని బట్టి బహుమతులు కూడా ఇస్తారు. ఎందుకు అంత సంబరపడతారు? సాధారణంగా అబ్బాయి పుడితే, “మా వంశాన్ని కొనసాగించే వారసుడు పుట్టాడు” అని ఆనందిస్తారు. అమ్మాయి పుడితే, “మా ఇంటికి మహాలక్ష్మి వచ్చింది” అని సంతోషపడతారు. అందుకే మగ బిడ్డ పుట్టినా, ఆడబిడ్డ పుట్టినా సంబరాలు జరుపుకుంటారు. ఆ చిన్నారిని అందరికీ చూపిస్తూ పరిచయం చేస్తారు. “చూడండి మా బాబు ఎలా ఉన్నాడో!”,

“మా మనవడు ఎలా ఉన్నాడో!”, “మా మనవరాలు ఎంత బాగుందో!” అంటూ ఆనందపడతారు. పిల్లలు పుట్టకపోతే మాత్రం ఎంతో బాధపడతారు. ఎందుకంటే తమకు వారసులు లేరని భావిస్తారు. అంతేకాదు, వృద్ధాప్యంలో తమను చూసుకునేవారు కూడా ఉండరని ఆందోళన చెందుతారు. వయస్సు పెరిగి, తమ పనులు తాము చేసుకోలేని స్థితి వచ్చినప్పుడు పిల్లలే తమకు ఆధారమవుతారని భావిస్తారు. పిల్లలు ఉంటే వారికి పెద్దగా లోటు ఉండదని అనుకుంటారు.

పిల్లలు లేకపోతే వారిని చూసుకునేవారు ఎవరూ ఉండరనే బాధ కలుగుతుంది. అందుకే పిల్లలు పుట్టినప్పుడు అంతటి సంబరం చేసుకుంటారు. వారు పుట్టడం వల్ల కలిగే ప్రయోజనాలు తమకు తెలుసు కాబట్టే ఆ ఆనందాన్ని వ్యక్తం చేస్తారు. పిల్లలు లేకపోతే కలిగే ఇబ్బందులు తెలుసు కాబట్టే బాధపడతారు, పిల్లలు కలగాలని ఎన్నో ప్రయత్నాలు చేస్తారు. జాతకాలు చూపిస్తారు, పండితులను సంప్రదిస్తారు, మొక్కులు మొక్కుతారు, వైద్యులను కలుస్తారు, ఏది చేయాల్సి వచ్చినా చేస్తారు. ఎందుకంటే పిల్లలు ఉండాలని కోరుకుంటారు. పిల్లలు ఉన్న కుటుంబ జీవితం ఒక విధంగా ఉంటుంది, పిల్లలు లేని కుటుంబ జీవితం మరో విధంగా ఉంటుంది.

చిన్నపిల్లలు ఇంట్లో ఉంటే, వారి చిలిపి మాటలు, అమాయక చేష్టలు, అల్లరి ఇంటికి ఆనందాన్ని తీసుకొస్తాయి. రోజంతా ఎదురైన ఒత్తిడి, బాధ, అశాంతి కొంత సేపు వారితో గడిపితే మరిచిపోతారు. వారిని ఆడిస్తూ, వారి మాటలు వింటూ, వారు ఎదుగుతున్న ప్రతి దశను చూసి మురిసిపోతారు. “మా బాబు”, “మా చిన్నోడు”, “మా పాప”, “మా అమ్మాయి” అంటూ గర్వంగా అందరికీ చెప్పుకుంటారు. వారికి నచ్చినవన్నీ కొనిపెడుతూ, అవసరమైన సౌకర్యాలన్నీ కల్పిస్తూ తాము తృప్తి చెందుతారు. వాళ్ళు ఉండడం వల్లే ఇల్లు కళకళలాడుతోందని భావిస్తారు. లేకపోతే ఇల్లు వెలవెలబోయినట్లు

అనిపిస్తుందని అనుకుంటారు. అంతటి ఆనందాన్ని పిల్లలు కలిగిస్తారు.

అందుకే పిల్లలు పుట్టినప్పుడు ఎంతో సంబరపడతారు. ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం గమనించాలి. ఆ ఇంట్లో జ్ఞానులు కూడా ఉంటారు. అజ్ఞానులు ఉంటారు. జ్ఞానం ఉన్నవారు అయినా, జ్ఞానం లేని వారు అయినా, సాధారణంగా పిల్లలు పుట్టినప్పుడు అందరూ ఒకే విధంగా ఆనందిస్తారు. పిల్లలు ఉండడం వల్ల కలిగే లాభాలు, ఆనందాలు, సరదాలు ఎన్నో ఉంటాయని భావిస్తారు. అందుకే ఎవరి ఇంట్లో పిల్లలు పుట్టినా ఆ కుటుంబమంతా పండుగ వాతావరణంలో ఉంటుంది. జ్ఞాని అయినా, అజ్ఞాని అయినా, పిల్లలు పుట్టినప్పుడు ఆనందం వ్యక్తం చేస్తారు. కానీ మరణం విషయంలో మాత్రం జ్ఞాని, అజ్ఞాని ఇద్దరి ప్రవర్తన పూర్తిగా భిన్నంగా ఉంటుంది. ఆ ఇంట్లో జ్ఞానులు ఉంటే, మరణాన్ని కూడా ఒక ఆధ్యాత్మిక దృష్టితో స్వీకరిస్తారు. వారికి అది కూడా ఒక పండుగే.

కానీ అజ్ఞానులు అయితే ఏడుస్తూ, దుఃఖిస్తూ కూర్చుంటారు. ఇక్కడ ఒక విషయం గమనించండి. పుట్టినప్పుడు దాదాపు ప్రతి ఒక్కరూ సంబర పడతారు, కానీ చనిపోయినప్పుడు మాత్రం దాదాపు తొంభై తొమ్మిది శాతం మంది ఏడుస్తారు, దుఃఖిస్తారు, బాధపడతారు. కొంతమంది అయితే జీవితాంతం ఆ దుఃఖంలోనే గడిపేస్తారు. భర్త మరణిస్తే భార్య జీవితాంతం బాధపడుతుంది. భార్య మరణిస్తే భర్త కూడా జీవితాంతం దుఃఖిస్తూ ఉంటాడు. ఎందుకు దుఃఖపడతాడు? ఆ భార్య బ్రతికి ఉన్నంతకాలం భర్తకు ఎన్నో విధాలుగా సేవ చేసింది, అతని అవసరాలు చూసుకుంది, మంచి,చెడ్డలను గమనించింది, అన్ని విధాలుగా తోడుగా నిలిచింది. ఇప్పుడు ఆమె లేక పోవడంతో అన్నీ తానే చేసుకోవాల్సి వస్తుంది, అది ఎంత కష్టమో అని బాధపడతాడు.

ఇప్పుడు యూట్యూబ్ లో చూస్తున్నాము మరణించిన వారి రూపాలను

యథాతథంగా విగ్రహాల రూపంలో తయారు చేస్తున్నారు. కొంతమంది వాటిని ఇంట్లో ఉంచుకుని, వారు ఇంకా తమతోనే ఉన్నట్లుగా భావిస్తూ పండుగలు చేసుకోవడం, ఫోటోలు దిగడం కూడా చూస్తున్నాం. ఇంతటి అనుబంధం, ఇంతటి లాభం పొందిన భార్య మరణిస్తే ఎంత దుఃఖపడతారో ఆలోచించండి. అలాగే, భర్త మరణించినప్పుడు భార్య కూడా అంతే దుఃఖిస్తుంది. అందుకే సాధారణంగా ఎవరైనా మరణించినపుడు అందరూ దుఃఖించడమే మనం చూస్తుంటాం. ఎవరైనా ఏడవకపోతే, “వారికి ప్రేమ లేదు” అని అనుకుంటారు. దగ్గరి వ్యక్తి మరణించినా కూడా ఏడవడం లేదని విమర్శిస్తారు. కొంతమంది నిజంగా ఏడుపు రాకపోయినా, ఇతరులు ఏమనుకుంటారో అని ఏడుస్తారు. లోకంలో సాధారణంగా జరుగుతున్నది ఇదే.

కానీ పత్రి గారు ఏమన్నారంటే? “ఎవరైనా చనిపోయినప్పుడు ఏడ్చేవాడు అజ్ఞాని, సంబరపడేవాడు జ్ఞాని” ఈ మాటను బాగా గుర్తుపెట్టుకోండి. ఇక్కడ మీరు ఒక విషయం తెలుసుకోవాలి. జ్ఞాని ఎందుకు సంబరపడతాడు? అజ్ఞాని ఎందుకు ఏడుస్తాడు? పుట్టుక విషయంలో ఇద్దరూ ఆనందిస్తారు. కానీ మరణం విషయంలో జ్ఞాని ప్రవర్తన ఒక విధంగా ఉంటుంది, అజ్ఞాని ప్రవర్తన మరో విధంగా ఉంటుంది. ఎందుకు ఈ తేడా వస్తుంది? అంటే ఒకసారి పత్రి గారు చెప్పిన సంఘటన గుర్తుకు వస్తుంది. ఇది చాలా సంవత్సరాల క్రితం జరిగిన విషయం. దాదాపు ఇరవై సంవత్సరాల క్రితం, లేదా అంతకంటే ముందే అయి ఉండవచ్చు.

ఒకసారి పత్రి గారు తిరుపతికి వెళ్ళారు. అక్కడ ఒక పిరమిడ్ మాస్టర్ ఇంటికి వెళ్ళగా, ఆ కుటుంబంలో ఒక ఆడపిల్ల పుట్టింది. ఆ ఇంట్లో అందరూ ఎంతో ఆనందంగా పండుగ చేసుకుంటున్నారు. ఆ కుటుంబం ఎంత సంతోషంగా ఉందో పత్రి గారికి తెలుసు. అందుకే ఆయన తన జేబులో చాక్లెట్లు తీసుకెళ్ళారు. అక్కడికి వెళ్లిన తర్వాత, తన దగ్గర ఉన్న చాక్లెట్లలో

సగం ఆ కుటుంబ సభ్యులకు ఇచ్చారు. మిగిలిన సగం చాక్లెట్లు మాత్రం తన దగ్గరే ఉంచుకున్నారు. అది చూసి అక్కడున్నవారు అడిగారు. “మిగిలిన చాక్లెట్లు ఎందుకు ఉంచుకున్నారు?” అని. అప్పుడు పత్రి గారు చిరునవ్వుతో ఇలా అన్నారు. “ఇప్పుడు పిల్ల పుట్టిందని సంబరపడుతున్నారు కదా? ఒకవేళ చనిపోతే పంచడానికి ఈ చాక్లెట్లు ఉంచుకున్నాను” అన్నారు. ఆ మాట విన్న వెంటనే అక్కడున్న వారందరి ముఖాలు మారిపోయాయి. ఆనంద వాతావరణం ఒక్కసారిగా నిశ్శబ్దంగా మారిపోయింది, వారంతా ఆశ్చర్యపోయారు. “ఇంత గొప్ప జ్ఞాని అయిన గురువుగారు, ఎవరైనా చనిపోతే చాక్లెట్లు పంచుతానని ఎలా అంటున్నారు?” అని ఆశ్చర్యంతో ఒకరినొకరు చూసుకున్నారు.

కానీ చనిపోయినప్పుడు ఎవరు సంబరపడతారు? అందుకే, “చనిపోయినా చాక్లెట్లు పంచడానికి ఉంచుకున్నాను” అని పత్రి గారు చెప్పగానే అక్కడున్న వారు చాలా బాధపడ్డారు. ఎందుకంటే వారు అజ్ఞానంలో ఉన్నారు. కానీ పత్రి గారు బ్రహ్మ జ్ఞాని. ఆయనకు జీవితం, మరణం యొక్క నిజమైన సత్యం తెలుసు.

అందుకే మరణాన్ని కూడా ఒక సంబరంగా చూశారు. ఇప్పుడు ఒక విషయం తెలుసుకుందాం. జ్ఞాని ఎందుకు సంబరపడతాడు? అజ్ఞాని ఎందుకు దుఃఖపడతాడు? మొదట జ్ఞానికి తెలిసిన సత్యం ఏమిటంటే, ఎవరికీ చావు లేదు. అందరూ ఆత్మలే, ఆత్మకు మరణం లేదు. కాబట్టి నిజానికి ఎవరూ చనిపోరు. అందుకే పత్రి గారు, “ఎవరు చచ్చినా చావరు” అని చెప్పేవారు. చావే లేనప్పుడు జ్ఞాని ఎందుకు ఏడుస్తాడు?

కానీ అజ్ఞాని మాత్రం, “అతను చనిపోయాడు  ఇక లేడు” అని భావించి ఏడుస్తాడు. ఇదే జ్ఞానికి, అజ్ఞానికి మధ్య ఉన్న తేడా. మీరు గమనిస్తే, జ్ఞానం పొందిన మహనీయులు కూడా శరీరాన్ని వదులుతారు. జ్ఞానం లేని వారు కూడా శరీరాన్ని వదులుతారు. కానీ జ్ఞాని పుట్టినప్పుడు ఎలా ఉంటాడో, మరణించినప్పుడు కూడా అలాగే ఉంటాడు. అందుకే పెద్దలు అన్నారు “జ్ఞాని

చెప్పి చస్తాడు, అజ్ఞాని చెపితే చస్తాడు” అని.

కొంతమందికి మరణం గురించి మాట వచ్చినా భయపడతారు. కొంతమందికి కలలో పాము కనిపించినా భయపడతారు. ఆ పాము కరిచినట్టు కల వస్తే, నిజంగానే ఏదైనా జరుగుతుందేమో అని రోజుల తరబడి బాధపడుతుంటారు. కల మాత్రమే అయినా, అది నిజమవుతుందేమోనని ఆందోళన చెందుతారు. ఇది అజ్ఞానం వల్లే.

జ్ఞాని మరణాన్ని ఎందుకు సంబరంగా చూస్తాడో తెలుసుకుందాం. ఎవరైనా చనిపోతే ఏడవడం అజ్ఞానానికి గుర్తు. ఈ సత్యాన్ని మీరు అర్థం చేసుకుంటే, మీకు సంబంధించినవారిలో ఎవరైనా మరణించినా మీరు దుఃఖపడరు. అవసరమైతే వారికి చేయాల్సిన సహాయం చేస్తారు, అంతే తప్ప, నిరాశలో మునిగిపోరు. ఎందుకంటే వారికి చావు లేదని మీకు తెలుసు, జ్ఞానికి తెలుసు. ఆ వ్యక్తి శరీరం కాదు, ఆయన ఆత్మ, చనిపోయింది శరీరం మాత్రమే, ఆ శరీరాన్ని దహనం చేస్తారు లేదా ఖననం చేస్తారు.

కానీ ఆత్మ మాత్రం వుంటుంది. అజ్ఞాని శరీరాన్నే మనిషి అని భావించి, “అతను చనిపోయాడు” అని ఏడుస్తాడు. కానీ జ్ఞానికి తెలుసు. ఆత్మ కొన్ని అనుభవాలు పొందడానికి, కొన్ని పాఠాలు నేర్చుకోవడానికి మాత్రమే ఈ శరీరాన్ని ధరించింది. **“శరీరాన్ని ధరించడమే జననం, శరీరాన్ని విడిచి పెట్టడమే మరణం”.** అంతే తప్ప ఆత్మ ఎప్పటికీ ఉంటుంది. కాబట్టి జ్ఞానికి తెలుసు, వారు శరీరం మాత్రమే వదిలారు, ఆత్మకు చావు లేదు అని.

మరి జ్ఞాని మరణాన్ని ఎందుకు సంబరంగా చూస్తాడు? అంటే ఆ వ్యక్తి తన జీవితంలో ఆత్మకు లాభం కలిగించే ఎన్నో పనులు చేశాడు. ధ్యానం చేశాడు, సాధన చేశాడు, జ్ఞానం సంపాదించాడు, సేవ చేశాడు. ఆ ఫలితంగా శరీరాన్ని విడిచిన తర్వాత ఉన్నత లోకాలను చేరుకునే అర్హత పొందాడు. అంతేకాదు, వృద్ధాప్యంలో శక్తి కోల్పోయి, ఇతరులపై ఆధారపడాల్సిన శరీరాన్ని

వదిలేశాడు. ఇప్పుడు అతనికి మరో క్రొత్త శరీరం లభిస్తుంది. అందులో బాధపడాల్సింది ఏముంది?

ఆలోచించండి! చినిగిపోయిన పాత బట్టలు తీసేసి కొత్త బట్టలు వేసుకుంటే మీరు ఆనంద పడతారా?లేదా? ఎంత సంతోషంగా కొత్త బట్టలు వేసుకొని అందరికీ చూపిస్తారో మీకే తెలుసు. పండుగలలో, వేడుకలలో కొత్త బట్టలు ధరించి ఆనందంగా తిరుగుతారు. ఎవరైనా పాత బట్టలు తీసేసామని ఏడుస్తారా? అంటూ ఏడవరు.

అలాగే, పనికిరాని పాత శరీరాన్ని విడిచి కొత్త శరీరాన్ని పొందితే ఎందుకు బాధపడాలి? జ్ఞాని ఈ సత్యాన్ని తెలుసుకున్నవాడు. అందుకే అతను బాధపడడు, కానీ అజ్ఞానికి ఇవేవీ తెలియవు. అందుకే అతను ఏడుస్తాడు. జ్ఞాని తన జీవితంలో ఆత్మకు లాభం కలిగించే పనులే చేసాడు. ధ్యాన సాధన చేసాడు. జ్ఞానం పెంచుకోవడానికి పుస్తకాలు చదువుతాడు. గొప్ప గురువుల సాంగత్యం చేశాడు. వారి నుంచి ఎన్నో సత్యాలు తెలుసుకుంటాడు. ఆత్మను ఉన్నత లోకాలకు చేర్చే సేవలు చేశాడు. అతను చేసిన ప్రతి పని ఆత్మకు లాభం కలిగించేదే. అందువల్ల తదుపరి జన్మ మరింత ఉన్నతంగా ఉంటుంది, అందుకే అతను మరణాన్ని చూసి దుఃఖించడు.

కానీ జ్ఞానం లేని వ్యక్తి తన జీవితమంతా ఆస్తులు కూడబెట్టడానికే కష్టపడతాడు. అప్పులు చేసి ఇళ్ళు కడతాడు. E.M.I.లు చెల్లిస్తూ జీవితాన్ని గడిపేస్తాడు. రిటైర్ అయ్యాక సుఖంగా జీవిద్దాం అనుకునే సమయానికి అనారోగ్యం వస్తే, “ఇంత కష్టపడ్డాను, ఇప్పుడు ఇలా జరిగిందేంటి?” అని బాధపడతాడు. అతనితో పాటు కుటుంబ సభ్యులు కూడా బాధపడతారు. కానీ జ్ఞాని మాత్రం ఆత్మను తెలుసుకొని, ఆత్మకు లాభం కలిగించే సేవలను జీవితమంతా చేస్తాడు.

అందుకే నేను ఎప్పుడూ చెబుతుంటాను “ఆత్మ సేవలు చేయండి, మీరు దేహం కాదు, మీరు ఆత్మలు” ఈ ధ్యాన మార్గంలో, జ్ఞాన మార్గంలో,

ఆత్మకు లాభం కలిగించే సేవలు చేయండి. ఉదాహరణకు, భీమవరంలో మూడు రోజుల ఆత్మజ్ఞాన శిబిరంలో సేవ చేయడం ద్వారా అనేక మందికి జ్ఞానం అందించడంలో మీ వంతు పాత్ర పోషించండి. అటువంటి సేవ ఆత్మకు అపారమైన లాభాన్ని కలిగిస్తుంది. అందుకే చాలామంది ఇలాంటి కార్యక్రమాల్లో తమ వంతు సహాయం చేయడానికి ముందుకు వస్తారు.

ఎందుకంటే వారికి ఆ సేవ యొక్క విలువ తెలుసు. ఇలా జీవించినప్పుడు, ప్రస్తుత జీవితం కంటే ఉన్నతమైన జీవితం లభిస్తుంది, ఉన్నత లోకాలను చేరుకుంటారు, గొప్ప మహనీయుల సాంగత్యం పొందుతారు. మళ్ళీ భూమిపై జన్మించినప్పుడు, జ్ఞానం పొందిన వారికి తమకు నచ్చిన జీవితాన్ని ఎంచుకునే స్వేచ్ఛ కూడా ఉంటుంది.

అందుకే జ్ఞానికి జీవించినా లాభమే, మరణించినా లాభమే. ఎందుకంటే అతను ఆత్మకు లాభం కలిగించే జీవితాన్ని గడిపాడు. నా జీవితంలో కూడా ఇదే జరిగింది. పత్రి గారి పరిచయం అయిన తర్వాత ఆయన, "నువ్వు దేహం కాదు, నువ్వు ఆత్మ" అని చెప్పారు. ఆ మాట విని నేను ఆశ్చర్యపోయాను. తర్వాత పుస్తకాలు చదివి, అధ్యయనం చేసి, ఆయన చెప్పింది సత్యమని తెలుసుకున్నాను. అప్పుడు నాకు చాలా బాధ కలిగింది.

ఇంతకాలం ఎంతో కష్టపడి సంపాదించిన ధనం ఆత్మకు ఏమాత్రం ఉపయోగపడదని అర్థమైంది. అంటే యాభై మూడు సంవత్సరాలు జీవించి, ఆత్మకు ఉపయోగపడే ఒక్క పని కూడా చేయలేదా? అని నేను బాధపడ్డాను. మా కుటుంబంలో మా నాన్నగారు యాభై ఆరు సంవత్సరాలకే మరణించారు. మా పెద్దవాళ్ళలో చాలామంది అరవై సంవత్సరాలు కూడా జీవించలేదు. అప్పుడు నాకు అప్పటికే యాభై మూడు సంవత్సరాలు వచ్చాయి. కష్టపడి సాధించగలిగే వయస్సు దాదాపు గడిచిపోయిందని అనిపించింది.

అప్పుడు నేను పత్రి గారిని అడిగాను. "మీ పరిచయం నాకు పదేళ్ళు ముందే అయి ఉంటే ఎంత బాగుండేది!" అన్నాను. అప్పుడు ఆయన

"జరిగిందేదో జరిగింది, ఇప్పటి నుంచైనా జాగ్రత్త పడు" అన్నారు. ఆ మాట నా జీవితాన్ని మార్చేసింది. ధనం సంపాదించడానికి ఎంత కష్టపడ్డానో, అదే స్థాయిలో జ్ఞానం సంపాదించడానికి కూడా కష్టపడటం ప్రారంభించాను. ఓపిక ఉన్నా లేకపోయినా, ఆరోగ్యం బాగున్నా లేకపోయినా, నేను, మా మేడమ్ నిరంతరం ఈ సేవలోనే కొనసాగుతున్నాం.

ఎందుకంటే ఆత్మకు లాభం కలిగించే పనులు చేయాలి, జ్ఞానం సంపాదించాలి, గొప్పవారిగా ఎదగాలి. ఇలా ఇరవై నాలుగు సంవత్సరాలుగా నిరంతర కృషి చేయడం వల్ల అపారమైన జ్ఞానం సంపాదించగలిగాం. ఒకప్పుడు నేను ఎంత బాధపడ్డానో, ఇప్పుడు అంతే ఆనందంగా ఉన్నాను. ఎందుకంటే నా జీవితంలో ఆత్మకు లాభం కలిగించే ఎన్నో పనులు చేయగలిగాను. అందుకే గుర్తుంచుకోండి. "జ్ఞాని మరణాన్ని సంబరంగా స్వీకరిస్తాడు, అజ్ఞాని మరణానికి దుఃఖిస్తాడు".




బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...
తటవర్తి వీరరాఘవరావు, శ్రీమతి రాజ్యలక్ష్మి దంపతులచే

**ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం**

*భీమవరంలో ప్రతీ నెలా 1, 2, 3 తేదీలలో పూర్తి రెసిడెన్షియల్ పద్ధతిన ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం నిర్వహించబడుతుంది. ఎన్ని రోజులు ధ్యానం చేసినా ధ్యానంలో పురోగతి సాధించలేనివారు, ఆలోచనలతో ఇబ్బంది పడేవారు ఈ శిబిరంలో పాల్గొంటే ఒకే సిట్టింగులో మూడు లేక నాలుగు గంటలు ధ్యానం చేయగల స్థితికి చేరుకుంటారు. పరిమిత సభ్యులకు మాత్రమే అవకాశం ఉన్నందున ముందుగా మీ పేర్లు నమోదు చేసుకోండి.*

*నిర్వహించు ప్రదేశం: శ్రీ వెంకటేశ్వరస్వామి వారి మందిరం, నరసింహపురం, ఉండి రోడ్, భీమవరం.*

*ప్రవేశం : మూడు రోజులకు భోజనం, వసతి ఉచితం*

రిజిస్ట్రేషన్ కొరకు : ***సింధూర, సెల్: 8555995217***

## తటవర్తి దంపతుల YouTube ఛానెల్ Subscribe చేసుకోవాలంటే

a) Whatsapp group లో మీకు పంపబడుతున్న Youtube లింక్ మీద నొక్కినప్పుడు Tatavarthy Veera Raghava Rao ఛానెల్ open అవుతుంది. Open అవ్వగానే subscribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

లేకపోతే www.tst.org.in/videos/ ఓపెన్ అయిన తరువాత I లో Tatavarthy Veera Raghava Rao పేరు మీద నొక్కండి. II & III లో వున్న పేరు మీద నొక్కండి. ఛానెల్స్ Open అవుతాయి. Open అవ్వగానే subcribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

## YouTube ఛానెల్‌లో ప్రసారమయ్యే తటవర్తి దంపతుల కార్యక్రమాలు

a) Channel Name : Tatavarthy Veera Raghava Rao. ఇందులో 2500 పైగా వీడియోలలో తటవర్తి దంపతుల సందేశాలు ఇవ్వడం జరిగింది.

b) అలాగే PMC వారు కూడా బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు గారి యొక్క YouTube Channel ప్రారంభించారు. Channel Name : Brahmarshi Tatavarthy Veera Raghavarao

c) తటవర్తి దంపతుల దగ్గర ట్రైనింగ్ అయిన మాస్టర్ల సందేశాల కొరకు Tatavarty Spiritual Trainees ఛానెల్‌లో చూడండి.

d) Direct గా YouTube app లోకి వెళ్ళి search bar లో Tatavarthy Veera Raghava Rao అని టైపు చేస్తే తటవర్తి దంపతుల అన్ని వీడియోలు చూడవచ్చు.

## తటవర్తి దంపతుల Zoom కార్యక్రమాలు చూడాలంటే?

a) ప్రతిరోజూ ఉదయం Zoom లో 4 to 6.30 a.m. Silence Meditation మరియు 6.30 to 7.30 a.m. వరకు **ఆత్మజ్ఞాన సందేశాలు**

Zoom I.D. :2413823868, Password : RAO

b) పై కార్యక్రమము 6.30 to 7.30 a.m. వరకు Youtubeలో కూడా Live ఇవ్వబడుతుంది.

c) ఎవరైతే TVR & TRL Whatsapp గ్రూపులో వుంటారో వారికి Zoom Link & You Tube Links మరియు తటవర్తి దంపతుల క్లాసుల వివరాలు పంపడం జరుగుతుంది. వారు **సింధూర: 8555995217** నెంబరు తప్పనిసరిగా save చేసుకోవాలి.

d) తటవర్తి వారి వాట్సాప్ గ్రూపులో జాయిన్ కావాలనుకునేవారు వీరిని సంప్రదించండి. సింధూర: 85559 95217, మధు: 78939 17364 లేకపోతే www.tst.org.in Open చేసిన తర్వాత Join in Whatsapp group లింక్ మీద నొక్కండి.

## తటవర్తి దంపతుల Website ద్వారా పొందే సమాచారము

website address : www.tst.org.in

a) తటవర్తి దంపతుల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల వివరములు మరియు Google Maps Location తెలుసుకోవచ్చు.

b) తటవర్తి దంపతుల మొత్తం పుస్తకాలు PDF రూపంలో కలవు. వాటిని ఉచితంగా Download చేసుకోవచ్చు. ఈ పుస్తకాలు తెలుగు, కన్నడ, హిందీ మరియు ఇంగ్లీషు భాషలలో వున్నాయి.

c) తటవర్తి దంపతుల సందేశాలు Concept వారీగా YouTube Play lists రూపంలో ఇవ్వడం జరిగింది.

d) తటవర్తి దంపతుల సందేశాల సారాంశము కొటేషన్స్ రూపంలో ఇవ్వడం జరిగింది.

e) తటవర్తి దంపతుల ఫోటోలు కూడా చూడవచ్చు.

5. భీమవరంలో ప్రతి నెలా 1, 2, 3 తేదీలలో జరిగే ఉచిత ఆత్మజ్ఞాన శిక్షణా తరగతుల రిజిస్ట్రేషన్ కొరకు సంప్రదించవలసిన నెంబరు : **సింధూర, 8555995217**

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) సత్యమార్గం - రూ.160/-
5) ధ్యాన శక్తి - రూ.130/-
6) ధ్యాన శాస్త్రం - రూ.130/-
7) ఆత్మ శాస్త్రం - రూ.120/-
8) మరణించక ముందే మరణించాలి - రూ.130/-
9) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం - రూ.120/-
10) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
11) ఉపమాన ధ్యాన సందేశాలు -రూ.110/-
12) జీవిత సూక్ష్మాలు - రూ.100/-
13) భగవంతుడంటే - రూ.100/-
14) తెలుసుకోండి - రూ.100/-
15) మెహర్‌బాబా సందేశాలు - రూ.100/-
16) మరణం తర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు - రూ.100/-
17) పత్రీజీ చెప్పిన శ్వాస మీద ధ్యాసా? పత్రీజీ చేయించిన మ్యూజిక్ మీద ధ్యాసా? ఏది సరైన ధ్యానం? - రూ.100/-
18) కోరికల వల్ల నష్టాలు - రూ.100/-
19) శంకరాచార్యుల వారి జ్ఞాన సందేశాలు - రూ.100
20) కఠోపనిషత్తు - రూ.90/-
21) ఉపమాన జ్ఞాన సందేశాలు - రూ.90/-
22) గీతాసందేశం - రూ.80/-
23) ముఖ్యమైన సందేశాలు-1 - రూ.80/-
24) ముఖ్యమైన సందేశాలు-2 - రూ.90/-
25) కర్మ సిద్ధాంతం - రూ.80/-
26) ధ్యానమంటే ? - రూ.80/-
27) త్రివిధాలు - రూ.80/-
28) ఉత్తమ పురుషుడు - రూ.80/-
29) పత్రీజీ జ్ఞాన సందేశాలు-1 - రూ.80/-
30) పత్రీజీ జ్ఞాన సందేశాలు-2 - రూ.80/-
31) పత్రీజీ జ్ఞాన సందేశాలు-3 - రూ.90/-
32) వశిష్ఠుల వారి సందేశాలు - రూ.70/-
33) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.70/-
34) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
35) జ్ఞాన జ్యోతి - రూ.70/-
36) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
37) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/-
38) షిరిడీ సాయి సందేశాలు - రూ.70/-
39) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య - రూ.70/-
40) బుద్ధుని సందేశాలు - రూ.70/-
41) భూతదయే దైవత్వం - రూ.70/-
42) ఆత్మహంతకులంటే ఎవరు? - రూ.70/-
43) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి - రూ.70/-
44) ధర్మ సూక్ష్మాలు - రూ.70/-
45) ఆశ్చర్యకరమైన విషయాలు - రూ.70/-
46) మానవునిలోని చెడు - రూ.70/-
47) మేడమ్ బ్లావెట్స్కీ సందేశాలు - రూ.70/-
48) చివటం అమ్మవారి సందేశాలు - రూ.70/-
49) మోక్షం అంటే? - రూ.70/-
50) కబీరు సందేశాలు-1 - రూ.70/-
51) మనసు-1 - రూ.70/-
52) మనసు-2 - రూ.70/-
53) "అందరి కోసం బ్రతికినా నీకు దక్కింది ఏమిటి?" - రూ.70/-
54) ధ్యాన శక్తి కోల్పోకూడదంటే - రూ.70/-
55) మరణానంతరం జరిగేది-1 - రూ.60/-
56) మరణానంతరం జరిగేది-2 - రూ.70/-
57) ఎవరి వాస్తవానికి వారే సృష్టికర్తలు- రూ.70/-
58) మరణానంతరం జరిగేది-3 - రూ.60/-
59) కబీరు సందేశాలు-2 - రూ.60/-
60) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
61) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
62) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
63) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
64) అతీంద్రియ శక్తులు - రూ.60/-
65) ఆలోచించండి - రూ.60/-
66) నిర్వాణ మార్గం - రూ.60/-
67) ధ్యానులకు సూచనలు - రూ.60/-
68) యోగీశ్వరుల సందేశాలు - రూ.60/-
69) మమకారం - రూ.60/-
70) మాణిక్యేశ్వరి మాత సందేశాలు-1 - రూ.60/-
71) మాణిక్యేశ్వరి మాత సందేశాలు-2 - రూ.50/-
72) మాస్టర్‌గా ఎదగాలంటే? - రూ.50/-
73) భగవంతుని ఇష్టులవ్వాలంటే - రూ.50/-
74) సంకల్పమంటే? - రూ.50/-
75) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
76) మూడురకాల భవిష్యత్తులు - రూ.50/-
77) అరిహంత్ - రూ.50/-
78) బుద్ధి వికసించిన వారి ప్రవర్తన - రూ.50/-
79) ఈ జీవితం ఎందుకు? - రూ.40/-
80) భార్యభర్తలు గొడవ పడకూడదంటే - రూ.40/-
81) విదురుని సందేశాలు - రూ.40/-
82) మూడురకాల జీవితాలు - రూ.40/-
83) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే - రూ.40/-
84) ఛాంపియన్ అవ్వాలంటే? - రూ.40/-
85) బ్రహ్మం అంటే? - రూ.40/-
86) శంకరాచార్యుల వారి జాగ్రత పంచకం - రూ.40/-
87) శంకరాచార్యుల వారి నిర్వాణ షట్కం - రూ.40/-
88) మహాత్ముల సందేశాలు - రూ.40/-
89) సత్యం - రూ.40/-
90) చక్రాలు - రూ.40/-
91) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/-
92) భాగవత సన్నివేశాల అంతరార్థం - రూ.40/-
93) మౌన ధ్యానం - రూ.40/-
94) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? - రూ.20/-
95) శాకాహారమే మానవాహారం - రూ.15/-
96) అహింస మరియు శాఖాహారం - రూ.15/-



- “ఆత్మ జ్ఞాని అందరికీ జ్ఞానాన్ని బోధిస్తూ సుజ్ఞాని అవుతాడు, మహా జ్ఞాని కూడా అవుతాడు.”
- “ఆత్మ జ్ఞాని ఎవరి అనుభవం వారిది, ఎవరి జీవితం వారిది అని తెలుసుకుంటాడు”
- “మహత్యాలు చూపించి ప్రజలను ఆకర్షించడం కాదు, మీ జ్ఞానాన్ని ప్రదర్శించి, ఆ జ్ఞానం ద్వారా ప్రజలను ఆకట్టుకోండి. మహత్యాలతో కాదు, జ్ఞానంతోనే మనుషులను ప్రభావితం చేయాలి.”
- “జ్ఞాని ఎప్పుడూ ఆనందంలో ఉంటాడు, అజ్ఞాని ఎప్పుడూ దుఃఖంలో ఉంటాడు”.
- “ఆత్మ జ్ఞాని దిగి వచ్చిన దేవుళ్ళమైన మనం లోక కళ్యాణం చేస్తే ఎదిగి వెళతాము అని తెలుసుకున్నవాడు, బోధించేవాడు”
- “ఆత్మ జ్ఞాని శరీరం యొక్క గొప్పతనాన్ని, మానవ జన్మ యొక్క గొప్పతనాన్ని తెలుసుకున్నవాడు”.
- “ఆత్మ జ్ఞానికి పుట్టుకైనా, మరణమైనా పండుగే, కానీ అజ్ఞాని పుట్టినప్పుడు సంబరపడతాడు, మరణించినప్పుడు దుఃఖిస్తాడు”

- బ్రహ్మర్షి తటవర్తి వీర రాఘవరావు

రూ.**80**/-


**తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మిగార్ల పుస్తకములు**

**వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు**

**ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.**

| Telugu Books | English Books | Hindi Books | Kannada Books | Tamil Books |
|---|---|---|---|---|